తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్ : fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
11-7-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 161 పేజీలు: 10+4 వెల: 6.50





ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ


హైదరాబాద్‌లో 16 నుంచి బోనాల సందడి 3లో

ట్రంప్ హత్యకు ఇరాన్ కుట్ర: ఇజ్రాయెల్ 5లో



శుక్రవారం ఆక్లాండ్ విమానాశ్రయంలో ప్రధాని మోడీకి ఘనంగా స్వాగతం పలికిన న్యూజిలాండ్ ప్రధాని లక్సన్

## ఆక్లాండ్‌లో ప్రధాని మోడీకి అపూర్వ స్వాగతం

### ప్రొటోకాల్ పక్కనపెట్టి మోడీకి స్వాగతం పలికిన న్యూజిలాండ్ ప్రధాని లక్సన్

**ఆక్లాండ్,జులై 10:** మూడు దేశాల విదేశీ పర్యటనలో భాగంగా చివరి దశలో న్యూజిలాండ్‌కు చేరిన ప్రధాని నరేంద్రమోడీకి న్యూజిలాండ్ ప్రధాని ఘనంగా స్వాగతంపలికారు. శుక్రవారం ఆయన ఆక్లాండ్‌నగరంలో అడుగు పెట్టారు. ఒక భారత ప్రధాని న్యూజిలాండ్లో పర్యటించడం ఇదే తొలిసారి కావడంవిశేషం. న్యూజిలాండ్ ప్రధాన మంత్రి క్రిస్టోఫర్ >>2

## రాముడిపై ఒట్టేసి చెబుతున్నా..

# మళ్లీ వచ్చేది కాంగ్రెస్సే

### పెంపు తర్వాత 117 ఎమ్మెల్యే, 20 ఎంపి సీట్లు సాధిస్తాం..

### రాహుల్‌ను ప్రధాని చేయడమే లక్ష్యం

### 30 నెలల్లో రైతుల కోసం 1.70 లక్షల కోట్లు ఖర్చు చేశాం

### కన్నెపల్లి పంప్‌హౌస్‌లు ఆన్ చేస్తే భద్రాచలం సహా 44 గ్రామాలు అదృశ్యం

### జగన్నాథపురం రైతు ఆశీర్వాద సభలో సిఎం రేవంత్



శుక్రవారం జగన్నాథపురం రైతు ఆశీర్వాద సభలో రైతు భరోసా డబ్బును ఖాతాల్లోకి జమచేస్తున్న సిఎం రేవంత్ రెడ్డి చిత్రంలో డిప్యూటీ సిఎం భట్టి, మంత్రులు తుమ్మల, ఉత్తమ్, పొంగులేటి, శ్రీధర్‌బాబు తదితరులు

**ఖమ్మం బ్యూరో, జులై 10, ప్రభాతవార్త :** తెలంగాణలో రెండోసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, భద్రాచలం రాముడిపై ఆనచేసి చెబుతున్నానని కల్వకుంట్ల చంద్రశేఖర రావుకు సిఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న 17 ఎంపీ స్థానాలు 26కు, 117 ఉన్న ఎమ్మెల్యే స్థానాలు 182కు పెరుగుతాయని 182 ఎమ్మెల్యే స్థానాలలో కాంగ్రెస్ పార్టీ 117 సీట్లు గెలుచుకొని అధికారం చేపడు తుందని ఇది భద్రాచలం రాముడిపై ఒట్టేసి చెబుతు న్నానని రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్ర వారం మధ్యాహ్నం ఖమ్మంజిల్లా చింతకాని మండలం, జగన్నాధపురం గ్రామం,మత్కేపల్లి క్రాస్‌రోడ్డు వద్ద జరిగిన రైతుఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 2023లో జరిగిన ఎన్నికలకు ముందు తాను చెప్పినదే నిజమైందని రేవంత్ రెడ్డి అన్నారు.67 స్థానాలతో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, సిపిఐ ఒక స్థానం గెలుచుకుంటుందని తాను ఆరోజు చెప్పిన మాట ఎన్నికల ఫలితాలలో నిజమైందని, రానున్న ఎన్నికల్లో కూడా తాను చెప్పేదే నిజమై తీరు తుందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పాపాల భైరవుడని ఫామ్ హౌస్‌లో బంధించామని అతను బయటికి రాలేదని, తాను అధికారంలోకి వస్తే కెసిఆర్ ఫామ్ హౌస్‌కి పరిమితం అవుతాడని తాను గతంలోనే చెప్పా నని తాను చెప్పిందే జరిగిందన్నారు.

తెలంగాణ రాజకీయ ముఖచిత్రం నుండి బిఆర్ఎస్‌ను తరిమికొట్టాలని కాంగ్రెస్ కార్యకర్తలకు రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. కుటుంబ కలహాలతో కెసిఆర్ ఉక్కిరి బిక్కిరి అవుతున్నారని కుటుంబంలో ఒకరిపై మరొకరికి నమ్మకం లేదని బావకు బామ్మర్ది పైన, బామ్మర్దికి బావ పైన నమ్మకాలు లేవన్నారు. కేసుల నుండి బయట పడటానికి హరీష్ రావు చీకట్లో బిజెపితో మంతనాలు జరుపుతున్నాడని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఇది నిజం కాకపోతే భద్రాచలం రాముడిపై ఒట్టు వేయాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయం తెలిసే కెటిఆర్ హరీష్‌రావుని దగ్గరకు రానివ్వడం లేదని పేర్కొన్నారు. తాను చెప్పేవన్నీ వాస్తవాలని దొంగ సర్వేలతో, దొంగ ఏజెన్సీలతో ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని సిఎం హెచ్చరించారు. తమ క్యాబినెట్ సహచర మంత్రులు రోజుకు 18 గంటలు పనిచేస్తున్నారని, తెలంగాణలో ఏ ఒక్కరికి అన్యాయం జరగనివ్వమని స్పష్టం చేశారు. దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, మైనారిటీలు, మహి ళలు, రైతులు,విద్యార్థులు, ప్రతి ఒక్కరికి సంక్షేమ పథ కాల అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టంచేశారు. కాంగ్రెస్‌పార్టీ తెలంగాణలో రామ >>2

## కొండా సురేఖ, తుంగతుర్తి వివాదాల పరిశీలకులుగా

# సచిన్ సావంత్, జగ్గారెడ్డి



### విషయ సేకరణ చేసి పార్టీకి నివేదించనున్న నేతలు

### కార్పొరేషన్ పదవులపై 15న సిఎం, మీనాక్షితో చర్చ

### పదేళ్లలో చేయనది మూడు నెలల్లో హరీష్‌కు సాధ్యమా: పిసిసి చీఫ్ మహేష్ గౌడ్

**హైదరాబాద్, జులై 10,ప్రభాతవార్త:** కడియం శ్రీహరి, కొండ సురేఖ, తుంగతుర్తి వివాదంలో సచిన్ సావంత్, జగ్గారెడ్డిలను ఇద్దరిని పరిశీలకులుగా నియమించామని టిపిసిసి చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. గాంధీ భవన్‌లో శుక్రవారం మీడియాతో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలు ఉన్నాయి అవన్నీ తొలగుతాయనీ ఆశాభావం వ్యక్తం చేశారు. క్రమశిక్షణ కమిటీ అందరికీ సమానమే అని అన్నారు. ప్రజా స్వామ్య పరిరక్షణ కోసం కొంత మంది ఎమ్మెల్యేలు మాకు మద్దతు ఇచ్చారనీ ఆయన తెలిపారు. సచిన్ సావంత్, జగ్గారెడ్డి ఇద్దరు వివాదంకు సంబందించిన విషయ సేకరణ చేసి పార్టీకి నివేదించిన తరువాత చర్యలు ఉంటాయనీ అన్నారు. హరీష్ రావు పదేండ్లు మంత్రిగా ఉండి ఏమి చేశావు, మళ్లీ మూడు నెలలు టైమ్ ఎందుకు ఇవ్వాలనీ బొమ్మ ప్రశ్నించారు. హరీష్ రావు కట్టిన ప్రాజెక్ట్ కుంగిపోయింది దానికి ఏమి సమాధానం చెపుతావు అని ఎదురుదాడి చేశారు.హరీష్ రావు మా పార్టీలోకి వస్తానని చెపితే మా పొలిటికల్ ఎఫైర్స్ కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామనీ మహేష్ ఆఫర్ ఇచ్చారు. మీ 12 ఏండ్ల పాలనలో సామాన్య ప్రజలకు ఒరిగింది ఏంది >>2



శుక్రవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన "మీట్ ది ప్రెస్"లో మాట్లాడుతున్న సిఇఒ సుదర్శన్‌రెడ్డి

# డబుల్ ఓట్లు ఉంటే.. యేడాది జైలు

### ఎన్యూమరేషన్ ఫారం నింపటం తప్పనిసరి

### నిజమైన ఓటర్ల పేర్లను తొలగించే ప్రసక్తి లేదు

### వచ్చేనెల కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు

### మీట్ ది ప్రెస్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

**హైదరాబాద్, జూలై 10,ప్రభాతవార్త:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రజల్లో ఎలాంటి అపోహలు అవసరం లేదని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) సి. సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ అనేది ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్)కు పూర్తిగా భిన్నమైన ప్రక్రియ అని, పరిశుభ్రమైన, ఖచ్చితమైన ఓటరు జాబితాను రూపొందించడమే దీని ప్రధాన ఉద్దేశమని తెలిపారు. మరణించిన, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన, అనర్హులైన ఓటర్ల పేర్లను మాత్రమే నిబంధనల మేరకు తొలగిస్తామని, నిజమైన ఓటర్ల పేర్లు తొలగించే ప్రశ్నే లేదన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన "మీట్ ది ప్రెస్" కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఇప్పటి వరకు దేశంలోని 13 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ పూర్తయిందని, ప్రస్తుతం తెలంగాణ, పంజాబ్ రాష్ట్రాల్లో కొనసాగుతోంద న్నారు. జూలై 26 వరకు నమోదైన ప్రతి ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్నామని, ఫారం సమర్పించిన ప్రతి ఒక్కరికీ రసీదు అందజేస్తున్నామని తెలిపారు. 2002 ఓటరు జాబితాలోని వివరాలు అందు బాటులో ఉంటే వాటిని నమోదు చేయవచ్చని, పూర్వీకుల వివరాలు తెలియని వారు కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఫారం సమర్పించవచ్చని చెప్పారు. ఫారం సమర్పించిన వారి పేర్లు ముసాయిదా ఓటరు జాబితాలో ఉంటాయని, పేర్లు లేకపోతే కొత్త నమోదు కోసం ఫారం6, సవరణలు లేదా చేర్పుల కోసం ఫారం8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

ఎన్యూమరేషన్ ఫారం నింపడం ప్రతి ఓటరికి తప్పనిసరి అని పేర్కొన్న సుదర్శన్ రెడ్డి, హైదరాబాద్‌లో కొన్ని ప్రాంతాల్లో బూత్ లెవల్ అధికారులు (బిఎల్ఒలు) వెళ్లడంలేదన్న ఫిర్యాదులపై స్పందిస్తూ, చిరునామాల అస్పష్టత, తరచూ నివాస మార్పులు ఇందుకు కారణమని చెప్పారు. బిఎల్ఒలకు సహకరించేందుకు మున్సి పల్ సిబ్బందిని నియమించామని, చదువుకున్న >>2

## కాల్పుల విరమణ ముగిసిందని చెప్పేశా

### ఇరాన్‌తో చర్చలకు అభ్యంతరం లేదు: ట్రంప్

**వాషింగ్టన్,జులై 10:** ఇరాన్ మళ్లీ చర్చలు కొనసాగించాలని అమెరికాను సంప్రదించిందని, అందుకు అమెరికాఅంగీకరించినప్పటికీ ఇరు దేశాల మధ్య అమల్లో ఉన్న కాల్పుల విరమణ (సీజ్‌ఫైర్) ఇక ముగిసిపోయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టంచేశారు. తన సామా జిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో ఈ >>2

# బలపడుతున్న సూపర్ ఎల్ నినో

### మళ్లీ మండుతున్న ఎండలు ● వర్షాల మందగమనంతో మారిన వాతావరణం



**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త:** ప్రస్తుత సీజనులో వర్షాలు ముమ్మరంగా కురవాల్సిన సమయంలో ఉష్ణోగ్రతలు పెరిగి, ఎండలు చోటు చేసుకుంటున్నాయి. రెండ్రోజు లుగా తెలంగాణలోని పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దీంతో ఎండలు మళ్లీ దంచికొడుతు న్నాయి. రాష్ట్రంలో గడచిన 24 గంటల్లో ఉష్ణోగ్ర తలు ఒక్కసారిగా పెరిగాయి. సూర్యాపేట జిల్లా చేవెళ్లలో అత్యధికంగా 38.2 డిగ్రీ సెల్సియస్‌ల ఉష్ణోగ్రత నమో దైంది. అంతేకాకుండా సుమారు 20 జిల్లాల్లో ఉష్ణో గ్రతలు 35 డిగ్రీ సెల్సియస్ వరకు నమోదయ్యాయి. ఇక ఈ నెల 11 నుంచి 15 మధ్య రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు భారీగా పెరగనున్నాయి. ముఖ్యంగా 12 నుంచి 15 వరకు ఎండల తీవ్రత మరింత ఎక్కువగా ఉండనుంది. తూర్పు తెలంగాణ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు 37 నుండి 40 డిగ్రీ సెల్సియస్ వరకు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ నగరంలో సైతం ఉష్ణోగ్రతలు 35 నుండి 37 డిగ్రీ సెల్సియస్ వరకు చేరి, జనా లను ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి చేయను న్నాయి. తీవ్రమైన ఎండల కారణంగా అక్కడక్కడా స్థానికంగా మేఘాలు పట్టి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నప్పటికీ, జులై నెల సగటు వర్షపాతంతో >>2







# రైస్ మిల్లర్ల అక్రమాలకు ఇక కళ్లెం

### ● సివిల్ సప్లై లీగల్ సెల్ బలోపేతం ● బకాయిలు వెంటనే చెల్లించాలని మిల్లర్లకు నోటీసులు ● 348 మిల్లు యజమానులపై క్రిమినల్ కేసులు ● 128 మందిపై ఆర్ఆర్ చట్టం నమోదు ● ఎఫ్ఐఆర్, రిమాండ్ ఛార్జిషీటు, పంచనామా రికార్డు రికవరీపై అధికారులకు శిక్షణ: స్టీఫెన్ రవీంద్ర



సివిల్ సప్లయ్ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర

**హైదరాబాద్, జులై10, ప్రభాతవార్త:** "చట్టాలకు సామాన్యులు లోకువైతే సమర్థులకు చట్టాలు లోకువైనట్లు" బడాబాబులు తప్పటడుగులు వేస్తూ చట్టాలకు అతీతులుగా వ్యవహరించినట్లు గానే రాష్ట్రంలోని రైసుమిల్లర్లు కొంత మంది చట్టాలను కూడా లెక్కచేయకుండా అక్రమాల చేతివాటం ప్రదర్శించారు. అక్రమా ర్కులైన కొంతమంది రైసు మిల్లర్లను కట్టడి చేసేందుకు ప్రభుత్వం కఠినచర్యలకు ఉపక్రమిస్తుండటంతో ఇన్నాళ్లు అనుభవించు రాజా అంటూ దర్పం చూపినవాళ్లు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పౌరసరఫరాల శాఖ కేసులు కోర్టుల్లో వీగిపో కుండా, నిందితులకు ముందస్తు బేయిల్ ఇవ్వకుండా ఒక లీగల్‌టీం ఏర్పాటు చేసి మార్గ దర్శకాలను రూపొందించడమే కాకుండా పోలీసు, సివిల్ సప్లయ్‌శాఖ సిబ్బందికి పంచ నామా రిపోర్టు, ఎఫ్ఐఆర్ చార్జీషీటు రిమాండ్ రిపోర్టు, రికార్డు రికవరీ వంటి అంశాలకు శాస్త్రీయంగా కోర్టుల్లోనిలబడే రీతిలో నివేదికలు రూపొందించే శిక్షణ ఇచ్చారు. మూడేళ్ల క్రితం పెండింగ్‌లో ఉన్న యాసంగి సీజన్‌కు సంబం ధించిన బకాయిలను ఆగస్టు ఐదులోగా త్వరితగతిన చెల్లించాల్సిందిగా మిల్లర్లకు నోటీసులతో లీగల్ చర్యలు పకడ్బందిగా తీసుకొనేందుకు సివిల్ సప్లయ్ కమీషనర్ కఠిన నిర్ణయాలు తీసుకొని అమలు చేస్తున్నారు. తెలంగాణలో కస్టమ్ మిల్లింగ్ బియ్యం ఇవ్వ కుండా పౌరసరఫరాల శాఖకు సవాల్ విసరు తున్న రైస్‌మిల్లు అక్రమార్కులకు ముకుతాడు వేసేందుకు పౌరసరఫరాలశాఖ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర లీగల్‌సెల్ బలోపేతంచేయడమే కాకుండా బండారు మారుతి, అంజయ్యవంటి డిఫాల్టర్లును అరెస్టుచేసి జైలు ఊచలు లెక్కించే లాచేశారు. రాష్ట్రవ్యాప్తంగా సివిల్‌సప్లయ్ డిఎంలు, డిఎస్‌లు, ప్రతి పోలీసు స్టేషన్‌లో సుమారు వెయ్యికిపైగా సివిల్ సప్లయ్ కేసుల గతఅనుభవాలతో రూపొందించిన గైడ్‌లైన్స్ పుస్తకాలు పంపిణీ చేశారు. రాష్ట్రంలో 348 రైసుమిల్లుల యజమానులపై క్రిమినల్ కేసులు, 128 మిల్లుయజమానులపై ఆర్ఆర్ యాక్టును నమోదు చేశారు. సుమారు >>2


శుక్రవారం మెల్‌బోర్న్‌లోని క్రికెట్ గ్రౌండ్‌లో ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనితో ప్రధాని మోడీ

# ప్రధాని మోడీకి అపూర్వ స్వాగతం

>> లక్సన్ స్వయంగా విమానాశ్రయానికి విచ్చేసి, ప్రధాని మోడీని ఆలింగనం చేసుకుని అత్యంత ఆత్మీయంగా, ఘనంగా స్వాగతం పలికారు. ఇండోనేషియా, ఆస్ట్రేలియా పర్యటనల అనంతరం ఆయన ప్రయాణిస్తున్న ఎయిర్ ఇండియా వన్ ప్రత్యేక విమానం ఆక్లాండ్ విమానాశ్రయంలో ల్యాండ్ అయింది. విమానం దిగి వచ్చిన ప్రధాని మోడీకి న్యూజిలాండ్ ప్రధాన మంత్రి క్రిస్టోఫర్ లక్సన్ ప్రోటోకాల్‌ను పక్కనబెట్టి మరీ ఘనంగా స్వాగతం పలికారు. ఇద్దరు ప్రపంచ దేశాల నేతలు ఎంతో ఆత్మీయంగా కరచాలనం చేసుకుని, ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. గడచిన నాలుగు దశాబ్దాలకు పైగా కాలంలో ఒక భారత ప్రధాని న్యూజిలాండ్‌లో జరుపుతున్న తొలి అధికారిక పర్యటన ఇదే కావడం విశేషం. ప్రధాని లక్సన్ ప్రత్యేక ఆహ్వానం మేరకు నరేంద్ర మోడీ ఇక్కడ రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. గతేడాది 2025 మార్చిలో న్యూజిలాండ్ ప్రధాని లక్సన్ భారతదేశంలో అధికారిక పర్యటన జరిపిన సంగతి తెలిసిందే. ఆ పర్యటన ఇరు దేశాల బంధానికి కొత్త ఊపునివ్వగా, భారత్‌న్యూజిలాండ్ మధ్య చారిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కూడా కుదిరింది. ఆ ఒప్పందం జరిగిన కొన్ని నెలలకే ప్రధాని మోడీ ఈ పర్యటనకు రావడం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ రెండు రోజుల పర్యటనలో భాగంగా ఇరు దేశాల ప్రధానులు ద్వైపాక్షిక సంబంధాల పూర్తి పరిధిని కవర్ చేస్తూ విస్తృతమైన చర్చలు జరుపుతారు.ముఖ్యంగా ఆర్థిక, వాణిజ్య, వ్యాపార సహకారాన్ని మరింత ఉన్నత స్థాయికి విస్తరించడంపై ఈ సమావేశంలో ప్రత్యేక దృష్టి సారించనున్నారు. గత రెండేళ్లుగా భారత్, న్యూజిలాండ్ మధ్య వాణిజ్యం, వ్యాపారం, రక్షణ రంగాలలో సాధించిన గణనీయమైన పురోగతిని, తదుపరి కార్యాచరణను ఈ సందర్భంగా ఇద్దరు నేతలు సమీక్షిస్తారని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ప్రధాని మోడీ చేపట్టిన ఆరు రోజుల విదేశీ పర్యటన ఈ న్యూజిలాండ్ పర్యటనతో ముగియనుంది. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పర్యటనను పురస్కరించుకుని ఆక్లాండ్ నగరం సరికొత్తగా ముస్తాబైంది. ఇరు దేశాల స్నేహానికి ప్రతీకగా ఆక్లాండ్లోని అత్యంత ప్రతిష్టాత్మకమైన 'స్కై టవర్ ను శుక్రవారం రాత్రి భారత త్రివర్ణ పతాక వర్ణాల విద్యుద్దీపాలతో అలంకరించారు. ఈ అద్భుతమైన దృశ్యాన్ని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఎక్స్ వేదికగా పంచుకుంటూ, ప్రధాని మోడీకి ఆక్లాండ్లో అపూర్వ స్వాగతం లభించిందని పేర్కొన్నారు. ప్రధాని లక్సన్ ప్రోటోకాల్‌ను పక్కనబెట్టి విమానాశ్రయంలో స్వాగతం పలకడం, స్కై టవర్ను త్రివర్ణ శోభితం చేయడం ఇరు దేశాల మధ్య ఉన్న దృఢమైన బంధానికి నిదర్శనమని, ఈ పర్యటన పలు రంగాలలో సహకారానికి కొత్త మార్గాలను తెరుస్తుందని విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

# బలపడుతున్న సూపర్ ఎల్ నినో

>> పోలిస్తే చాలా తక్కువ శాతమేనని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. కాగా రాష్ట్రంలో తీవ్రమైన బ్రేక్ మాన్సూన్ పరిస్థితులు నెలకొనే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 15 వరకు రాష్ట్రంలో ఎక్కడా పెద్దగా వర్షాలు కురిసే అవకాశం లేదని, మళ్లీ మినీ సమ్మర్ రోజులు రాబోతున్నాయని తెలిపారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వేసవి పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఎల్ నినో ప్రభావం కారణంగానే ఈ పరిస్థితులు తలెత్తుతున్నట్లు వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. నైరుతి మందగమనంతోనే ఉష్ణోగ్రతలు పెరిగినట్లు వాతావరణశాఖ అంచనా వేసింది. పశ్చిమ దిశ నుంచి వేడి పొడిగాలులు మొదలవ్వడంతో పాటు ఎండల తీవ్రత పెరిగిందని వాతావరణశాఖ వెల్లడించింది. ఇదే సమయంలో ఎండలతీవ్రతకు వాతావరణ అనిశ్చితి నెలకొని సాయంత్రంపూట అక్కడక్కడ పిడుగులు, ఈదురుగాలులతో స్వల్పంగా వర్షాలు కూడా పడుతు న్నాయి. రాష్ట్రంలో రాగల ఐదు రోజులు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలతో పాటు 40 నుండి 50కి.మీవేగంతో బలమైనగాలులు వీచే అవకాశమున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

# సంపూర్ణ రుణమాఫీ ప్రమాణం ఏమైంది?

## సిఎం రేవంత్‌ను ప్రశ్నించిన హారీశ్ రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై10:** ఖమ్మం జిల్లాలో నిర్వహించిన రైతు ఆశీర్వాద సభలో సిఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి,బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు స్పందించారు. మాట తప్పడం, పార్టీలు మారడం నీ రాజకీయ సంస్కృతి కావొచ్చు. కానీ నాది కాదు. 20 యేళ్ల నీ రాజకీయ చరిత్ర, 25 యేళ్ల నా రాజకీయ చరిత్రనే దానికి నిదర్శనం. నీలాగా ఒట్టు వేసి ఒక మాట, ఒట్టు వేయకుండా మరో మాట చెప్పే అలవాటు నాకు లేదు అని సిఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు గుప్పించారు. భద్రాద్రి శ్రీరాముడి సాక్షి గా సంపూర్ణ రుణమాఫీ చేస్తానని చేసిన ప్రమాణం ఏమైంది? రాష్ట్రం సంగతి పక్కన పెడదాం... కనీసం నువ్వు సభ పెట్టిన ఖమ్మం జిల్లాలో అయినా రైతులందరికీ పూర్తి స్థాయిలో రుణమాఫీ జరిగిందా? అని ప్రశ్నించారు. ఒకవైపు "చివరి యేడాదిలో రాజకీయాలు చేద్దాం" అంటూ.. మరోవైపు ప్రతి బహిరంగ సభలో ఎందుకంత ఆవేశంతో, అసహనంతో రగిలిపోతున్నావు? అని ప్రశ్నించారు. కన్నెపల్లి నుండి నీళ్లు లిఫ్ట్ చేయని నీ చేతగానితనాన్ని అబద్ధాలతో కవర్ చేసుకోవాలని చూడటం హీనమైన చర్య అని వ్యాఖ్యానించారు. కన్నెపల్లి పంపు హౌస్ నుంచి నీళ్లను లిఫ్ట్ చేసి అన్నారం, సుందిళ్ల ద్వారా ఎల్లంపల్లికి తరలించాలని చెబుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదు? రిటైర్డ్ ఇంజనీర్ల సుదీర్ఘ అనుభవం అంటే మీకు లెక్కే లేదా? అని ప్రశ్నించారు.

# సింగరేణి కార్మికుల హక్కుల కోసం ఢిల్లీ దాకా పోరాడుతాం

## మణుగూరు ఏరియా కార్మికుల సమావేశంలో టిఆర్ఎస్ చీఫ్ కవిత

**మణుగూరు, ప్రభాతవార్త, జూలై 10:** సింగరేణి సంస్థను, కార్మికుల హక్కులను కాపాడుకోవడానికి ఎంతటి పోరాటానికైనా సిద మని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వ కుంట్ల కవిత అన్నారు. ఆమె శుక్రవారం బాయిబాట కార్యక్రమంలో భాగంగా సింగరేణి సంస్థ మణుగూరు ఏరియాలోని పీకే ఓసీపీ2 గని వద్ద సింగరేణి కార్మికులతో ప్రత్యేకంగా సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్య లను అడిగి తెలుసుకున్న కవిత... అనంతరం మాట్లాడుతూ సమావేశంలో కాంగ్రెస్ ప్రభు త్వంపై, కేంద్ర వైఖరిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి కార్యక్రమం ఉందని తాము ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుంటే పోలీసులు తొలగించడాన్ని ఆమె తప్పుపట్టారు. పోలీసులు ప్రజాస్వామ్య దేశమన్న సోయి మరిచి, అప్రజా స్వామికంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గతంలో ఎన్‌మైనస్, పబ్లిక్ హాలిడేస్ నిర్ణయాలవల్ల కార్మికు లకు మేలు జరుగుతుందని భావించామని, కానీ దీనివల్ల ఏటా కార్మికులు రూ. 2.5 లక్షలు నష్టపోతున్నా రని తెలిసిందని ఆమె పేర్కొన్నారు. భవిష్యత్తులో కచ్చితంగా ఈ తప్పులను సరిదిద్దుతామని, గతంలో ఉన్న పాత విధానాన్నే అమలు చేసేలా మాట ఇస్తున్నానని హామీ ఇచ్చారు.

# మళ్లీ వచ్చేది కాంగ్రెస్సే

>> రాజ్యాన్ని తీసుకువచ్చిందని ,ప్రతి ఒక్కరూ సుభక్షితంగా ఉండాలన్నదే తమ ధ్యేయమన్నారు. 2023 జూలైలో ఖమ్మంలో ఒక అద్భుత సన్నివేశం జరిగిందని ఆ రోజున పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బిఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడం, భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్ర ముగింపు సభ నిర్వహించడం జరిగిందని ఆ రోజున రాహుల్ గాంధీ ఆ సభలో పాల్గొనడం జరిగిందన్నారు. తిరిగి 3 సంవత్సరాల తర్వాత ఇదే జులై నెలలో ఖమ్మంలో లక్షల మంది రైతులతో సభ నిర్వహిస్తున్నామని ఈ సభ నుండి సవాల్ విసురుతున్నానని వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే చంద్రశేఖర రావు కాస్కో అని రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. తొమ్మిది రోజుల్లోనే తొమ్మిది వేల కోట్ల రూపాయలను రైతు భరోసా డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేసిన ఏకైక ప్రభుత్వం తమదేనని అన్నారు. ఈ రోజున 9 ఎకరాల నుండి 54 ఎకరాలు వరకు ఉన్న రైతులకు ఒక వెయ్యి మూడు కోట్ల రూపాయలను జమ చేయడం జరుగుతుందని సిఎం చెప్పారు. రైతు బీమా, రైతు భరోసా, రైతు రుణమాఫీ, రైతు పండించిన పంటలు గిట్టుబాటు ధరలు, వరికి బోనస్ ధర, ఉచిత విద్యుత్తు, పంట నష్టపరిహారం వీటన్నిటి కొరకు తాము అధికారంలోకి వచ్చిన రోజు నుండి ఈరోజు వరకు 1లక్షా 70 వేల కోట్ల రూపాయలను కేవలం 30 నెలల్లో ఖర్చు చేసిన ఘనత తమ ప్రభుత్వాన్ని అన్నారు. ఉచిత విద్యుత్ కోసం నెలకు 5525 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. ప్రతి రైతుకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేసిన ఘనత తమదేనన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కరెంటు ఉండదన్న కెసిఆర్ ఈరోజున కరెంటు తీగలు పట్టుకోవాలని మాడి మసైపోతావని సిఎం విమర్శించారు. గత ప్రభుత్వం అమలు చేసిన ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ఏ ఒక్కటి తాము తీసివేయలేదని ప్రజలకు ఉపయోగపడే ప్రతి పథకాన్ని అమలు చేస్తున్నామని రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ఉంచి తమకు అప్పగించినప్పటికీ పొదుపు చేస్తూ సంక్షేమాన్ని అందిస్తున్నామన్నారు. ఎద్దు ఏడ్చిన రాజ్యం బాగుండదని పెద్దలు చెప్పినట్లుగా తాము ఆర్థికంగా ఎంత ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ రైతును రాజు చేయడమే లక్ష్యంగా పథకాల అందిస్తున్నామన్నారు. ప్రతిపక్ష బిఆర్ఎస్‌కు కుట్రలు, కుతంత్రాలు, తప్పుడు ప్రచారాలు చేయడం సహజంగా మారిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికలే లేవని అలాంటప్పుడు తాము సర్వే చేయించామని ఆ సర్వేలో టిఆర్ఎస్‌కు అనుకూలంగా ఉందని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయడం వారి అవివేకానికి నిదర్శనం అన్నారు.

2028లో ఎన్నికలు జరగవని తెలంగాణలో 2029లో ఎన్నికలు జరుగుతాయని సిఎం స్పష్టం చేశారు. కన్నెపల్లి పంప్ హౌస్‌లు ఆన్ చేయాలని హరీష్ రావు అనడం అవివేకమని ఆ పంప్ హౌస్ ఆన్ చేస్తే భద్రాచలం దగ్గర గల 44 గ్రామాలు కొట్టుకుపోతాయని ఆయనకు ఆ విషయాలు తెలియవా అని రేవంత్ గళమెత్తారు. రానున్న ఎన్నికల్లో ఆ పార్టీ మనుగుడా కష్టమని రేవంత్ చెప్పారు. తనకు జన్మనిచ్చినది మహబూబ్‌నగర్ జిల్లా అయినప్పటికీ తనకు రాజకీయంగా అవకాశం ఇచ్చింది ఖమ్మం జిల్లా మాత్రమేనని రానున్న ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే లక్ష్యంగా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రేషన్ కార్డులు అందించామని, సన్న బియ్యం అందిస్తున్నామని, ఆర్టీసీ బస్సులు ఉచిత ప్రయాణాలు కల్పించామని, 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తున్నామని, ప్రతి ఇంటికి ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని, ప్రతి రైతుకు ఉచిత కరెంటు ఇస్తున్నామని, డ్వాక్రా మహిళలకు రుణమాఫీలు రద్దు చేశామని, గతంలో 5, లక్షలు ఉన్న రుణాన్ని 10 లక్షలు పెంచామని, సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఇవన్నీ చేస్తున్నందుకేనా తమ ప్రభుత్వాన్ని ఓడిస్తారని బిఆర్ఎస్ నాయకులు ఆరోపణలు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే తెలంగాణ ప్రజలు టిఆర్ఎస్‌ను వంద అడుగుల లోతులో తొక్కి వేశారని ఇక పార్టీ మనుగుడా కష్టమేనన్నారు. ఆ పార్టీ అధికారంలో ఉన్న రోజుల్లో ఎన్ని కోట్ల అవినీతి చేశారు కెసిఆర్ బిడ్డనే ఈరోజు చెబుతుందన్నారు. 1400 కోట్లు ఆంధ్ర కాంట్రాక్టర్లకు అందించిన ఘనత కెసిఆర్‌దేనిని కవిత చెప్పడం నిజం కాదా అని రేవంత్ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే 65,717 ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. రానున్న ఎన్నికల్లో 20 ఎంపీ సీట్లు గెలుచుకొని రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేస్తామన్నారు.

ఆ వైపుగా కాంగ్రెస్ కార్యకర్తలు కష్టపడి పని చేయాలన్నారు. డిప్యూటీ సిఎం మల్లు బట్టి విక్రమార్క మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దేశంలో అధికారంలో ఉన్న రోజుల్లో నిర్మించిన ప్రాజెక్టులు ఈరోజు వరకు దెబ్బ తినలేదని 60 యేళ్లు అయినప్పటికీ కూడా చెక్కుచెదరకుండా అనేక ప్రాజెక్టులు ఉన్నాయని కెసిఆర్ నిర్మించిన కాళేశ్వరం మూడేళ్లలోనే కొట్టుకపోవడమేనక ఎంత అవినీతి ఉందో అర్థమవుతుందన్నారు. సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ప్రజాపాలనను ప్రజలు దీవించాలని కోరారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కాగానే ఐదు లక్షల మందితో మధిరలో బహిరంగ సభను ఏర్పాటు చేస్తామన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను వైరా రిజర్వాయర్‌లోకి తరలించామని తద్వారా సాగరాయకట్టు సశ్యశ్యామలం అవుతుందన్నారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు కట్టించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ప్రతి రైతుకు ఈ పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేస్తామన్నారు.

జిల్లా ఇన్చార్జి మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమన్నారు. ఈ సభలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు బట్టి విక్రమార్క, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు , నీటిపారుదల శాఖ మంత్రిజిల్లా ఇన్చార్జి మంత్రి వాకిటి శ్రీహరి ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఖమ్మం ఎంపీ రామసాయం రఘురాం రెడ్డి, భద్రాచలం ఎంపీ బలరాం నాయక్, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ డాక్టర్ రామచంద్రనాయక్ సీనియర్ ఎమ్మెల్యేలు పాయ వెంకటేశ్వర్లు కోరం కనకయ్య రామదాసు నాయక్, మట్ట రాఘమైతెల్ల వెంకటరావు నవీన్ యాదవ్ ఎమ్మెల్సీలు శంకర్ నాయక్, వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## బంధువులను స్నేహితులను నమ్మించి

# 50 కోట్లు కుచ్చుటోపి

## పరారైన పబ్బ శేఖర్ దంపతులపై చర్లపల్లి పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కేసు నమోదు

**హైదరాబాద్ (కుషాయిగూడ), జులై 10,ప్రభాత వార్త:** స్నేహితులను బంధువులను నమ్మించి సుమారు 50 కోట్ల రూపాయల కుచ్చుటోపి పెట్టి స్విట్జర్లాండ్ పారిపోయిన అబ్బా చంద్రశేఖర్ దంప తులు తప్పిపోయినట్లు చర్లపల్లి పోలీస్‌స్టేషన్లో మిస్సింగ్‌కేసు ఉదంతం మరోఉత్కంఠకు దారి తీసింది. బాధితులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని భవాని నగర్‌లో నివాసముండే పప్పా చంద్రశేఖర్ దంప తులు గత కొన్నిసంవత్సరాలుగా దగ్గర స్నేహితు లను బంధువులను నమ్మించి కోట్లాది రూపాయలు కుచ్చుటోపి పెట్టేందుకు పథకం రచించి ముంద స్తుగా స్విట్జర్లాండ్ పారిపోయారు. ఈ విషయమై బాధితులు మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ సుమతికి వినతిపత్రం అందించడంతోపాటు ఫిర్యాదుచేశారు. ఈకేసు ఎస్ఓటి పోలీసులు దర్యాప్తుచేస్తుండగా. తమతల్లిదండ్రులు స్విట్జర్లాండ్‌వెళ్లి తప్పిపోయా రంటూ చంద్రశేఖర్‌కూతురు చర్లపల్లిపోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం మరొక డ్రామాకు దారితీసింది.

## వారం - వర్జ్యం

11-07-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, పునర్వసు కార్తె
దశమి రా.2.03
కృత్తిక ఉ.11.01
వర్జ్యం : రా.1.19-రా.2.45
దు.కా.5.41-ఉ.7.21
రాహుకాలం – ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** సుదూర ప్రాంతాలలోని మీ ఆత్మీయుల సహాయ సహకారాలు అందుకుంటారు. ఋణాలు కొంతవరకు తీరుస్తారు.

**వృషభం:** వస్త్ర సంబంధిత బాధలు కలుగకుండా జాగ్రత్తలు పాటించండి. పనులు సక్రమంగా పూర్తి చేస్తారు.

**మిథునం:** కుటుంబ అవసరాలు దృష్టిలో ఉంచుకొని పొదుపు పథకాలు రూపొందిస్తారు. వ్యవహారాలలో విజయం.

**కర్కాటకం:** పెద్దలతో మాట్లాడేటప్పుడు సంయమనం పాటించండి. ఉద్యోగులకు ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది.

**సింహం:** సంతానాన్ని సక్రమమైన పంథాలో నడిపించడానికి విశేషంగా కృషి చేస్తారు. సౌందర్య చిట్కాలపై ఆసక్తి చూపుతారు.

**కన్య:** నూతన పెట్టుబడులకు అనుకూలం ఉంటుంది. అవకాశాలు వెతుకుంటూ వస్తాయి. శుభవార్తలు వింటారు.

**తుల:** సంఘంలో ఉన్నతమైన వారి నుండి అనుకూలంగా వ్యవహరించండి కొంత ఊరట కలిగించే అవకాశముంది.

**వృశ్చికం:** సాంకేతిక, పరిశోధన విషయాలపై ఆసక్తి చూపుతారు. వ్యాపారాలలో స్వల్ప లాభాలు ఉంటాయి. వాహనసౌఖ్యం పొందుతారు.

**ధనుస్సు:** మిత్రుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. పురాతన వస్తు సేకరణ చేస్తారు. విహార యాత్రలు చేస్తారు.

**మకరం:** మొండితనం కన్నా సర్దుకు పోవడమే మేలని తెలుసుకుంటారు. వృథా ఖర్చులలో పెద్ద సంపదలు పాటించండి.

**కుంభం:** ఉత్తరాల నుండి ఐదుగురు పత్రాలు. దీర్ఘకాలిక సమస్యలు తీరుతాయి. ప్రయాణాలు లాభిస్తాయి.

**మీనం:** అన్యదేశ పోటీలకు సిద్ధమైన పొదుపు సుగుణాలు. పెండింగ్ కేసులు పరిష్కారం బాటలో ఉంటాయి.

శ్రీమతి ములుగు శివజ్యోతి, కొల్ల, హైదరాబాద్

# సిజెపై పిటిషనర్ దుర్భాషలు

## సుప్రీం కోర్టు నుంచి బయటకు పంపివేసిన సిబ్బంది

**న్యూఢిల్లీ,జులై 10:** సుప్రీంకోర్టులో శుక్రవారం అరుదైన ఘటన చోటుచేసుకుంది. స్వయంగా తన కేసును వాదించేందుకు హాజరైన ఓ పిటిషనర్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌పై దుర్భాషలాడటంతో పాటు కోర్టు హాలులో పత్రాలను గాల్లోకి విసిరి విచారణకు అంతరాయం కలిగించాడు. దీంతో భద్రతా సిబ్బంది అతడిని వెంటనే కోర్టు మందిరం నుంచి బయటకు తీసుకెళ్లారు. శుక్రవారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో జస్టిస్ కె.వి. విశ్వ నాథన్, జస్టిస్ అలోక్ ఆరాధేలు ఉన్న ధర్మాసనం ముందు ఈ ఘటన జరిగింది. ప్రబల్ ప్రతాప్‌గా గుర్తించిన పిటిషనర్ తనను తాను సార్వభౌముడుగా పరిచయం చేసుకున్నాడు. న్యాయమూర్తులను జ్యుడీషియల్ సర్వెంట్స్‌అని సంబోధిస్తూ, లక్నో ఏఎస్పీపై సైబర్ నేరాల సిండికేట్ నిర్వహిస్తు న్నారనే ఆరోపణలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని నేను ఆదేశిస్తున్నానని వ్యాఖ్యానించాడు. దీనిపై ఆశ్చర్యం వ్యక్తం చేసిన జస్టిస్ కె.వి. విశ్వనాథన్, మీరు మాకు ఆదేశాలు ఇస్తున్నారా అని ప్రశ్నించారు. పిటిషనర్ ఆ తర్వాత ప్రధాన న్యాయమూర్తిపై దుర్భాషలాడుతూ తన వద్ద ఉన్న పత్రాలను గాల్లోకి విసిరేశాడు. దీంతో విచారణకు అంతరాయం ఏర్పడింది. వెంటనే అప్రమత్తమైన కోర్టు భద్రతా సిబ్బంది అతడిని అదుపులోకి తీసుకుని కోర్టు హాలుకు బయటకు తరలించారు. అనంతరం కొంతసేపు కోర్టు ప్రాంగణంలోని డీఎస్పీ కార్యాలయంలో అతడిని ఉంచారు. చర్యలు తీసుకోని సుప్రీంకోర్టుఈ ఘటన జరిగినప్పటికీ పిటిషనర్‌పై కోర్టు ధిక్కరణ (కాంటెంప్ట్) లేదా ఇతర కఠిన చర్యలు తీసుకోవద్దని ధర్మాసనం నిర్ణయించింది. తీర్పు వెలువరిస్తూ జస్టిస్ కె.వి. విశ్వనాథన్, "ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోవాలని మేము భావించడం లేదు. కేసు రికార్డులను పరిశీలించాం. హైకోర్టు ఉత్తర్వులో జోక్యం చేసుకునేందుకు సరైన కారణాలు కనిపించలేదు. అందువల్ల స్పెషల్ లీవ్ పిటిషన్‌ను కొట్టివేస్తున్నామని పేర్కొన్నారు.

ఆ వ్యక్తి తీవ్ర మానసిక ఆవేదనలో ఉన్నట్లు కనిపిస్తోంది. ఇది నిరాశ వల్ల వచ్చిన ప్రవర్తన. ఆయన పట్ల మాకు సానుభూతి మాత్రమే ఉంది" అని వ్యాఖ్యానించారు. కేసు నేపథ్యంలక్నోలోని స్పెషల్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ (కస్టమ్స్) ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేస్తూ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు కొట్టివేయడంతో, ఆ నిర్ణయాన్ని సవాలు చేస్తూ పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. సదరు మేజిస్ట్రేట్, ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరిన అతడి దరఖాస్తును ప్రైవేట్ ఫిర్యాదుగా పరిగణించాలని ఆదేశించారు. దీనిపై ట్రయల్‌కోర్టు ఉత్తర్వును సవాలుచేయడానికి చట్టపరమైన ప్రత్యామ్నాయ మార్గం అందుబాటులో ఉందని అలహాబాద్ హైకోర్టు పేర్కొంటూ, తగిన న్యాయ వేదికను ఆశ్రయించేందుకు పిటిషనర్‌కు స్వేచ్ఛ కల్పించింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని తేల్చిన సుప్రీంకోర్టు, స్పెషల్ లీవ్ పిటిషన్‌ను కొట్టివేసి కేసును ముగించింది.


శుక్రవారం జగన్నాథపురం బహిరంగసభకు హాజరైన అశేష ప్రజానీకం

# రైస్ మిల్లర్ల అక్రమాలకు ఇక కళ్లెం

>> 8వేల కోట్ల రూపా యల విలువగల బియ్యం తిరిగి రాబట్టుకొనేందుకు స్టీఫెన్ రవీంద్ర చొరవ తీసుకొంటున్నారు. పౌర సరఫరాలశాఖకు కోర్టుడ్యూటీలో ఇద్దరు ఎస్ఐ స్థాయి అధికారులను ప్రత్యేకంగా నియమించి పర్య వేక్షణ చేస్తున్నారు. ప్రతివారం కోర్టుడ్యూటీ ఎస్ఐ లతో సమీక్ష జరుపుతూ చట్టపరంగా డిఫాల్టు రైసు మిల్లర్లపై ఒత్తిడి సివిల్ సప్లయ్‌శాఖ కమీషనర్ పెంచుతుండతో రైసుమిల్లర్లు ఉక్కిరి బిక్కిరి అవుతు న్నారు.వేలంవేసి బియ్యంతాలుకు బియ్యం ఇచ్చుడో లేక డబ్బులుఇచ్చుడో ప్రస్తుతం రైసుమిల్లర్ల ముందు తక్షణ కర్తవ్యంగామారింది. 2023 తరువాత కస్టమ్ మిల్లింగ్ బియ్యం ఇవ్వని వారిపై కూడా ఆయన ఒత్తిడి పెంచుతున్నారు. శాస్త్రీయపద్ధతిలో లీగల్‌గా చర్యలుతీసుకొంటుండటంతో ఇటీవల పౌర సరఫరాలశాఖ రైసుమిల్లర్లపై తొలి విజయం సాధిం చడమే కాకుండా హైకోర్టు 107 పేజీల జడ్జిమెంట్ ద్వారా నాలుగువేల కోట్ల డిఫాల్టర్ల ఆస్తుల రికవరీకి మార్గం సుగమం అయింది. గతంలో ఏడేళ్ల పైగా శిక్షపడే కేసులు పెట్టినా కూడా చట్టంలో ఉన్న లొసుగులకారణంగా రైస్‌మిల్లర్లు ముందస్తు బెయిల్ పొందే వాతావర్ణం ప్రస్తుతం లేకుండా మార్గదర్శ కాలు కింది వరకు చేరేలా చట్టంపై అవగాహన పెంచే చర్యలు తీసుకొన్నారు. రైసుమిల్లర్లతో ఓవైపు చట్టరమైన పోరాటం చేస్తునే మరోవైపు కమీషనర్ ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు తలెత్త కుండా చేశారు. కోవిడ్ సీజన్‌లో అత్యధికంగాత తెలంగాణలో 141లక్షలమెట్రిక్ టన్నులు ధాన్యం సేకరణ చేస్తే ప్రస్తుత సీజన్‌లో 153లక్షల మెట్రిక్ టన్నుల చేయడం జరిగింది. ముఖ్యంగా హమాలీ కొరతను యాంత్రీకరణతో పూడ్చుకోవడానికి సివిల్ సప్లయ్‌శాఖ అలోచనలు చేస్తోంది.రాబోయే సీజన్‌లో దాన్యం సేకరణకు హమాలీల కొరత ఉండకుండా ప్రయత్నాలు మొదలు పెట్టారు. మిషన్ కె10తో ఆటంకరహిత ధాన్యం సేకణ చేయడానికి అడు గులు వేస్తున్నారు.

# డబుల్ ఓట్లు ఉంటే.. యేడాది జైలు

>> ఓటర్లు ఆన్‌లైన్లో కూడా ఫారాలు సమర్పించవచ్చన్నారు.ఫారం సమర్పించినప్పటికీ పేరు జాబితాలో లేకపోతే సంబంధిత వ్యక్తికి నోటీసు ఇచ్చి వివరణకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఓటరు పేరును తొలగించడం అంత సులభం కాదని, అన్ని నిబంధనలు పాటించి, నోటీసులు జారీ చేసి, ఈఆర్వో సంతృప్తి చెందిన తర్వాతే నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు. అసంతృప్తి ఉన్న వారు జిల్లా కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవచ్చన్నారు.హైదరాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో ఉర్దూ మాట్లాడే ఓటర్లు అధికంగా ఉన్నందున ఎన్యూమరేషన్ ఫారాలను ఉర్దూలో కూడా ముద్రించేందుకు భారత ఎన్నికల సంఘాన్ని కోరామని, అనుమతి లభిస్తే వెంటనే అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. డూప్లికేట్ ఓటర్లను ప్రత్యేక సాంకేతిక విధానాల ద్వారా గుర్తిస్తామని, అనంతరం వారు ఏ నియోజకవర్గంలో ఓటరుగా కొనసాగాలనుకుంటున్నారో తెలియజేయాల్సి ఉంటుందని చెప్పారు. తప్పుడు నమోదు చేసిన వారిపై యేడాది జైలు శిక్ష .. జరిమానా విధించే అవకాశం ఉంటుందన్నారు. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఇప్పటికే 59 శాతం మంది ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించగా, హైదరాబాద్‌లో 9శాతమే జరిగిందని ..పాతబస్తీలో కూడా మంచి స్పందన లభిస్తోందన్నారు. ఎస్ఐఆర్ గడువు పొడిగింపుపై తుది నిర్ణయం భారత ఎన్నికల సంఘానిదేనని, అవసరమైతే రాష్ట్రం తరఫున తగిన ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. ఓటరు పేరు తొలగింపును సంక్షేమ పథకాలతో ముడిపెట్టడం ఎన్నికల సంఘం పరిధిలోకి రాదని, అది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ విధానపరమైన అంశమని సిఇఒ సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు.

# పరిశీలకులుగా సచిన్ సావంత్, జగ్గారెడ్డి

>> అని అడిగారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదనీ ప్రశ్నించారు.మా పాలన బాగుంది జనాలు మమ్మల్ని ఆదరిస్తున్నారనీ చెప్పారు. వేరే పార్టీలు తలుపులు తెరిచి ఉంచిన మూసి ఉంచిన ఏమి లాభం లేదనీ అన్నారు. కవిత ఆరోపణల్లో నిజం ఉందనీ,రీజినల్ పార్టీకి రూ.1400 కోట్లు ఎలా వచ్చాయి అన్నారు. మా అభివృద్ధి చూసి హరీష్ రావు మిట్ట మధ్యాహ్నం చుక్కలు చూస్తున్నారనీ ఎద్దేవా చేశారు. "రాష్ట్రంలో నీళ్ల దోపిడి జరిగినప్పుడు ఈటెల రాజేందర్ టిఆర్ఎస్‌లో ఉండు, ఈటెల రాజేందర్ ఆర్థిక మంత్రిగా పని చేసిండు, ఆయనే ప్రజల సొత్తును దుర్వినియోగం చేశారు" అని ఆరోపించారు. జరిగిన తప్పిదాలను ప్రశ్నించకుండా ఈటెల రాజేందర్ బిఆర్ఎస్‌కు మద్దతు పలుకుతున్నట్లు కనిపిస్తుందనీ ఆరోపించారు. రెండు కోట్ల ఉద్యోగాలు ఇచ్చి నబీన్ రాష్ట్రానికి రావాలనీ డిమాండ్ చేశారు. పన్నెండు ఏండ్ల బిజెపి పాలనను ప్రజలు చూశారనీ ఆపార్టీ గురించి తెలిసీ ప్రజలు గోతిలో పడరనీ అన్నారు. ఈ నెల 15న సిఎం రేవంత్ రెడ్డి, మీనాక్షి నటరాజన్‌తో చర్చించి కార్పొరేషన్ పదవుల పై నిర్ణయం తీసుకుంటామనీ తెలిపారు.

# ముగిసిందని చెప్పేశా

>> మేరకు ట్రంప్ పోస్టు చేశారు."ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ మాతో చర్చలు కొనసాగించాలని కోరింది. అందుకు మేము అంగీకరించాం. అయితే కాల్పుల విరమణ ఇక ముగిసిందని వారికి స్పష్టంగా తెలియజేశామని ట్రంప్ పేర్కొన్నారు. పోస్టు చివరలో ఈ విషయంపై మీ దృష్టికి ధన్యవాదాలు అంటూ తన సంతకం కూడా జత చేశారు. అమెరికా దౌత్యపరమైన చర్చలకు తలుపులు తెరిచి ఉంచినప్పటికీ, ప్రస్తుతం ఇరాన్‌తో ఉన్న తాత్కాలిక కాల్పుల విరమణ అమల్లో లేదని ట్రంప్ స్పష్టం చేశారు. వాషింగ్టన్-టెహ్రాన్ మధ్య జూన్ నెలలో పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో కుదిరిన అవగాహన ఒప్పందంలో భాగంగా తాత్కాలిక కాల్పుల విరమణ అమలులోకి వచ్చింది. ఈ ఒప్పందం ప్రకారం 60 రోజుల పాటు శత్రుత్వ చర్యలను నిలిపివేసి, ఇరాన్ అణు కార్యక్రమం, ఆర్థిక ఆంక్షల సడలింపు, హార్ముజ్ జలసంధిలో సముద్ర భద్రత వంటి కీలక అంశాలపై చర్చలు జరపాలని నిర్ణయించారు. అయితే ఖతార్‌లో జరిగిన పరోక్ష చర్చలు ఎలాంటి ఫలితాన్నీ ఇవ్వలేదు. అనంతరం ఇరు దేశాలు పరస్పరం సైనిక దాడులకు దిగడంతో మరోసారి ఉద్రిక్తతలు పెరిగి, యుద్ధ భయం నెలకొంది.ఇంతకుముందు నాటో సదస్సు సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ, టెహ్రాన్‌తో చర్చలు సమయ వృథాగా మారాయని వ్యాఖ్యానించారు. ఇరాన్ నాయకత్వంపై తీవ్ర విమర్శలు చేస్తూ, వారితో వ్యవహరించాలనే ఆసక్తి తనకు లేదన్నారు. అమెరికా చర్చల బృందం దౌత్యపరమైన చర్చలను కొనసాగించేందుకు స్వేచ్ఛగా ఉందని తెలిపారు.టర్కీలో జరిగిన నాటో సమావేశానికి ముందు మీడియాతో మాట్లాడిన ట్రంప్, ఇరాన్‌తో కుదిరిన తాత్కాలిక ఒప్పందం ఇప్పటికీ అమల్లో ఉందా అనే ప్రశ్నకు స్పందిస్తూ, అది ఆసక్తికరమైన ప్రశ్న. నా అభిప్రాయం ప్రకారం అది ముగిసిపోయింది. వారితో నేను వ్యవహరించాలనుకోవడం లేదని అన్నారు. తదుపరి మాట్లాడుతూ, ఇరాన్‌తో మరో ఒప్పందం కుదిరినా అది కొనసాగుతుందనే నమ్మకం నాకు లేదు. వారు విశ్వసనీయత లేని వ్యక్తులుగా కనిపించారని ట్రంప్ వ్యాఖ్యానించారు. అయితే ఈ వివాదం పూర్తిస్థాయి యుద్ధంగా మారే అవకాశాలు తక్కువేనని, ఏదైనా జరిగినా చాలా త్వరగా ముగుస్తుందని, దాంతో చమురు సరఫరా సహా భద్రత మరింత మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు.ట్రూత్ సోషల్‌లో మరో పోస్టులో ట్రంప్, తాజా సైనిక చర్య వాణిజ్య నౌకలపై జరిగిన దాడులకు ప్రతీకార చర్య అని పేర్కొన్నారు. "నిన్న ఇరాన్ వాణిజ్య నౌకలపై జరిపిన దాడులకు ప్రతిస్పందనగానే ఈ చర్య చేపట్టాం. మళ్లీ ఇలాంటి ఘటనలు జరిగితే పరిస్థితి మరింత తీవ్రంగా మారుతుంది" అని ఆయన హెచ్చరించారు.

# ఇథనాల్ వినియోగంతో ఇంధన సామర్థ్యం తగ్గుదల

## ఎట్టకేలకు అంగీకరించిన కేంద్రం

**న్యూఢిల్లీ,జూలై 10:** ఇథనాల్ కలిపిన పెట్రోల్ (ఈ20) వాడకం వల్ల వాహనాలు పాడైపోతున్నాయన్న ఆందోళనలు ఓవైపు వెల్లువెత్తుతుండగా... కేంద్రం మాత్రం దాన్ని సమర్థించుకుంటూ రోజూ ప్రకటనలు విడుదల చేస్తోంది. వాహనాల్లో ఇథనాల్ కలిపిన పెట్రోల్ వాడకం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను మాత్రం అంగీకరించింది. 20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ కొన్ని వాహనాల్లో ఇంధన సామర్థ్యాన్ని 35 శాతం వరకు తగ్గించగలదని చమురు మంత్రిత్వ శాఖ తాజాగా స్పష్టత ఇచ్చింది. ఈ ప్రభావం కంటే అధిక ఆక్టేన్ రేటింగ్, మెరుగైన యాంటీనాక్ లక్షణాలు, వేగవంతమైన దహనం, మెరుగైన పికప్, సున్నితమైన త్వరణం, శుభ్రమైన ఇంజిన్ పనితీరు ,తక్కువ జీవితకాల కార్బన్ ఉద్గారాలు వంటి ప్రయోజనాలే ఎక్కువగా ఉన్నాయని కేంద్రం వాదిస్తోంది. ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ కార్యక్రమంపై వస్తున్న విమర్శలను ఎదుర్కోవడమే లక్ష్యంగా జారీ చేసిన ఒక వివరణాత్మక పత్రంలో పెట్రోలియం ,సహజ వాయువుల మంత్రిత్వ శాఖ, ఈ10 లేదా స్వచ్ఛమైన పెట్రోల్ కంటే ఈ20 ఒక శుభ్రమైన, అధికసాంద్రత గల, మరింత సమర్థవంతమైన ఇంధనమని పేర్కొంది. అలాగే సంవత్సరాల తరబడి శాస్త్రీయ పరీక్షలు, ఆటోమొబైల్ తయారీదారులతో సంప్రదింపులు ,దేశీయ ఇథనాల్ ఉత్పత్తి విస్తరణ తర్వాత మాత్రమే దీనిని ప్రవేశపెట్టినట్లు వెల్లడించింది. ఈ కార్యక్రమాన్ని చాలా తొందరగా అమలు చేశారన్న ఆందోళనలను మాత్రం చమురు శాఖ తోసిపుచ్చింది. భారతదేశపు ఇథనాల్ మిశ్రమం కార్యక్రమం 2001లో ప్రారంభించిన పైలట్ ప్రాజెక్టుల నుండి మొదలైందని, 2006నాటికి దేశంలోని కొన్ని ప్రాంతాల్లో 5 శాతం మిశ్రమాన్ని ప్రవేశపెట్టారని గుర్తుచేసింది.

## నిర్ణీత గడువులోగా 'సర్' ప్రక్రియ పూర్తి చేయాలి

### ఇసిఐ సీనియర్ ఉపఎన్నికల కమిషనర్ పవన్‌కుమార్‌శర్మ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 10:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని భారత ఎన్నికల కమిషన్ సీనియర్ ఉపఎన్నికల కమిషనర్ పవన్‌కుమార్‌శర్మ సంబంధిత అధికారులకు సూచించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న సర్ ప్రక్రియపై పవన్ కుమార్‌శర్మ శుక్రవారం నిర్వహించిన విడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి, జిహెచ్ఎంసి కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు(డిఇఒలు), ఓటరు జాబితా పరిశీలకులు పాల్గొన్నారు. పవన్‌కుమార్‌శర్మ మాట్లాడుతూ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియలను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో డిజిట లైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ప్రత్యేకంగా ఆదేశించారు.

సర్ ప్రక్రియలో అత్యుత్తమ పనితీరును కనబరిచిన జిల్లాల ఎన్నికల అధికా రులతో కమిషన్ మాట్లాడి, వారు అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను తెలు సుకుంది. ఆ వ్యూహాలను ఇతర జిల్లాలు కూడా అమలు చేసి, ఎన్యూమరేషన్ ప్రక్రియను పూర్తి చేసి చేయాలని ఆదేశించారు. అదనంగా, రాష్ట్రవ్యాప్తంగా ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియలను ప్రతిరోజూ నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం పర్యవేక్షి స్తూ వేగవంతం చేయాలని తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారికి భారత ఎన్నికల కమిషన్ ఆదేశించింది. దీంతో ఎస్ఐఆర్ 2026 ప్రక్రియను నిర్ణీత సమయంలో విజయవంతంగా పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించింది.

## యూట్యూబర్ ప్రశ్న రావణ్ ఇంట్లో ఎపి పోలీసుల సోదాలు

### హైదరాబాద్‌లో పలువురి విచారణ, బ్యాంకుల లావాదేవీలపై ఆరా

**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త:** ఎపి డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడంతోపాటు హిందువుల దేవతలను కించపరిచే విధంగా మాట్లాడినందుకు అరెస్టయి నెల్లూరు జైల్లో వున్న తెలంగాణకు చెందిన వివాదాస్పద యూట్యూబర్ జోసెఫ్ అలియాస్ ప్రశ్న రావణ్ ఇంట్లో ఎపి పోలీసులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. శివార్లలోని పటాన్‌చెరులో గల అమీన్‌పూర్‌లో ఉన్న రావణ్ ఇంటిని తనిఖీ చేసిన పోలీసులు ఇంట్లోని వస్తువులను పరిశీలించి అతని భార్యను విచారించారు. రెండేళ్లుగా జోసెఫ్ కుటుంబం ఇక్కడ ఉంటున్నట్లు స్థానికులు తెలిపారు. ఇంట్లోని కొన్ని పత్రాలను, రికార్డులను పోలీసులు జప్తు చేశారు. జోసెఫ్‌తోపాటు అతని భార్యకు వున్న బ్యాంకు ఖాతాలను, కుటుంబసభ్యులకు వున్న ఖాతాలను పోలీసులు పరిశీలించారు.

తనిఖీలను పోలీసులు విడియో తీశారు. దీంతోపాటు నగరం లోని సంజీవరెడ్డినగర్, ఎర్రగడ్డలోగల జోసెఫ్ స్నేహితులను కూడా పోలీ సులు విచారించారు. జోసెఫ్ ఎలాంటి వాడనే విషయమై వారిని విచారిం చారు. జోసెఫ్ బ్యాంకు ఖాతాలో వున్న లావాదేవీలను పోలీసులు ఆరా తీశారు. ఇతని ఖాతాల్లో ప్రతీనెల రెండు లక్షల రూపాయలకుపైగా జమా అవుతుండడంతో ఈ డబ్బు ఎలా వస్తుంది? ఎక్కడ నుంచి వస్తుందనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కాగా ఎపి పోలీసుల వెంట తెలంగాణ పోలీసులు కూడా వున్నారు.



## ఆభరణాల దుకాణంపై బిఐఎస్ దాడులు

### హైదరాబాద్, సికిందరాబాద్‌లోని పాట్ మార్కెట్‌లోని పలు దుకాణాల్లో సోదాలు

**హైదరాబాద్, జులై 10,ప్రభాతవార్త :** బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ అధికారుల బృందం శుక్రవారం హాల్‌మార్కింగ్ ఉల్లంఘించి వినియోగదారులను దోచుకొంటున్న ఆభరణాల దుకాణాలపై దాడులు చేసి అనేక ఆభరణాలను జప్తు చేశారు. భారత ప్రభుత్వం బంగారు ఆభరణాలను హాల్‌మార్కింగ్‌తో విక్రయించాలని 2016లో నోటిఫై చేసినా వాటిని విక్రయించడంలేదని స్పష్టమైన సమాచారం రావడంతో దాడులు చేశారు. హైదరాబాద్ సికింద్రాబాద్‌లోని పాట్ మార్కెట్‌లోని పలు దుకాణాలలో సోదాలుచేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందానికి డిప్యూటీ డైరెక్టర్ కె. కవిన్‌డిప్యూటీ డైరెక్టర్ విజయ్‌రాజ్ బార్బర్ నాయకత్వం వహించారు. రైడ్ సమయంలో అధికారులు తప్పనిసరిగా బిఐఎస్ హాల్‌మార్క్ లేకుండా బంగారు ఆభరణాలను అమ్మకానికి అందిస్తున్నట్లు గుర్తించారు. బిఐఎస్ 164.26గ్రాముల 34 పుస్తెలతాడులు ,27 గ్రాముల బరువు కలిగిన 12 బంగారు ఉంగరం,797.07 గ్రాముల బరువుకలిగిన 27 నెక్లెస్‌లు 57.03 గ్రాముల బరువు కలిగిన ఆరు గాజులు 413గ్రాముల బరువు కలిగిన 17 చైన్‌లు స్వాధీనం చేసుకొంది.

## సిపిఎస్ రద్దు కోసం నేటి నుంచి 'జన జాగరణ యాత్ర'

### 22 యేళ్లుగా సామాజిక భద్రత కోల్పోయిన సిపిఎస్ ఉద్యోగ కుటుంబాలకు న్యాయం చేయాలి

### టిఎస్‌సిపిఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ

**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త:** సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ (టిఎస్‌సీపీఎస్ ఈయు) డిమాండ్ చేసింది. సీపీఎస్ రద్దు కోసం నేటి(శనివారం) నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'జన జాగరణ యాత్ర'ను నిర్వహిస్తున్నట్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ శుక్రవారం మీడియాకు తెలిపారు. 22 యేళ్లుగా సామాజిక భద్రత కోల్పోయిన సీపీఎస్ ఉద్యోగ కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ యాత్రను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త 'జన జాగరణ యాత్ర'ను నేడు(శనివారం) భద్రాద్రి సీతారామచంద్రస్వామి సన్నిధి నుంచి ఘనంగా ప్రారంభం కానుందని రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్య దర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్ గౌడ్‌లు తెలిపారు. 2004 సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చిన సీపీఎస్ విధానం కారణంగా గత 22 ఏళ్లుగా లక్షలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యా యులు, వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక, సామాజిక అభద్రతను ఎదుర్కొంటున్నాయని స్థితప్రజ్ఞ ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ జీవితమంతా కష్టపడి పనిచేసిన అనంతరం కూడా వృద్ధాప్యంలో గౌరవప్రదమైన జీవితం గడపలేని పరిస్థితి నెలకొందన్నారు. సీపీఎస్ ఉద్యోగులు రిటైర్మెంట్ అనంతరం హామీతో కూడిన నెలవారీ పెన్షన్ లేకపోవడం, మార్కెట్‌పై ఆధారపడే పెన్షన్ విధానం కారణంగా ఎంత పెన్షన్ వస్తుందో ఉద్యోగికి ముందస్తు భరోసా లేకపోవడం అన్యాయమన్నారు. జన జాగరణ యాత్రలో భాగంగా ప్రతి జిల్లాలో సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఒకే వేదికపై సమావేశమై అక్కడి నుంచి స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులను కలిసి ఎన్నికల సమయంలో ఇచ్చిన 'సీపీఎస్ రద్దు ఓపీఎస్ పునరుద్ధరణ' హామీని వెంటనే అమలు చేయాలని వినతిపత్రాలు అందజేయనున్నట్టు తెలిపారు.

'నాడు మా ఓట్లతో మీరు గెలిచారు... నేడు మా వృద్ధాప్య భద్రత కోసం పాత పెన్షన్ అమలు చేయండి' అనే విజ్ఞప్తితో ప్రజాప్రతి నిధులను కలవనున్నామన్నారు. ఆఫీస్ సబార్డినేట్ల నుంచి గ్రూప్-1 అధికారుల వరకు అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఈ యాత్రలో పాల్గొంటున్నారని తెలిపారు. ఇప్పటికే ఓపీఎస్‌లో ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వారి సంఘాలు కూడా సంఘీభావం ప్రకటించి ఈ యాత్రలో ప్రత్యక్షంగా పాల్గొంటున్నాయని తెలిపారు. టిఎన్‌జివో, టిజివో, పిఆర్‌టీయు టిఎస్, ఎస్‌టియు టిఎస్, యుటిఎఫ్ టిఎస్, టిఆర్‌టిఎఫ్, టిపియుఎస్, టిపిటిఎఫ్, ఎస్‌జిటియు, టిపిఆర్‌టియు వంటి ప్రధాన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు సీపీఎస్ రద్దుకు మద్దతు ప్రకటించాయన్నారు. వరంగల్- ఖమ్మం-నల్గొండ టీచర్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి కూడా యాత్రకు సంఘీభావం తెలిపి, యాత్రలో పాల్గొంటానని ప్రకటించా రన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నేటి(జులై 11) నుంచి ఆగస్టు 18 వరకు రెండు దశల్లో రాష్ట్రంలోని 33 జిల్లాల్లో జన జాగరణ యాత్ర కొనసాగుతుందన్నారు. జన జాగరణ యాత్ర ముగింపుగా ఆగస్టు 23న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభను నిర్వ హించి, ప్రభుత్వం ఎన్నికల హామీని అమలు చేసి సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించేలా సమస్య తీవ్రతను తెలపనున్నామన్నారు.

## తయారీ రంగానికి తెలంగాణ అత్యంత అనుకూలం

### పెట్టుబడులు పెట్టేలా జర్మన్ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించండి

### జర్మనీ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం భేటీలో మంత్రి శ్రీధర్‌బాబు



శుక్రవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన జర్మనీ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 10:** తయారీ రంగంలో పరిశ్రమల ఏర్పాటుకు దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ అత్యంత అనుకూలమని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా జర్మనీ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిం చాలని ఆ దేశ అత్యున్నత స్థాయి ప్రతినిధి బృందాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. పెట్టుబడులకు అనుకూలమైన పారిశ్రామిక విధానాలు, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులతో ప్రపంచ స్థాయి తయారీ కేంద్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. బవేరియన్(జర్మనీ) మినిస్ట్రీ ఆఫ్ ఎకానమిక్ అఫైర్స్, రీజినల్ డెవలప్‌మెంట్ అండ్ ఎనర్జీ వైస్ మినిస్టర్ టోబియాస్ గోత్‌హార్ట్ నేతృత్వంలోని జర్మనీ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం శుక్రవారం తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ భేటీలో తెలంగాణ - జర్మనీ మధ్య ద్వైపాక్షి క సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు గల అవకాశాలపై చర్చించారు. పారిశ్రామి కాభివృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు, పరిశ్రమలకు కల్పిస్తున్న ప్రోత్సా హకాలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీ, ఏరో స్పేస్, డిఫెన్స్, అడ్వాన్స్డ్ మ్యానుఫ్యాక్చరింగ్, ప్రెసిషన్ ఇంజినీరింగ్, డిజిటల్ ఇంజినీరింగ్, సెమీకండక్టర్లు, ఆటోమోటివ్ అండ్ మొబిలిటీ, ఏఐ, డిజిటల్ హెల్త్, రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్, క్లీన్ ఎనర్జీ, జీసీసీలు, ఇండస్ట్రీ 4.0 తదితర రంగాల్లో తెలంగాణలో విస్తృత పెట్టుబడి అవకాశాలు ఉన్నాయన్నారు. అత్యాధునిక సాంకేతికత, పరిశోధన, ఇన్నోవేషన్, స్కిల్లింగ్‌కు ప్రాధాన్యమిస్తూ... ఈ రంగాల్లో భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేలా సమగ్ర ఎకోసిస్టమ్‌ను రాష్ట్రంలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. తెలంగాణ-జర్మనీ మధ్య భాగస్వామ్యాన్ని పెట్టుబడులకు మాత్రమే పరిమితం కాకుండా సాంకేతికత, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి రంగాలకూ విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్, హైదరాబాద్‌లో జర్మనీ గౌరవ కాన్సుల్ అమితా దేశాయ్, బవేరియా ఆర్థిక శాఖ ఈడీ ఉల్రికే హాఫ్‌మన్, బవేరియా ఇండియా కార్యాలయ ఈడీ జాన్ కొట్టాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో 16 నుంచి బోనాల సందడి

### సంస్కృతీసంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహణ

### ఉత్సవాలకు రూ.20 కోట్లు మంజూరు చేసిన సిఎం

### 16న గోల్కొండ జగదాంబ మహంకాళి ఆలయంలో తొలిబోనం

### దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్ (మెహిదీపట్నం), జులై 10, ప్రభాతవార్త :** ఆషాడమాస బోనాల ఉత్సవాలతో తెలంగాణ ఖ్యాతి విశ్వవ్యాప్తం కావాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం గోల్కొండ కోట ఆవరణలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో గోల్కొండ జగదాంబ మహంకాళి బోనాల వేడుకల ఏర్పాట్లపై నిర్వహించిన సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడుతూ ఈనెల 16 నుండి ఆగస్టు 13 వరకు బోనాల వేడుకలు జరుగుతాయని, 16వ తేదీన ఉదయం 10 గంటలకు లంగర్‌హౌస్ క్రాస్‌రోడ్ నుండి గోల్కొండ కోట వరకు ఊరేగింపు ఉంటుందని మంత్రి తెలిపారు. గోల్కొండ నుండి అమ్మవారి తొలి బోనం జులై 16 న ప్రారంభం అవుతుందని, బోనాల ఉత్సవాల సందర్భంగా ప్రజలకు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ బోనాల ఉత్సవాల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి 20 కోట్ల నిధులను కూడా మంజూరు చేశారని తెలిపారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ నిరంతరం జరగాలని టోల్ ఫ్రీ కంట్రోల్ రూమ్ ఏర్పాటు తప్పకుండా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు నిరంతర పర్యవేక్షణ, చేయాలని, ఆర్ అండ్ బి భక్తులకు ఇబ్బందిగా కలగకుండా బారీ గేట్స్, టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని, రెప్ప పాటు కూడా కరెంటు పోకుండా నిరంతరం విద్యుత్ శాఖ సరఫరా చేయాలని, రెవెన్యూ శాఖ ఏర్పాట్లను పర్యవేక్షి ంచాలని, బోనాలు ప్రశాంతంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో సేవాభావంతో పనిచేయాలని సూచించారు.లక్షలాది మంది భక్తుల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. ట్రాఫిక్, పార్కింగ్, క్యూ లైన్లు, తాగునీరు, వైద్య సేవలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. పరిశుభ్రత, విద్యుత్, భద్రతలో రాజీ వద్దని ఆదేశాలు జారీ చేశారు. శివసత్తులకు బోనాల సమర్పణలో అన్ని శాఖలు సహకరించాలన్నారు. పోలీస్ కంట్రోల్ రూంతో భక్తుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. భక్తులు సంతృప్తిగా దర్శనం చేసుకునేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు మంత్రి కొండా సురేఖ సూచించారు. ఈ కార్యక్రమంలో కార్వాన్ శాసనసభ్యుడు కౌసర్ మొహినుద్దీన్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఆలయ చైర్మన్ ఆకుల చంద్రశేఖర్, డిసిపిలు కాజల్ సింగ్, రాఘవేందర్ రెడ్డి, ఈవో వసంత, ఆర్డీవో రామకృష్ణ, తహసిల్దార్ ప్రవీణ్ కుమార్, ఆలయ మాజీ చైర్మన్లు పరమానందం, చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.



గోల్కొండ జగదాంబ మహంకాళి బోనాల వేడుకల ఏర్పాట్లపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

## వ్యవసాయ రంగం ప్రయోజనానికి శాస్త్రవేత్తల అనుభవాలు కీలకం

### యువ శాస్త్రవేత్తలతో అనుభవాలను పంచుకోవాలి

### ఐసిఎఆర్, డిడిజి డాక్టర్ యశ్‌పాల్‌సింగ్ మాలిక్

**హైదరాబాద్ (అత్తాపూర్), జులై 10, ప్రభాతవార్త:** వ్యవసాయ రంగం అభివృద్ధికి శాస్త్రవేత్తల సూచనలు,అనుభవాలు కీలకమని ఎప్పటికప్పుడు రైతులు,యువ శాస్త్రవేత్తలతో తమ అనుభవాలను పంచుకోవాలని పలువురు అధికారులు పేర్కొన్నారు.శుక్రవారం రాజేంద్రనగర్‌లో నార్మ్ స్వర్ణోత్సవ సంవత్సరం సందర్భంగా ఫోకర్స్ (ఫౌండేషన్ కోర్స్ ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సర్వీస్) రిట్రీట్‌ను ప్రారంభించారు.ఫోకర్స్ పాఠ్యప్రణాళిక, రూపకల్పన మరియు వ్యవధిని మెరుగుపరచడం కోసం అనుభవజ్ఞులైన ఫోకర్స్ శాస్త్రవేత్తల నుండి సూచనలు సేకరించడం, అలాగే ఫోకర్స్ మార్గదర్శకులను మరియు నార్మ్ వర్గాన్ని ఒకచోట చేర్చాడమే ముఖ్యఉదేశ్యంగా కార్యక్రమానికి నిర్వహించారు. అతిథిగా హాజరైన డాక్టర్ యశ్‌పాల్ సింగ్ మాలిక్,ఐసిఎఆర్,డిడీజి మాట్లాడుతూ.. వ్యవసాయ రంగానికి మరింత ప్రయోజనం చేకూర్చేందుకు, అనుభవజ్ఞులైన వ్యవసాయ శాస్త్రవేత్తల గొప్ప అనుభవాలను నమోదు చేసి, యువ శాస్త్రవేత్తలతో పంచుకోవాలని అన్నారు. ఈ రంగంలో ఎదురవుతున్న సవాళ్లను సమర్థవంతంగా పరిష్కరించేందుకు, అనుభవజ్ఞులు శిక్షణ పొందుతున్న శాస్త్రవేత్తలకు మార్గదర్శకత్వం వహించడం కొనసాగించాలని ఆయన మరింతగా నొక్కి చెప్పారు.నార్మ్ డైరెక్టర్, డాక్టర్ ఆర్.మీనాక్షిసుందరం మాట్లాడుతూ.. వ్యవసాయ పరి శోధన నిర్వహణలో అనుభవజ్ఞులైన నాయకులు మరియు విధాన నిపుణుల గొప్ప అనుభవాల నుండి నేర్చుకోవడం ద్వారా, నార్మ్ భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న వ్యవసాయ శాస్త్ర నాయకులను తీర్చిదిద్దగలదని అన్నారు. అటువంటి నాయకత్వం ద్వారా, రైతులకు సేవ చేయడం ద్వారా 2047 నాటికి విక్సిత్ భారత్ దార్శనికతను సాకారం చేయడంలో ఈ సంస్థ దోహదపడగలదని ఆయన అన్నారు.

## ఆస్పత్రిలో అనాథగా నటి పావలా శ్యామల!

### ఆమెను, కుమార్తె మాధవిని ఎర్రగడ్డలోని దవాఖాన ఆవరణలో వదిలివెళ్లిన బంధువులు



**హైదరాబాద్, (జూబ్లీ హిల్స్), జులై 10, ప్రభాత వార్త:** ప్రముఖ సినీనటి పావలా శ్యామలతో పాటు ఆమె కుమార్తె మాధవిని కుటుంబ సభ్యులు గురువారం ఎర్రగడ్డ ప్రభుత్వ ఛాతీ దవాఖాన ఆవరణలో వదిలి వెళ్లిన ఘటన కలకలం రేపింది. దవాఖాన ఆవరణలో ఉన్న పావలా శ్యామలను గుర్తించిన సిబ్బంది, ఇతర రోగులు ఈ విషయాన్ని ఆసుపత్రి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం వైద్యులు ఇద్దరికీ క్షయ (టీబీ) పరీక్షలు నిర్వహించగా, వారికి క్షయ వ్యాధి లేదని నిర్ధారణ అయింది. దీంతో తదుపరి వైద్య పరీక్షల కోసం వారిని అంబులెన్స్ ద్వారా ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఉస్మానియాలో వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ఇద్దరినీ ఆసుపత్రిలో చేర్చుకున్నప్పటికీ, అక్కడ ఉండలేకపోతున్నామని చెబుతూ సాయంత్రం తిరిగి ఎర్రగడ్డ ఛాతీ దవాఖానకు చేరుకున్నారు. గురువారంరాత్రి వారిని అక్కడే ఉంచిన ఆసుపత్రి అధికారులు ఈ విషయాన్ని బోరబండ పోలీసులకు తెలియజేశారు. పోలీసులు శుక్రవారం ఉదయం పావలా శ్యామలతోపాటు ఆమె కుమార్తె మాధవిని లంగర్‌హౌజ్‌లోని ప్రభుత్వ హోంకు తరలించారు. దాదాపు 300కు పైగా తెలుగు చిత్రాల్లో నటించిన పావలా శ్యామల తన ప్రత్యేక నటనతో ప్రేక్షకులకు ఎంతో దగ్గరయ్యారు. అయితే కొంతకాలంగా ఆమె అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు సమాచారం. ఇదే ఏడాది మే నెలలో గుండె సంబంధిత సమస్యలతో కూకట్‌పల్లిలోని ఓ ఆసుపత్రికి వెళ్లిన పావలా శ్యామలను ఆసుపత్రిలో చేర్చుకోలేదని, అనంతరం క్యాబ్ డ్రైవర్ రాత్రి వేళ రోడ్డుపై వదిలివెళ్లిన ఘటన కూడా అప్పట్లో చర్చనీయాంశంగా మారింది.

## హీరోగా ఛాన్స్ ఇస్తానని రూ.3.5 కోట్ల మోసం

### భాగమతి దర్శకుడు అశోక్‌బాబుపై చీటింగ్ కేసు



**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త:** పిల్ల జమీందార్, భాగమతి సహా పలు సినిమాలకు దర్శకత్వం వహించిన ప్రముఖ టాలీవుడ్ దర్శకుడు అశోక్‌బాబుపై సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. ఒక యువకుడిని సినిమాల్లో హీరోగా ఛాన్స్ ఇస్తానని నమ్మించి మూడున్నర కోట్ల రూపాయలు తీసుకుని మోసం చేసినందుకు అశోక్‌బాబుపై ఈ కేసు నమోదయ్యింది. ఈ కేసులో బాధితుడి తండ్రి హనుమంతరావు ఫిర్యా దు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. తన కొడుకును హీరోగా చేస్తానని నమ్మించి పలు దఫాలుగా మూడున్నర కోట్ల రూపాయలు తీసుకున్న అశోక్‌బాబు ఆ తరువాత ముఖం చాటేశాడని హనుమంతరావు తెలిపారు. తమ డబ్బులు వెనక్కు ఇవ్వాలని కోరినా సమాధానం చెప్పకుండా తప్పించుకు తిరుగుతున్నాడని ఆయన వాపో యాడు. ఈ కేసులో నిర్మాత విజయలక్ష్మి హస్తం కూడా ఉందని ఫిర్యాదుదారుడు తెలిపారు. దీనిపై సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం పోలీసులు విచారణ చేబట్టారు.

## బండి భగీరథ్ జైలు నుంచి విడుదల

### పోక్సో కేసులో 55 రోజులు జైలులోనే

**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త:** మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఘటనకు సంబంధించి నమోదైన పోక్సో కేసులో అరెస్టయి చర్లపల్లి జైల్లో 55 రోజులపాటు వున్న బండి భగీరథ్ శుక్రవారం మధ్యాహ్నం విడుదల య్యాడు. భగీరథ్‌కు హైకోర్టు గురువారం బెయిల్ మంజూరు చేయడం తెలిసిందే. దీనికి సంబంధించిన పత్రాలను భగీరథ్ తరపు న్యాయవాదులు శుక్రవారం ఉదయం పూర్తి చేయడంతో మధ్యాహ్నం మూడు గంటల సమయంలో అతను విడుదలయ్యాడు. సైబరాబాద్ పరిధిలోని పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో భగీరథ్ మే నెల 16న అరెస్టవడం తెలిసిందే. అంతకుముందు ముందస్తు బెయిల్ కోసం భగీరథ్ దాఖలు చేసిన పిటిషన్ డిస్మిస్ అవడం విదితమే. దీని తరువాత భగీరథ్‌ను గండిపేట్ వద్ద వుండగా పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు. కాగా ఇంజినీరింగ్ పరీక్షల కోసం గత నెల 20న భగీరథ్‌కు హైకోర్టు ఐదు రోజుల మధ్యంతర బెయిల్ మంజూరు చేయగా అదేరోజున జైలు నుంచి విడుదలయ్యాడు. బెయిల్ గడువు ముగిసిన తరువాత అతను లొంగిపోయాడు.

## మినిస్టర్స్ క్వార్టర్స్ ముట్టడికి విద్యార్థి సంఘాల యత్నం

### అడ్డుకున్న పోలీసులు.. ఉద్రిక్త పరిస్థితి

### బంద్ విజయవంతమని ప్రకటించిన విద్యార్థి సంఘాలు



**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో విద్యారంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా వామపక్ష విద్యార్థి సంఘాలు శుక్రవారం రాష్ట్ర వ్యాప్త బంద్‌కి పిలుపునిచ్చాయి. అందులో భాగంగా విద్యార్థి సంఘాలు మినిస్టర్స్ క్వార్టర్స్ ముట్టడికి ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. మంత్రుల నివాస సముదాయంలోనికి వెళ్లడానికి ప్రయత్నించిన విద్యార్థి సంఘాల నేతలను పోలీసులు అడ్డుకోవడంతో ఇరువురి మధ్య తోపులాటతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. చివరికి విద్యార్థి సంఘాల నేతలను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకి తరలించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. శుక్రవారం నిర్వహించిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఎఐడీఎస్ఓ, ఎఐఎఫ్‌డీఎస్, ఎఐఎస్బీ, ఎఐపీఎస్‌యూ సంఘాల పిలుపుతో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు పెద్ద ఎత్తున బంద్‌లో పాల్గొన్నారని తెలిపారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర మంత్రుల నివాస సముదాయాన్ని విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు ముట్టడించారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులను పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. పలువురు విద్యార్థులపై పోలీసులు పిడిగుద్దులతో దాడి చేసి బలవంతంగా అరెస్టు చేశారని నాయకులు ఆరోపించారు. ప్రజాస్వామ్య బద్ధంగా సమస్యల పరిష్కారం కోరుతున్న విద్యార్థులపై నిర్బంధం ప్రయోగించడం ప్రభుత్వ ప్రజాస్వామ్య వైఖరికి నిదర్శనమని విమర్శించారు. విద్యార్థి సంఘాల రాష్ట్ర నాయకులు టి. నాగరాజు (ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి), పుట్టా లక్ష్మణ్ (ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి), ఎస్. అనిల్ (పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి), పి. మహేష్, పోడపంగి నాగరాజు (పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి), నితీష్ (ఎఐడీఎస్ఓ రాష్ట్ర సహాయ కార్యదర్శి), పల్లె మురళి (ఎఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు), నవీద్ హాకిమ్ (ఎఐఎస్బీ రాష్ట్ర కార్యదర్శి), గోపాల్ (ఎఐపీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు) పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు పూర్తవుతున్నప్పటికీ విద్యాశాఖకు పూర్తి స్థాయి మంత్రిని నియమించకపోవడం విద్యారంగం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని వెల్లడిస్తోందన్నారు.

ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుతున్నప్పటికీ వాటిని నియంత్రించేందుకు ప్రభుత్వం ఇప్పటికీ ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకురాకపోవడం వల్ల విద్య వ్యాపారంగా మారిపోయిందని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు, మధ్యాహ్న భోజనం వంటి కనీస సౌకర్యాలను కూడా నాణ్యంగా, సకాలంలో అందించడంలో విఫలమైందన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా మరింత విస్తృతమైన ఐక్య విద్యార్థి ఉద్యమాలకు శ్రీకారం చుడతామని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు.

తెలంగాణ ప్రభుత్వం
డిస్ట్రిక్ట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ మరియు ఎక్స్-అఫీషియో DPO, TSS, మంచిర్యాల వారి కార్యాలయం

Rc.No. A1/626/GE/2025, టెండర్ ప్రకటన తేది: 10.07.2026

2026-27 విద్యా సంవత్సరానికి మంచిర్యాల జిల్లాలోని (18) PM SHRI పాఠశాలలలో చదువుతున్న విద్యార్థినులకు సానిటరీ ప్యాడ్స్ సరఫరా నిమిత్తం సమోదిత మరియు పేరొందిన సరఫరాదారుల నుండి సీల్డ్ టెండర్ ఆహ్వానించబడుతున్నవి.
11.07.2026 నుండి 18.07.2026 వరకు ఏజెన్సీలు/సరఫరాదారులు జిల్లా విద్యాశాఖాధికారి, IDOC రూమ్ నం.(S-17) మంచిర్యాల కార్యాలయం నుండి టెండర్ షెడ్యూల్స్ మంచిర్యాల జిల్లాలోని (18) PM SHRI పాఠశాలలలో చదువుతున్న విద్యార్థినులకు సానిటరీ ప్యాడ్స్ యొక్క సరఫరా నిమిత్తం అన్ని పని రోజులలో PM (సమయం) పొందవచ్చును. టెండర్ షెడ్యూల్స్ ధర మరియు EMD లు క్రింద పేర్కొనబడిన విధంగా వారి పేరిట తీసిన డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో చెల్లించవలెను.
EMD ల కొరకు "స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్, తెలంగాణ, SSA" టెండర్ షెడ్యూల్స్‌యొక్క ధర నిమిత్తం "డిస్ట్రిక్ట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్, మంచిర్యాల"
టెండర్ షెడ్యూల్స్ యొక్క ధర మరియు ఐటమ్ వారీగా EMD ల వివరాలు
క్ర.సం.:1, సరఫరా చేయవలసిన ఐటమ్: సానిటరీ ప్యాడ్స్, సరఫరా చేయవలసిన పాఠశాలల సంఖ్య: 18, విద్యార్థుల సంఖ్య: 2938, సరఫరా చేయవలసిన బ్రాండ్ & సైజ్: విస్పర్ ఛాయిస్ అల్ట్రా సానిటరీ ప్యాడ్స్ XL, EMD సొమ్ము: రూ.1,00,000/-, టెండర్ షెడ్యూల్ ధర: రూ.5,000/-
సీల్డ్ టెండర్లను డిస్ట్రిక్ట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్, IDOC రూమ్ నం.(S-17) మంచిర్యాల కార్యాలయం వద్ద 11.07.2026 నుండి 18.07.2026 మ.3.00 గం. (సమయం) వరకు దాఖలు చేయవచ్చును. టెండర్‌దారుల సమక్షంలో సీల్డ్ టెండర్లు 18.07.2026 సా.4.00 గం. (సమయం) వద్ద అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) మరియు చైర్మన్, DPC యొక్క కార్యాలయం కలెక్టరేట్ IDOC, మంచిర్యాల వద్ద తెరవబడును.
సం/- డిస్ట్రిక్ట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ & ఎక్స్-అఫీషియో ప్రాజెక్ట్ ఆఫీసర్, TSS మంచిర్యాల"
DIPR.No.5872-PP/CL/Advt/1/2026-27, తేది: 10.07.2026

వార్త


జీవితంలో మమతలు పెంచుకున్నవాడు,
అదే కాలంలో మృత్యుభయాన్ని
హెచ్చించుకుంటాడు.

- లావోస్టే

# 'అణు'బంధం


ఇంధన భద్రతపై ప్రపంచమంతా ఆందోళన చెందుతున్న తరుణంలో భారత్, ఆస్ట్రేలియాల మధ్య ఒక కీలక ఒప్పందం కుదిరింది. ఆస్ట్రేలియా నుంచి శాంతియుత అవసరాల కోసం భారత్‌కు యురేనియం ఎగుమతులకు అన్నివిధాల మార్గం సుగమమైంది. ఇరాన్ యురేనియం ముడిసరుకు కోసం అమెరికా ఖర్గే నుంచి ఎలుక కన్నాల వరకు తొలిచేస్తోంది. అదే సమ యంలో ఎలాంటి వివాదమూ రాజుకోకుండా భారత్‌కు ఆస్ట్రేలియా యురేనియం సరఫరాలో ఒక అడుగు ముందుకేసింది. ఇరుదేశాలు ఆస్ట్రేలియాల నుంచి భారత్‌కు యురేనియం సరఫరాను కార్యరూపంలోకి తెచ్చే పరిపాలనా ఆమోదాలను సిద్ధం చేసుకోవడం కీలకమైన ముందడుగే. నిజానికి తొలి అడుగు ఏనాడో 2014లోనే పడింది.ఆనాడు కుదిరిన పౌర అణు ఒప్పందానికి ఇప్పుడు ఆచరణాత్మక రూపం లభించిందన్న మాట. దీనిని కేవలం ఇంధన వాణిజ్య ఒప్పందంగా భావించకూడదు. ఇంధన భద్రత, ఇండో పసిఫిక్ ప్రాంతీయ సమతుల్యత, సరఫరా గొలుసుల స్థిరత్వం వంటి అంశాలతో ముడిపడి ఉన్నవ్యూహాత్మక భాగస్వా మ్యంగానే గుర్తించాలి. ఆస్ట్రేలియాలో భారత ప్రధాని నరేంద్రమోడీ పర్యటన సందర్భంగా వార్షిక ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశం తర్వాత భారత ప్రధాని, ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ ఆల్బనీస్‌లు సంయుక్తంగా తమ ఒప్పందంలోని కీలక అంశాలను తెలియ చేశారు.తమ ఒప్పందా నికి బాసటగా ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ భద్రతా నిబంధనలు అమల్లో ఉంటాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల పర్యవసానంగా ఈ రెండు దేశాల మధ్య ఏర్పడిన ఒప్పందం ఉభయ తారకమే.ఇంధన సంక్షోభ సమయంలో భారత్, ఆస్ట్రేలియా స్నేహ హస్తం అందుకోవడం లాభదాయకమే. ప్రపంచ ఇంధన సరఫరా ధరలపై యుద్ధ ప్రభావం గణనీయంగాఎక్కువే. ఈ సందర్భంలో ద్రవీకృత సహజ వాయువు సరఫరాలో, ద్రవ ఇంధనాలు, పెట్రోలియం ఉత్పత్తుల సరఫరా లో ఈ రెండు దేశాల భాగస్వామ్యం మంచిదే. భారత్ 2047 నాటికి అణువిద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని గణ నీయంగా పెంచేలక్ష్యంతో ముందుకు సాగుతోంది.బొగ్గుపై ఆధారపడటాన్ని తగ్గిస్తూ తక్కువ కార్బన్ ఉద్గా రాలతో స్థిరమైన విద్యుత్‌ఉత్పత్తిని విస్తరించడానికి యురేనియం అవసరమని అంచనా. భారత్‌కు దేశీయంగా ఉన్న యురేనియం నిల్వలు సరిపోవు. ప్రపంచంలోనే ఆస్ట్రేలియా అతిపెద్ద యురేనియం నిల్వలు కలిగిన దేశం కావున ఆ దేశం భారత్‌కు భారత ఇంధన వ్యూహానికి దీర్ఘకాలిక భరోసానిస్తోంది. ఇండో పసిఫిక్ ప్రాంతంలో పెరుగుతున్న చైనా ప్రాబల్యమే కాకుండా సముద్రభద్రతపై నెలకొన్న ఆందోళనలు, సరఫరా గొలుసుల వైవిధ్యీకరణ,ఆవశ్యకత భారత్‌ఆస్ట్రేలియా సంబంధాలను మరింత సమర్థవంతంగా దగ్గర చేస్తున్నాయి. క్వాడ్ భాగస్వామ్య దేశాలుగా ఇరు దేశాలు రక్షణ సముద్ర భద్రత, సాంకేతికత, కీలకఖనిజరంగాల్లో సహకారాన్ని అందచేసుకుంటాయి. యురేనియం సరఫరా కారణంగా భారత్ ఉన్నట్టుండి అణుశక్తిరంగం ఒక్కసారిగా విప్లవాత్మ కంగా మారుతుందని చెప్పలేం. కొత్త అణు విద్యుత్ కేంద్రాల నిర్మాణం, భద్రతా ప్రమాణాలు, పెట్టుబడులు, సాంకేతిక సామర్థ్యం, వ్యర్థాల నిర్వహణ వంటి అనేకసవాళ్లు సవాళ్లుగానే మిగిలిపోయి ఉన్నాయి. ప్రస్తుతం ప్రపంచంలో ఉన్న పరిస్థితుల రీత్యా అంతర్జాతీయ అణుశక్తి సంస్థ భద్రతా ప్రమాణాలకు లోబడి, దేశశాంతియుత అవసరాల మేరకు మాత్రమే భారత దిగుమతి చేసుకున్న యురేనియంను వినియోగించాల్సి వస్తుంది. భారత్‌తో చేసుకున్న ఒప్పంద రీత్యా ఇకపై ఆస్ట్రేలియా చైనాపై ఆధారపడటాన్ని తగ్గించుకునే అవకాశముంది. విశ్వసనీయ భాగస్వామిగా భారత్‌తోఇంధన వాణిజ్యాన్ని విస్తరణ అణుఇంధన రంగంలో కొత్త మార్కెట్ వచ్చి చేరుతుంది. కీలక ఖనిజాల అవసరమూ ఏర్పడుతుంది. ఈదృష్ట్యా ఇరుదేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద విస్త రణకు కూడా ఆస్కారం ఉంటుంది. అణుశక్తిని స్వచ్ఛమైన విద్యుత్ ఉత్పత్తికి ప్రత్యామ్నాయంగా అభివృద్ధి చేయాలనే సంకల్పానికి ఇదొక పునర్నిర్వచనం చెబుతోంది. అంటే భారత్ స్వావలంబన దిశగా స్థిరమైన అడుగులు వేయనున్నది. ఈ పర్యటనలో మొత్తం 18 ఒప్పందాలపై భారత్, ఆస్ట్రేలియాల మధ్య సంతకాలు జరిగాయి. వీటిలో భారత్ తీర రక్షక దళం,ఆస్ట్రేలియాకు చెందిన మారిటైమ్ బోర్డర్ కమాండ్‌ల మధ్య ఒప్పందం కూడా ఇమిడి ఉంది. ఇది సముద్ర చట్టాల అమలు, సముద్ర ప్రాంతాలపై అవగాహన, సరిహద్దుల రక్షణ వంటి అంశాలలో పరస్పర సహకారానికి దోహదపడుతుంది. ఈ చర్చలు,ఒప్పందాలు ఇరుదేశాల మధ్య అసాధారణమైన అంశాలుగా ప్రధానులిద్దరూ అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా కేవలం శిలాజరహిత ఇంధన సామర్థ్యాన్ని పెంచడానికే భారత్‌కు యురేనియం ఆస్ట్రేలియా ప్రధాని ఆల్బానీస్ ప్రకటించారు. ఇకపై తమ భాగస్వామ్యం గతంలో ఎన్నడూ లేనంత పటిష్టంగా ఉండబోతుందన్న ఆశాభావాన్ని ఉభయులూ ప్రకటించారు. ఆస్ట్రేలియాలోని అతిపెద్ద సూపర్ ఫండ్ ఆస్ట్రేలియా భారతదేశంలో రూ.3,311కోట్లు అదనపు పెట్టుబడి పెట్టనుంది. భారత ఆర్థికవ్యవస్థపై పెట్టుబడిదారుల విశ్వాసానికి ఇదే నిదర్శనమని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. ఇండియా, ఆస్ట్రేలియా సిఇఒల ఫోరమ్‌లో ఆయన ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తాజా పెట్టుబడితోభారత ఆర్థికరంగంలో ఆస్ట్రేలియన్ సూపర్ మొత్తం పెట్టుబడి 3.3 మిలియన్ డాలర్లకు చేరనుంది. 28ఏళ్ల తర్వాత ఆస్ట్రేలియాలో పర్యటించిన తొలిభారత ప్రధాని తానేనని నరేంద్రమోడీ ఎంతో సంతోషంగా ముచ్చటించారు. ఈ పర్యటన భారత్, ఆస్ట్రేలియాల మధ్య ఎంతో పటిష్ట బంధాన్ని నిలబెట్టిందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

మనకు ఉన్న సంపదతో సంతృప్తిపడడం ఉత్తమం. మనకి ఉన్న జ్ఞానం సరిపోతుందనుకోవడం అజ్ఞానం.



సర్వేపల్లి రాధాకృష్ణన్

నీవెవరినో చూసి అనుకరించాలనుకునే కంటే నీకు నీవు సహజంగా ఉండటం ఎంతో శ్రేయోదాయకం.



బెర్నార్డ్ షా

# తిప్పలు పెడుతున్న రెవెన్యూ చట్టాలు!

**'భూ భారతి' చట్టం కూడా విధానపరంగా ఎంతో కొంత ఆశాజనకంగానే కన్పిస్తున్నది. కానీ అమలులో సమస్యలు తక్కువేమీ లేవు. వందలాది కోట్ల విలువైన ప్రభుత్వ భూములు అక్రమార్కుల పాలవుతున్నాయనే విమర్శలు పెల్లుబుకుతున్నాయి. అవినీతి కూడా ఏమాత్రం తగ్గలేదు. తమ చుట్టూ ప్రదక్షిణలు చేసే భజనపరులతో కాకుండా తమకు ఉన్న ఏజెన్సీల ద్వారా క్షేత్రస్థాయిలో జరుగుతున్న వాస్తవాలను తెప్పించుకోగలిగితే కొత్త చట్టానికి అర్థం పరమార్థం ఉంటుంది. ఇక కౌలురైతుల, పోడు భూముల సమస్యలు రగులుతూనే ఉన్నాయి. వాటిని పరిష్కరిస్తామని పాలక పెద్దలు ప్రకటించారు. లక్షలాది మంది గిరిపుత్రులు, కౌలురైతులు ఎదురు చూస్తున్నారు. ఈ సమస్యలు ఎంతో సున్నితమైన భూముల విషయంలో జోక్యం చేసుకొని చేతులే కాదు ఒళ్లు కాల్చుకున్న పెద్దలున్నారు. అవన్నీ దృష్టిలో ఉంచుకొని అన్ని కోణాల్లో మనసు పెట్టి ఆలోచించి ఆచితూచి అడుగులు వేయాలి.**

దామెర్ల సాయిబాబ

కొండ నాలుకకు మందేస్తే.. ఉన్న నాలుక ఊడిపోయినట్లుగా ఉంది. భూముల వ్యవహారంలో కొందరు పాలక పెద్దలు, మరికొందరు అధికారులు వ్యవహరిస్తున్న తీరు. సంస్కరణలు, చట్టాలు ఎన్ని తెచ్చినా అవి ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలి. అందులోని కష్టనష్టాలను సమగ్రంగా అధ్యయనం చేసి ఆచరణ సాధ్యం అవుతుందా? అందుకు తగిన సిబ్బంది ఉందా? వీటన్నింటిని మించి సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం వారికుందా? తదితర అంశాలు పరిగణనలోకి తీసుకొని చట్టాలుచేయాలి. అప్పుడే ఆ చట్టాలు చేసిన నేతలకు ప్రజాభిమానం పెరుగుతుంది. భూముల రికార్డుల విషయంలో ఆది నుంచి భూయజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. ఇప్పుడే కాదు గతంలో కూడా ఎన్నో చట్టాలు చేశారు. ఎంతో మంది అధికారులను నియమించారు. కానీ సమస్యలు పెరిగాయే తప్ప తగ్గలేదని చెప్పొచ్చు. దశాబ్దాల తరబడి వేలాది కేసులు న్యాయస్థానాల్లో కొనసాగుతూనే ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్‌ప్రభుత్వం 'భూ భారతి' చట్టాన్ని సరికొత్తగా ప్రవేశపెట్టింది. అంతకు ముందు తెలంగాణ ఏర్పడిన తర్వాత మొదటిసారిగా టిఆర్‌ఎస్ ప్రభుత్వం 'ధరణి పోర్టల్' అనే నూతన చట్టాన్ని ప్రవేశపెట్టింది. ఆ చట్టం రికార్డుపరంగా ఎంత ఉపయోగకరంగా కన్పించినా ఆచరణకు వచ్చేసరికి అన్నీఇన్నీ ఇబ్బందులు కాదు. ఎంతో వ్యయం చేసుకున్నా రికార్డులు సరిచేయించలేక, జరిగిన పొరపాట్లతో కొందరు రైతులు ప్రభుత్వాల నుంచి పొందాల్సిన ప్రయోజనాలను పూర్తిగా పొందలేకపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ చట్టాన్ని పక్కనబెట్టి ఇప్పుడు కొత్తగా 'భూ భారతి' చట్టాన్ని ప్రవేశపెట్టింది.ఎంత పటిష్టంగా,పకడ్బందీగా నిబంధనలు ఏర్పాటు చేసినా శతకోటిదరిద్రాలకు అనంత కోటి ఉపాయాలన్నట్లు ఏదోరకంగా దళారులు,మరికొందరు రియల్టర్ల నుండి ముఖ్యంగా ప్రభుత్వం భూములను కాపాడలేకపోతున్నారు. భూముల రేట్లు అత్యధికంగా పెరిగిన హైదరాబాద్‌తోపాటు చుట్టూ ఉన్న రంగారెడ్డి తదితర జిల్లాల్లో అక్రమాలకు అంతేలేకుండాపోతున్నది. అంతెందుకు తెలంగాణలో 'హైడ్రా'ను ప్రవేశపెట్టిన తరువాత వెలుగు చూసిన ప్రభుత్వ భూములు, ప్రధానంగా చిన్ననీటి వనరులను ఆక్రమించుకొని ఏకంగా పెద్దపెద్ద భవనాలే కాదు కాలనీలకు కాలనీలే నిర్మించుకొన్న ఉదంతాలు బయటపడ్డాయి. కొన్నింటిని కూల్చి వేసి తిరిగి హైడ్రా ప్రభుత్వానికి స్వాధీనం చేసింది. ఒకటి రెండు కాదు వేలాది ఎకరాల అత్యంత విలువైన భూములున్నాయి. ఈ అక్రమాలు నిర్మాణాలన్నీ ఒక్కరోజులోనో, ఒక నెలలోనో జరిగినవి కాదు. దశాబ్దాల తరబడి జరిగాయి, జరుగుతున్నాయి. చాలావరకు అనుమతులు సంబంధిత ప్రభుత్వ కార్యాలయాల నుండి పొందారు. ఇందులో నష్టపోయింది, పోతున్నది అమాయక కొనుగోలుదారులే. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా చెప్పుకొనే ప్రజాప్రభుత్వంలో వేలాదిరూపాయలు జీతభత్యాలు రూపేణ నెలనెలా ప్రజాధనాన్ని తీసుకొంటున్న సంబంధిత అధికారగణం ఏంచేస్తున్నట్లు అనే ప్రశ్న ఉదయించక తప్పదు. ఇటీవల అవినీతి నిరోధక శాఖ చేస్తున్న ఆకస్మిక తనిఖీల్లో ఆదాయానికి మించిన వందలాది కోట్లరూపాయల విలువైన అక్రమాస్తులు బయటపడుతుండటం పరిశీలిస్తే చట్టాలకు ఎలా తూట్లు పొడుస్తున్నారో అర్థమౌతుంది.వాస్తవంగా చూసినా భూముల విషయంలో నిజాంపాలన నుండి పటిష్టమైన చట్టం లేదని చెప్పొచ్చు. తెలంగాణ ప్రాంతంలో 1936 నుంచి రికార్డ్స్ ఆఫ్ రైట్స్ నిర్వహించడం ప్రారంభించారు. నైజాం పరి

## ఒక్క మాట

పాలన హక్కుల రికార్డుల నిర్వహణ కోసం భూమి హక్కుల రికార్డు చట్టం 1936 ఫస్లీ రూపొందించారు. ఆ తర్వాత హైదరాబాద్ రాష్ట్రంలో భూహక్కుల రెగ్యులరైజేషన్ చట్టాన్ని 1358 ఫస్లీ పేరుతో మరో చట్టాన్ని తెచ్చారు. ఆ చట్టాన్ని రద్దు చేస్తూ 1971లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భూమి హక్కులు, పట్టాదారు పాసుపుస్తకాల చట్టం చేశారు. ఇలా ఎన్నో మార్పులు, చేర్పులు చేసినా ఖచ్చితమైన రికార్డులు చేయలేకపోయారనే చెప్పొచ్చు. అందుకే ప్రభుత్వ, దేవుళ్ల భూములతోసహా వేలాది ఎకరాలు ఆక్రమణలకు గురయ్యాయి. శాసనసభలో కూడా ఎన్నోసార్లు ఈ ఆక్రమణలపై చర్చలు జరిగాయి. భూముల విషయంలో రాజుల మధ్య కొంతకాలం, జాగీర్దారుల మధ్య కొంతకాలం ఆ తర్వాత భూకామందుల మధ్య చివరకు వారిపై తిరగబడ్డ సన్నజనం కూడా ఈ పోరాటంలో పాలు పంచుకున్నారు. నక్సలిజం ఆవిర్భావానికి, ఇప్పటికీ అంతో ఇంతో మిగిలి ఉండడానికి ప్రధాన సమస్య అదే.భూమి ముఖ్యమైందన్న విషయం నిర్వివాదం. భూముల విషయంలో ఇప్పటికీ ఎన్నిచట్టాలు చేశారో, ఎన్ని సవరణలుచేశారో, ఇంకెన్ని మినహాయింపులు ఇచ్చారో లెక్కకు అందదు. రాజకీయాల అవసరాలకోసం భూమి చూపి పేదల జీవితాలతో ఆటలాడుకుంటున్నారన్న విమర్శలు ఏనాటి నుంచో వినిపిస్తున్నాయి.పార్టీలు మారినప్పుడు వారి ఆలోచనా ధోరణిలో మార్పు వచ్చినప్పుడల్లా చట్టాల్లో మార్పులు చేసుకుంటూపోతున్నారు. 1971లో కేంద్ర ప్రభుత్వం భూగరిష్ట పరిమితిని తీసుకురావడంతో కొంత కదలిక వచ్చిందని చెప్పొచ్చు. 1973లో జనవరి ఒకటిన అప్పటి ఉమ్మడి రాష్ట్రప్రభుత్వం చట్టం చేసింది. కానీ అమలు చేయడానికి చట్టం వచ్చిన రెండేళ్ల తర్వాత 1975 జనవరి నుంచి శ్రీకారం చుట్టారు. ఈ రెండేళ్ల వ్యవధిలో చాలామంది పెద్దలు తమ భూములను సర్దుబాటు చేసుకునే అవకాశం దొరికింది. పేదలకు ప్రభుత్వం ఇచ్చిన భూములను పెద్దలు నయానో, భయానో ఆక్రమించి అమ్ముకుంటున్నారని అలా వీలుకాకుండా పటిష్టమైన 9/77చట్టాన్ని తీసుకువచ్చారు. అయినా అసైన్డ్ భూముల అమ్మకాలు, కొనుగోళ్లు ఆగలేదు. ఇందుకు రాజకీయ జోక్యం, అవినీతి కారణం. పట్వారీతో పంచాయతీ పెట్టుకుంటే పొలం పోయి గుట్టెక్కుతుంది. గుట్ట వచ్చి పొలంలో కూర్చుంటుందనే నానుడి అప్పట్లోనే ఉండేది. ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు ఏకంగా ఆ వ్యవస్థనే రద్దు చేశారు. అయినా ఆ జాడ్యం ఆగలేదు. ఏదో ఒక రూపం లో కొనసాగుతూనే ఉంది. ఇలాంటి వాటిని అధిగమిం చేందుకు భూహక్కుల రికార్డులను పక్కాగా నిర్వహించ డానికి భూమి అమ్మకాలు, కొనుగోళ్లు జరిగిన వెంటనే రికార్డుల్లో మార్పులు చేసి భూయజమానులకు హక్కు పత్రం ఇవ్వడానికి భరోసా కల్పించడానికి తెలంగాణ ప్రభుత్వం 'ధరణి' పోర్టల్ కొత్త చట్టాన్ని తీసుకువచ్చింది. భూ రికార్డుల నిర్వహణలో అధునాతనమై పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ పట్టాదారు పాసుపుస్తకాల జారీలో జాప్యాన్ని నివారించడం, భూపరిపాలన, అవినీతిని నిర్మూలించడం లక్ష్యంగా ఈ చట్టాన్ని తీసుకువచ్చినట్లు చెప్పారు. ఏకగవాక్ష విధానం ద్వారా భూముల రిజిస్ట్రేషన్ మ్యూటేషన్, పట్టాల జారీ అన్నీ ఒకే రోజు ఒకే కార్యాలయంలో జరిగేలా నిబంధనలు పొందుపరిచారు. ఇవన్నీ తు.చ తప్పకుండా అమలు చేసి పొరపాట్లు జరగకుండా చేయగలిగితే రైతులకు ఎంతో మేలు జరిగేది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు వేరయ్యాయి. సమస్యలు పెరిగిపోయాయి. కొందరు ఉద్దేశ్యపూర్వకంగా రికార్డులు తప్పువచ్చేలా చేసి అవి సవరించడానికి వేలు కాదు, లక్షలు వసూలు చేశారు. సమస్యలను భూతద్దంలో చూపి మాయమాటలతో నమ్మించి తక్కువ ధరకు భూములను కొనుగోలు చేసిన సంఘటనలు కూడా చోటుచేసుకున్నాయి.'భూ భారతి' చట్టం కూడా విధానపరంగా ఎంతో కొంత ఆశాజనకంగానే కన్పిస్తున్నది. కానీ అమలులో సమస్యలు తక్కువేమీ లేవు. వందలాది కోట్ల విలువైన ప్రభుత్వ భూములు అక్రమార్కుల పాలవుతున్నాయనే విమర్శలు పెల్లుబుకుతున్నాయి. అవినీతి కూడా ఏమాత్రం తగ్గలేదు. తమ చుట్టూ ప్రదక్షిణలు చేసే భజనపరులతో కాకుండా తమకు ఉన్న ఏజెన్సీల ద్వారా క్షేత్రస్థాయిలో జరుగుతున్న వాస్తవాలను తెప్పించుకోగలిగితే కొత్త చట్టానికి అర్థం పరమార్థం ఉంటుంది. ఇకకౌలురైతుల, పోడు భూముల సమస్యలు రగులుతూనే ఉన్నాయి. వాటిని పరిష్కరిస్తామని పాలక పెద్దలు ప్రకటించారు. లక్షలాది మంది గిరిపుత్రులు, కౌలురైతులు ఎదురుచూస్తున్నారు. ఈ సమస్యలు ఎంతో సున్నితమైన భూముల విషయంలో జోక్యం చేసుకొని చేతులే కాదు ఒళ్లు కాల్చుకున్న పెద్దలున్నారు. అవన్నీ దృష్టిలో ఉంచుకొని అన్నికోణాల్లో మనసు పెట్టి ఆలోచించి ఆచితూచి అడుగులు వేయాలి. ●

# జనాభా కాదు... జనశక్తిని నిర్మించాలి

వంగవోలు రవి

భారత్ అభివృద్ధి భవిష్యత్తు జనాభా పరిమాణంపై కాదు, యువతకు విద్య, నైపుణ్యాలు, ఆరోగ్యం, ఉపాధి, స్వేచ్ఛ కల్పించడంపైనే ఆధారపడి ఉంది.ప్రపంచ జనాభా దినోత్సవం వచ్చినప్పుడల్లా మన చర్చ ఇప్పటికీ "జనాభా ఎంత పెరిగింది?" అనే ప్రశ్న చుట్టూనే తిరుగుతోంది. కానీ నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న అసలు ప్రశ్న అది కాదు. ఐక్యరాజ్యసమితి జనాభా నిధి 2026 ప్రపంచ జనాభా దినోత్సవానికి ప్రకటించిన 'రియలైజింగ్ ద హోప్స్ అండ్ ఆస్పిరేషన్స్ ఆఫ్ యంగ్ పీపుల్ టుడే అండ్ ఫర్ ద ఫ్యూచర్' అనే థీమ్ కూడా ఇదే విషయాన్ని గుర్తుచేస్తోంది. జనాభా ఎంత ఉందన్నది కాదు ఆ జనాభా ఎంత ఆరోగ్యంగా ఉంది, ఎంత చదువుకుంది, ఎంత నైపుణ్యం సంపాదించింది, ఎంత స్వేచ్ఛగా తన జీవితాన్ని నిర్మించుకోగలుగుతోంది అనేదే దేశ భవిష్యత్తును నిర్ణయించే అంశంగా మారింది. ఒకప్పుడు జనాభా పెరుగుదలనే అభివృద్ధికి అతిపెద్ద అడ్డంకిగా భావించేవారు.ఇప్పుడు పరిస్థితులు మారాయి. ఐక్యరాజ్యసమితి లెక్కలప్రకారం అనేక దేశాలు వృద్ధాప్య జనాభా, తగ్గుతున్న జననాల రేటు, కార్మికుల కొరత వంటి సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచంలోనే అత్యధిక జనాభాతో పాటు, అతిపెద్ద యువ జనాభా కలిగిన దేశంగా భారత్‌కు ఒక చారిత్రక అవకాశం లభించింది. అయితే ఈ అవకాశాన్ని నిజమైన జనశక్తిగా మార్చగలుగుతున్నామా? అనే ప్రశ్నకు సమాధానం వెతకాల్సిన సమయం వచ్చింది. ఒక దేశ భవిష్యత్తును కేవలం జనాభా సంఖ్య నిర్ణయించదు. ఆ జనాభాలో ఎంతమంది ఆరోగ్యంగా ఉన్నారు? ఎంత మంది నాణ్యమైన విద్య పొందుతున్నారు? ఎంతమందికి అవసరమైన నైపుణ్యాలున్నాయి? ఎంతమందికి గౌరవప్రదమైన ఉపాధి లభిస్తోంది? అన్నదే దేశ పురోగతిని నిర్ణయిస్తుంది.యువశక్తికి నాణ్యమైన విద్య, సరైన శిక్షణ, మెరుగైన ఆరోగ్యం, తగిన ఉపాధి అవకాశాలు కల్పించకపోతే అదే జనాభా నిరుద్యోగం, అసమానత, సామాజిక అసంతృప్తికి కారణమయ్యే ప్రమాదం కూడా ఉంది. అందుకే జనాభా సంఖ్య కంటే మానవ వనరుల నాణ్యతపై పెట్టుబడి పెట్టడం అత్యవసరమైంది. విద్యారంగంలో భారత్ గణనీయమైన పురోగతి సాధించింది. యుడిఐఎస్‌ఇ 2023-24 గణాంకాల ప్రకారం పాఠశాల స్థాయిలో బాలికల నమోదు అబ్బాయిలతో దాదాపు సమాన స్థాయికి చేరుకుంది. కానీ ఈ గణాంకాలు మరో ప్రశ్నను కూడా లేవనెత్తుతున్నాయి. చదువు పూర్తయిన ప్రతి యువకుడు, యువతి ఉద్యోగానికి సిద్ధంగా ఉన్నారా? పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు వారికి అందుతున్నాయా? మారుతున్న సాంకేతిక ప్రపంచానికి తగిన సామర్థ్యాలను విద్యావ్యవస్థ పెంపొందిస్తోందా? ప్రతి సంవత్సరం లక్షలాది మంది యువత విద్య పూర్తిచేసి ఉద్యోగ మార్కెట్‌లోకి అడుగు పెడుతున్నారు. కానీ వారందరికీ వారి నైపుణ్యాలకు తగిన ఉపాధి లభిస్తోందా? అనేది కీలకమైన ప్రశ్న. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే 2023-24 ప్రకారం మహిళల శ్రామిక భాగస్వామ్యం పెరుగుతున్నప్పటికీ, ఆ పెరుగుదలలో గణనీయమైన భాగం స్వయం ఉపాధి లేదా అనౌపచారిక రంగంలోనే ఉంది. మరోవైపు యువత నిరుద్యోగం, నైపుణ్యాలకు తగ్గఉద్యోగాల కొరత ఇంకా సవాళ్లగానే ఉన్నాయి. ప్రపంచ జనాభా దినోత్సవం మనకు గుర్తు చేయాల్సిన సందేశం ఒక్కటే. జనాభా సంఖ్యను లెక్కించడం కంటే, ప్రతి మనిషిలోని సామర్థ్యాన్ని పెంపొందించడం చాలా ముఖ్యం.నాణ్యమైన విద్య, ఆరోగ్యం, నైపుణ్యాలు, గౌరవ ప్రదమైన ఉపాధి, లింగ సమానత్వం, నిర్ణయ స్వేచ్ఛ ఇవే భవిష్యత్ భారతాన్ని నిర్మించే అసలు పునాదులు. ప్రతి యువకుడికి, ప్రతి యువతికి తమ సామర్థ్యాన్ని వికసింప జేసుకునే అవకాశాలను కల్పించినప్పుడే జనాభా నిజమైన జనశక్తిగా మారుతుంది. ●


# పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



గంగాపురం స్థితప్రజ్ఞ

'ఒక్కరైతే ఒంటరే... ఒక్కటైతే ఉప్పెనే' అనే నినాదంతో,లక్షలాది సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యా యుల సామాజిక భద్రతే ధ్యేయంగా జనం నుండి ఉద్భవించిన మహా ప్రవాహం .. తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ (టిఎస్‌సిపిఎస్‌ఈయు). 2016 లో ప్రారంభమైన ఈ సంఘం, సిపిఎస్ విధానం పట్ల ఉద్యోగుల్లో ఉన్న అంధకారాన్ని తొలగించి, వారిలో అవగాహన కల్పించేందుకు మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో విస్తృతంగా సదస్సులు, సమావేశాలను నిర్వహించింది. నాటి నుండి నేటి వరకు రాజీలేని పోరాటాలతో పాత పెన్షన్ (ఓపిఎస్) సాధనకై ఈ యూనియన్ దేశవ్యాప్త ఉద్యమానికి ఇరుసుగా నిలిచి ఉద్యోగ, ఉపాధ్యాయులకు 2016వరకు లేని 16 లక్షల విలువక్ డెత్ కామ్ రిటైర్మెంట్ గ్రాట్యుటీతోపాటు ఉద్యోగి సర్వీస్‌లో ఆకస్మికంగా మరణిస్తే వారి కుటుంబాలకు ఫ్యామిలీ పెన్షన్ఆర్థిక రక్షణను కల్పించాయి. ఇది కేవలం 10 ఏళ్లలోనే సాధించింది. అనేక శక్తి యుక్తులతో, అనంతమైన మేధోశక్తితో, కఠినమైనపోటీని తట్టుకుని ప్రభుత్వ ఉద్యోగం సాధించిన ఉద్యోగ, ఉపాధ్యాయుల భవితను పిఎఫ్‌ఆర్డీఏ అనే చట్టం ద్వారా ప్రవేశపెట్టిన నూతన పెన్షన్ విధానం అంధకారమయం చేసింది. మార్కెట్ ఒడిదొడుకులపై పెన్షన్ ఆధారపడటం : పాత పెన్షన్ విధానంలో (ఓపిఎస్) ఉద్యోగి రిటైర్ అయ్యేనాటికి వచ్చిన చివరి జీతంలో సగం మొత్తాన్ని పెన్షన్‌గా ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చేది. కానీ సిపిఎస్ విధానంలో ఉద్యోగి జీతం నుండి కట్ చేసిన సొమ్మును షేర్ మార్కెట్లలో పెట్టుబడిగా పెడుతున్నారు. మార్కెట్ ఒడిదొడుకుల వల్ల రిటైర్మెంట్ తర్వాత వచ్చే పెన్షన్ కేవలం కొన్ని వందల రూపాయలకే పరిమితం అవుతోంది.

**జీవన భృతికి చాలని పెన్షన్లు:** ముప్పై, నలభై ఏళ్లు ప్రభుత్వానికి సేవలందించి రిటైర్ అయిన ఉద్యోగులకు నేడు నెలకు రూ. 1000 నుండి రూ. 2000 లోపే పెన్షన్ వస్తున్న ఉదాహరణలు అనేకం ఉన్నాయి. ఈ కాలంలో ఈ అరకొర డబ్బులతో ఒక వృద్ధాప్య కుటుంబం కనీసం మందుల ఖర్చులు కూడా వెళ్లదీసుకోలేని దుస్థితి నెలకొంది. ఆత్మగౌరవానికి దెబ్బ: జీవితాంతం గౌరవప్రదమైన హోదాలో బతికిన ఉద్యోగి, రిటైర్మెంట్ తర్వాత కుటుంబ సభ్యులపై లేదంటే ఇతరులపై ఆధారపడాల్సి రావడం వారి ఆత్మగౌరవాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. సామాజిక భద్రత కరువై,విశ్రాంత జీవితం నిస్సహాయంగా మారుతోంది. ఈ అన్యాయమైన విధానానికి వ్యతిరేకంగా టిఎస్‌సిపిఎస్‌ఈయు నేతృత్వంలో సాగినఉద్యమ ప్రస్థానంలో ఎన్నో మైలురాళ్ళు





ఉన్నాయి. శంఖారావం (ఫిబ్రవరి 26, 2017): నిజాం కాలేజ్ మైదానంలో లక్షలాది మందితో నిర్వహించిన ఈ సభ రాష్ట్రంలో పెనుదుమారాన్ని రేపింది. దీని ఫలితంగానే డెత్ కమ్ రిటైర్మెంట్ గ్రాట్యుటీ (జి.ఓ 60)సాధించబడింది. సామూహిక సెలవు, ధర్మదీక్ష (సెప్టెంబర్ 1, 2017): సంఘం ఇచ్చిన పిలుపుతో 85పైగా ఉద్యోగ, ఉపాధ్యాయులు సామూహిక సెలవు పెట్టి, జిల్లా కేంద్రాల్లో ధర్మదీక్షలు చేపట్టి తమ దృఢ సంకల్పాన్ని చాటారు. ఆయుత ధర్మదీక్ష (జనవరి 7, 2018): నాటి ముఖ్యమంత్రి నియోజకవర్గ కేంద్రమైన గజ్వేల్ గడ్డపై వేలాది మందితో ఆయుత ధర్మదీక్షను విజయవంతంగా నిర్వహించారు. ఆత్మగౌరవ జన జాతర, ఓట్ ఫర్ ఓపిఎస్: నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో లక్షకుపైగా కుటుంబాలతో భారీ బహిరంగ సభ నిర్వహించి, "పాత పెన్షన్ ఇచ్చే పార్టీలకే మా ఓటు" అని ప్రతిజ్ఞ చేసి సిపిఎస్ ఐక్యతను చాటారు. రాజకీయ నిర్ణయం మేనిఫెస్టోలో హామీ: దేశవ్యాప్తంగా ఎన్.ఎం.ఓ.పి.యస్ ద్వారా ఉద్యమాన్ని విస్తరింపజేసి ఇప్పటికే ఆరు రాష్ట్రాల్లో పాత పెన్షన్ పునరుద్ధరణకు కారణమైంది సిపిఎస్ యూనియన్. తెలంగాణలో సైతం ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్కను కలిసి సమస్య తీవ్రతను వివరించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో "సిపిఎస్ రద్దు, పాత పెన్షన్ పునరుద్ధరణ" హామీని చేర్చేలా ఈ యూనియన్ నేతలు క్రియాశీలక కృషి చేశారు. గతంలో ఇచ్చిన హామీలు, సిపిఎస్ పెన్షన్ లోపాలవల్ల ఉద్యోగులు ఎదుర్కొంటున్న తీవ్ర అన్యాయాన్ని ప్రస్తుత ప్రభుత్వానికి మరోమారు బలంగా గుర్తుచేస్తూ, పాత పెన్షన్ విధానాన్ని తక్షణమే పునరుద్ధరించాలనే ఏకైక డిమాండ్‌తో టిఎస్‌సిపిఎస్‌ఈయు మరో చారిత్రాత్మక ఉద్యమానికి శ్రీకారం చుడుతోంది. జులై 11 నుండి జన జాగరణ యాత్ర: ఈ సుదీర్ఘ పోరాట యాత్ర భద్రాద్రి జిల్లా నుండి ఘనంగా ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఉన్న సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులందరినీ ఏకం చేస్తూ ఈ యాత్ర సాగుతుంది. నియోజకవర్గ కేంద్రాల్లో సిపిఎస్‌ఉద్యోగులతో ప్రత్యేక అవగాహన, సమరశీల సమావేశాలు నిర్వహించి, ఆయా ప్రాంతాల స్థానిక శాసనసభ్యులను (ఎమ్మెల్యేలను) ప్రత్యక్షంగా కలిసి.ఎమ్మెల్యేల స్పందన కోరనున్నారు. 'నాడు ఓట్లు వేశాం.. నేడు మా పెన్షన్ సమస్యపై మీ స్పందన ఏంటి?' అని ప్రశ్నిస్తూ, నాటి ఎన్నికల మేనిఫెస్టో హామీని తక్షణమే జీవో రూపంలో అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి స్థానిక ప్రజాప్రతినిధుల మద్దతు కూడగట్టడం ఈ యాత్ర ముఖ్య ఉద్దేశ్యం. ఆగస్టు 23చలో హైదరాబాద్ భారీ బహిరంగ సభ: జన జాగరణ యాత్ర ద్వారా రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గాల్లో మలిదశ చైతన్యంతో ఆగస్టు 23న హైదరాబాద్ నడిబొడ్డున చలో హైదరాబాద్ పేరిట 2.6లక్షలాదిమందితో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నారు.ఈ సభ ద్వారా సిపిఎస్ విధానంవల్ల రిటైర్డ్ ఉద్యోగులు పడుతున్నవేదనను, సమస్య తీవ్రతను ప్రభుత్వానికి కళ్లకుకట్టేలా వివరించి, పాత పెన్షన్ జీవోసాధన దిశగా అంతిమపోరాటం చేయనున్నారు. ●

**(రచయిత : రాష్ట్ర అధ్యక్షులు, టిఎస్‌సిపిఎస్‌ఈయు)**

# ప్రజావాక్కు

## ఒకరు వద్దు,ఇద్దరు ముద్దు నినాదం చాలు

ఇప్పటికిప్పుడే మన జనాభాను ప్రత్యేకంగా పెంచాల్సిన పని లేదు, ఇంకా పెరుగుతూనే వుంది, పెరుగుదల రేటు మాత్రం తగ్గింది. సమీప భవిష్యత్తులో యువతకు కొరత రాదు ఎప్పుడో విజన్ 2047 నాటికి ఆ పరిస్థితి వస్తే జపాన్ వలె పదవీ విరమణ వయస్సు పెంచీ, ఇరాన్ సైన్యం వలె ఉద్యోగ అర్హత వయసు తగ్గించి, ఆనాటి పరిస్థితులకి తగినట్లు ఆ పాలకులు చర్యలు చేపడతారు. నేడెందరో విద్యావంతులు, చిరుద్యోగులు విద్య, వైద్యం, పిల్లల పెంపకం వంటి కుటుంబ ఖర్చులు తట్టుకోలేక ఒక బిడ్డతోనే సరిపుచ్చుకుంటున్నారు. కనుక ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం మూడో బిడ్డకి ఇస్తామంటున్న ముప్పై వేల రూపాయలను మొదటి బిడ్డకీ, నాలుగో బిడ్డకి ఇస్తామనే నలభై వేలని, రెండోబిడ్డకీ ఇచ్చి, గతంలో వలె అన్నిరాయితీలను అందిస్తే ఫలితం వుంటుంది. ఆ రెండో బిడ్డ, తొలి బిడ్డకి తోడై, వారి ఆటపాటలతో పెద్దలకీ కాలక్షేపంగా వుంటుంది. ఇక చదువుల కోసం బడిలో చేర్చే తల్లిదండ్రులిద్దరూ వుద్యోగులైతే పిల్లల సంరక్షణ కోసం, వారి కుటుంబపెద్దల్నీ తెచ్చుకుంటారు.ముఖ్యమంత్రి ఆశిస్తున్నట్లు వుమ్మడి కుటుంబ వ్యవస్థ వృద్ధి చెందుతుంది.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

## సంకల్ప బలం ముఖ్యం

16వ ఆర్థిక సంగం నిధులు గ్రామపంచాయితీలకు విధిల్చాలి అంటే పెట్టిన నిబంధనలు గ్రామపంచాయితీల మధ్య పోటీ తత్వం పెంచే విధంగా ఉన్నాయి. అవి స్వంత నిధులను పెంచుకోవడం వైపు మార్గాలు వెతకాల్సిన పరిస్థితిని కల్పిస్తున్నాయి. అది హరిత హారం ద్వారా పెంచొచ్చు లేదా తెలంగాణకు ఉండే చారిత్రక జల సంపద ద్వారా కావొచ్చు. మొత్తం మీద కావాల్సినది సంకల్పం మాత్రమే.

- భారత అవినాష్, జనగాం

## పంటల మార్పిడి చేయాలి

నేటి కాలంలో పొలాలలో ఆధునికపద్ధతులను, యంత్రాలను ఉపయోగించి పంటల మార్పిడి విధానాన్ని చేపట్టి అధిక దిగుబడిని పెంపొందించుకోవాలి. రెండు కాలాలు ఒకే పంట వేసి నేల సామర్థ్యాన్ని తగ్గించడం కంటే మెరుగైన బహుళ జాతి పంటలు వేస్తే మద్దతు ధరతో పాటు దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది.

- మోతె శివకుమార్, రంగారెడ్డి జిల్లా

## మాతృభాష మాధుర్యం

తెలుగు భాషలోని మాధుర్యం, సౌందర్య సౌరభాలు మరే భాషకులేవని ఘంటాపథంగాచెప్పవచ్చు.మాతృభాషను విస్మరించడం అంటే, అమ్మ భాషను మరిచిపోవటమే అవుతుంది. కేవలంరచయితల కల్పనలకే పరిమితమయ్యే దుర్గతి తెలుగుకు దాపురించిందంటే అతిశయోక్తి కాదు. దీన్ని అధికమించాలంటే మన పిల్లలకు చిన్నతనం నుంచి తెలుగుదనం అలవరచాలి.రామాయణ, భారతాల వంటి ఇతిహాసాలను పరిచయం చేస్తూ, ఆకథలను పిల్లలకు చెప్తూ మాతృభాషలోని తియ్యదనాన్ని వారికి రుచి చూపించాలి. వారికి తెలుగు మాట్లాడటం, చదవటం, రాయటం నేర్పించాలి.ప్రాథమిక పాఠశాలలో అర్హులైన తెలుగు ఉపాధ్యాయులను నియమించి తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయాలి. పదవ తరగతి వరకు తెలుగు పాఠ్యాంశాన్ని తప్పనిసరి చేయాలి. తెలుగు మాధ్యమాలలో చదివిన వారికి ఉద్యోగాల్లో, ఇతరత్రా ప్రోత్సాహకాలు అందించాలి. తెలుగుభాషను బ్రతికించుకోవాలంటే, ప్రభుత్వ కార్యకలాపాల్లో ఉత్తర ప్రత్యుత్తరాలకు తెలుగును ఉపయోగించాలి.

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

## విద్యుత్ పొదుపుపై అవగాహన అవసరం

దేశంలో విద్యుత్ వినియోగం రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ శాఖలు విద్యుత్ పొదుపుపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా రైల్వే స్టేషన్లు, ఎంఎంటీఎస్, మెట్రోకేంద్రాల్లో రాత్రి వేళల్లో అవసరానికి మించి వెలిగించే దీపాలను తగ్గించడంద్వారా గణనీయమైన విద్యుత్ ఆదా సాధ్యమవుతుంది. ప్రయాణికుల రద్దీ తక్కువగా ఉండే అర్ధరాత్రి సమయాల్లో ప్రతి దీపాన్ని వెలిగించడం అవసరం లేదు. ప్రధాన స్టేషన్లు, లోకల్ రైలు కేంద్రాలు, మెట్రో స్టేషన్లలో కనీస భద్రతకు అవసరమైనంత వెలుతురు మాత్రమే ఉంచి, మిగతా దీపాలను నిలిపివేయవచ్చు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్నత విద్య

వివిధ యూనివర్సిటీల నుండి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ప్రత్యేకంగా ఉన్నత విద్య అవకాశాలు కల్పించాలి. ఈ కోర్సులకు గాను వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలి. ప్రతి ప్రభుత్వ శాఖ ఆధ్వర్యంలో ఆయా శాఖల అభివృద్ధికి గానునిధులు నియామకాలు సంక్షేమపథకాల ప్రచారం కొరకు పరిశోధనలు అవసరం. తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగులలో ప్రస్తుతం ఉన్నత విద్య డాక్టరేట్ పట్టా పొందిన వారి చేత పర్యవేక్షణ వీరి ద్వారా చేయించడం అవసరం.

- రాపాక రవీందర్, జనగాం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి
ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# కరూర్ బాధిత కుటుంబాలకు ఉద్యోగాలు

## నియామక పత్రాలు అందజేసిన ముఖ్యమంత్రి విజయ్

## ఆ ఘటన తనకు మానని గాయమైందన్న తమిళ సీఎం



శుక్రవారం కరూర్‌లో బాధితులకు ఉద్యోగనియామకపత్రాలను అందజేస్తున్న తమిళ సీఎం విజయ్

**కరూర్,జులై 10:** తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ శుక్రవారం కరూర్ తొక్కిసలాట ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామక (కంపాషనేట్ అపాయింట్‌మెంట్) ఉత్తర్వులు అందజేశారు. కరూర్ ఘటన తన హృదయంలో ఇప్పటికీ మానని గాయంగా మిగిలిపోయిందని ఆయన భావోద్వేగంతో పేర్కొన్నారు.గత ఏడాది సెప్టెంబర్ 27న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు కరూర్‌లో నిర్వహించిన టీవీకే ఎన్నికల ప్రచార సభలో తొక్కిసలాట చోటుచేసుకుని 41 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ప్రస్తుతం కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) విచారణ కొనసాగుతోంది.ఈ ఘటన అనంతరం తమిళనాడు ప్రభుత్వం మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది, టీవీకే పార్టీ అదనంగా రూ.20 లక్షల పరిహారాన్ని అందించింది.బాధిత కుటుంబాల పునరావాస చర్యల్లో భాగంగా సీఎం విజయ్ కరూర్‌కు వెళ్లి అర్హులైన కుటుంబ సభ్యులకు కారుణ్య నియామక ఉత్తర్వులను పంపిణీ చేశారు. అట్లాస్ అరీనాలో నిర్వహించిన కార్యక్రమంలో 32 బాధిత కుటుంబాలకు చెందిన ఒక్కో సభ్యుడికి వారి విద్యార్హతలకు అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగాల నియామక పత్రాలను అందజేశారు. అయితే ఇదే సమయంలో బాధిత కుటుంబాలకు శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ విచారణ చేపట్టింది. ప్రస్తుతం లబ్ధిదారులకు తాత్కాలిక నియామకాలు మాత్రమే ఇవ్వాలని కోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది.ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం విజయ్ భావోద్వేగానికి లోనయ్యారు. "నా హృదయంలో నిలిచిపోయిన కరూర్ సోదర, సోదరీమణులందరికీ నా హృదయ పూర్వక అభివాదాలు. జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా మనసులోని గాయాలు, బాధలు ఎప్పటికీ మరిచిపోలేం. ఎన్నోకష్టాలు, మానసిక వేదనలు దాటుకుని ఈరోజు మీ ముందుకు వచ్చాను" అని అన్నారు. కరూర్ ఘటన నాకు తీవ్ర మనోవేదన కలిగించింది. అక్కడ నా సోదరులను, సోదరీమణులను, అమాయక చిన్నారులను కోల్పోయాను. ఆ విషాదం నా గుండెల్లో ఇప్పటికీ మానని గాయంగా ఉంది. ఆ ఘటనకు నన్నే బాధ్యుడిగా చూపించే ప్రయత్నం చేశారు. కానీ ప్రజల కోసమే నేను రాజకీయాల్లోకి వచ్చాను. ఇలాంటి విషాదాలు మళ్లీ జరగకుండా శాశ్వత పరిష్కారం తీసుకురావడమే నా లక్ష్యమని విజయ్ స్పష్టంచేశారు. ప్రతిపక్షాలపై కూడా సీఎం విజయ్ విమర్శలు గుప్పించారు. శాసనసభలో పార్టీ ఫండ్ అనే పదం ప్రస్తావనకు రాగానే ప్రతిపక్ష సభ్యులు సభనుంచి బయటకు వెళ్లిపోయారని ఆరోపించారు. గతంలో ప్రభుత్వ శాఖల్లో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ కార్యాలయా "ల్లో లంచాలు, అవినీతి గణనీయంగా తగ్గాయని ప్రజలు విశ్వసిస్తున్నారని తెలిపారు.ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామని మరోసారి పునరుద్ఘాటించిన సీఎం విజయ్, మాజీముఖ్యమంత్రి సి.ఎన్. అన్నాదురై జయంతి సందర్భంగా జన్మించిన శిశువులకు మేనమామ తరఫున బంగారుఉంగరం బహూకరించే పథకాన్ని కూడా హామీఇచ్చినట్లుగానే అమలు చేస్తామని ప్రకటించారు. కార్యక్రమం చివర్లో బాధిత కుటుంబ సభ్యులకు నియామక పత్రాలు పంపిణీ చేయగా, ఈచర్య ద్వారా కుటుంబ పోషకులను కోల్పోయిన వారికి దీర్ఘకాలిక ఆర్థిక భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు.



# పేలుళ్లతో దద్దరిల్లిన ఇరాన్


## తమకు సంబంధం లేదన్న అమెరికా

**టెహ్రాన్, జులై 10:** ఇరాన్‌లో గురువారం సాయంత్రం నుంచి పలుచోట్ల భారీ పేలుళ్లు చోటుచేసుకున్నాయి. ఈ విషయాన్ని స్థానిక వార్తా సంస్థలు, అధికారులు ధ్రువీకరించారు. ఇరాన్‌లోని అణు విద్యుత్ ప్లాంట్ ఉన్న బుషెహర్ వద్ద సైనిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకొని దాడి జరిగింది. ఈ విషయాన్ని అక్కడి పొలిటికల్ అండ్ సెక్యూరిటీ గవర్నర్ ఇసన్ జహనియన్ వెల్లడించారు. మరోవైపు కొనారాక్‌లోని నేవల్ జోన్‌లో శత్రు దేశ ఫైటర్ జెట్లు రెండు విడతల్లో దాడులు చేసినట్లు ఇరాన్ అధికారి మహమ్మద్ యూనిస్ హక్కానీ పేర్కొన్నారు. అయితే అమెరికా మాత్రం ఈ దాడులతో తమకు సంబంధం లేదని పేర్కొంది. తమ దళాలు తాజాగా ఎటువంటి దాడులు నిర్వహించలేదని తేల్చి చెప్పింది. ఇక ఇజ్రాయెల్ అధికారి ఒకరు అమెరికా మీడియా సంస్థతో మాట్లాడుతూ దాడుల్లో తమ మిలిటరీ ప్రమేయం ఉన్నట్లు ఎటువంటి సమాచారం లేదని చెప్పారు. మరి తాజా దాడులకు పాల్పడింది ఎవరనే అంశంపై స్పష్టం రాలేదు. ఇరాన్ మాత్రం అమెరికా–ఇజ్రాయెల్ హస్తంఉండొచ్చని చెబుతోంది. అమెరికా గురువారం తెల్లవారుజామున చేసిన దాడుల్లో కూడా బుషెహర్‌ను లక్ష్యంగా చేసుకొంది. ఈ సమయంలో అణుప్లాంట్‌ను టార్గెట్ చేసినట్లు ఇరాన్ ఆరోపించింది. గురువారం మొత్తం 90 లక్ష్యాలపై దాడి చేసిన విషయం తెలిసిందే.

# తల్లిదండ్రుల సంరక్షణ పిల్లల బాధ్యత

## వాళ్ల బాగోగులు చూడకపోతే ఆస్తులు వెనక్కి

## బాంబే హైకోర్టు కీలక తీర్పు!



**ముంబై, జులై 10:** తల్లిదండ్రుల నుంచి ఆస్తులు పొంది వారి సంరక్షణ విషయంలో నిరక్ష్యంగా, అశ్రద్ధతో వ్యవహరించే పిల్లలకు కనువిప్పు కలిగేలా బాంబే హైకోర్టు ఒక కీలకమైన తీర్పును వెలువరించింది. వృద్ధాప్యంలో తమను చూసుకుంటారనే షరతుతో ఆస్తిని పిల్లలకు బదిలీ చేసినతల్లిదండ్రులు, ఆ షరతును కనుక పిల్లలు నెరవేర్చకపోతే వారు తమ ఆస్తిని తిరిగి వెనక్కి తీసుకోవచ్చునని బాంబే హైకోర్టు తీర్పు చెప్పింది. తల్లిదండ్రులు ఆర్థికంగా స్థితిమంతులైన ప్పటికీ ఇది వర్తిస్తుందని స్పష్టం చేసింది. లోయర్ పారెల్‌లోని ఫ్లాట్‌ను తన 68 యేండ్ల తండ్రికి స్వాధీనం చేయాలంటూ కింది కోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ 42యేళ్ల వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రవీంద్ర చుగే, జస్టిస్ గౌతమ్ ఆంఖడ్‌లతో కూడిన డివిజన్ బెంచ్ విచారించింది. వృద్ధులైన తల్లిదండ్రులకు ప్రాథమిక సౌకర్యాలు, శారీరక అవసరాలు కల్పిస్తాననే షరతులో ఆస్తి బదిలీ జరిగి, అలా చేయడంలో విఫలమైతే, ఆ బదిలీని రద్దు చేసే అధికారం ట్రిబ్యునల్‌కు ఉందని సీనియర్ సిటిజన్స్ చట్టం, 2007 సెక్షన్ 23 చెబుతున్నదని పేర్కొన్న హైకోర్టు ట్రిబ్యునల్ తీర్పును సమర్థిస్తూ పిటిషనర్ వాదనను తిరస్కరించింది.

# కేతన్ హత్యకేసు విచారణకు ఫాస్ట్‌ట్రాక్‌కోర్టు ఏర్పాటు చేయాలి

## రాష్ట్రపతికి లేఖరాసిన పుణే వ్యాపారి కేతన్ అగర్వాల్ తండ్రి



**పుణె,జులై 10:** నగరానికి చెందిన యువ వ్యాపారవేత్త కేతన్ అగర్వాల్ హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసును త్వరగా విచారించి, దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కేతన్ తండ్రి విశాల్ అగర్వాల్ విజ్ఞప్తి చేశారు. వ్యక్తిగతంగా జోక్యం చేసుకుని, ఈ కేసు త్వరగా ముందుకు సాగేలా సహాయం చేయాలని ఆయన కోరారు. కొడుకును పోగొట్టుకున్న 20 రోజుల్లోనే తాను తండ్రిని కూడా కోల్పోయానని, తమకు న్యాయం చేయాలని ఆయన భావోద్వేగంతో రాష్ట్రపతికి లేఖ రాశారు. కేతన్ మరణాన్ని తట్టుకోలేక అతడి తాత గుండెపోటుతో మరణించిన విషయం తెలిసిందే. రాష్ట్రపతి సెక్రటరీకి పంపిన విశాల్ అగర్వాల్ బుధవారం పంపిన ఈమెయిల్‌లో తమ కుమారుడు మరణం తర్వాత కుటుంబం ఎదుర్కొంటున్న బాధను పంచుకున్నారు. ఓ వ్యాపారవేత్తగా లేదా ప్రభావశీలివ్యక్తిగా తాను ఈ లేఖ రాయడం లేదు. కేవలం ఓతండ్రిగా ఆవేదనతోనూ ఇది రాస్తున్నానని వాపోయారు. కేతన్ అంటే తన తండ్రికి ఎంతో ఇష్టమని, ఎంతగానే ప్రేమించే మన వడు మరణంతో ఆయన మనోవేదనకు గురై గుండెపోటుతో చనిపోయారని అన్నారు. తమ కుటుంబానికి ఇది తీరని వేదనను మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఫాస్ట్ ట్రాక్ కోర్టులో ఈ కేసును విచారించేలా చూడాలని, దోషులకు చట్ట ప్రకారం కఠిన శిక్ష పడేలా చూడాలని విశాల్ కోరారు.

# ట్రంప్ హత్యకు ఇరాన్ కుట్ర: ఇజ్రాయెల్



**టెల్ అవీవ్,జులై 10:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను హత్య చేసేందుకు ఇరాన్ మరోసారి కుట్ర పన్నుతోందని అమెరికాను ఇజ్రాయెల్ హెచ్చరించిందన్న సమాచారం వైరల్ అయింది. అందుకే ట్రంప్ ఇరాన్‌పై దాడులు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. ఈ సమాచారం ఇజ్రాయెల్ ఇటీవల పెంటగాన్‌కు అందించిన నిఘా నివేదికలో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. దీంతో అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. ట్రంప్‌ను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ రూపొందించిన ప్రత్యేక ప్రణాళికను ఇజ్రాయెల్ అగ్రరాజ్యానికి అందజేసింది. అయితే ఈ సమాచారాన్ని అమెరికా నిఘా సంస్థలు ఇప్పటివరకు స్వతంత్రంగా నిర్ధారించలేదని తెలుస్తోంది. ఇజ్రాయెల్ హెచ్చరికకు ముందు అలాంటి కుట్రపై తమ వద్ద స్పష్టమైన ఆధారాలు లేవని అధికారులు పేర్కొన్నట్లు సమాచారం. కొంతమంది అమెరికా అధికారులు మాత్రం ఈ హెచ్చరిక వెనుక మరో కోణం ఉండొచ్చని భావిస్తున్నట్లు సమాచారం. ఇరాన్‌పై మరింత సైనిక చర్యలకు ట్రంప్‌ను ఒప్పించే ప్రయత్నంలో భాగంగానే ఇజ్రాయెల్ ఈ సమాచారం ఇచ్చి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్లు నివేదికలు పేర్కొన్నాయి. ఇరాన్ మాత్రం చాలా కాలంగా ట్రంప్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని బహిరంగంగానే హెచ్చరిస్తూ వస్తోంది. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్‌కు చెందిన అగ్ర కమాండర్ ఖాసీ సులేమానీ హత్యకు అమెరికానే కారణమని టెహ్రాన్ ఆరోపిస్తోంది.

# కరిగిపోతున్న అమర్‌నాథ్ మంచులింగం

**శ్రీనగర్,జులై 10:** శతాబ్దాలుగా కోట్ల మంది హిందువులు అత్యంత పవిత్రంగా పూజించే అమర్‌నాథ్ గుహలోని సహజసిద్ధ మంచు లింగం (బాబా బర్ఫానీ) యాత్ర ప్రారంభమైన కేవలం ఐదు రోజుల్లోనే 90 శాతానికిపైగా కరిగిపోవడం కలకలం రేపుతోంది. ఈ నెల 3న ప్రారంభమైన అమర్‌నాథ్ యాత్రకు భక్తులు రికార్డు స్థాయిలో తరలివచ్చారు. అయితే, యాత్ర మొదలైన మొదటి వారంలోనే మంచు లింగం దాదాపు అదృశ్యమవడంతో దర్శనానికి వస్తున్న భక్తులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఈ మార్పుపై పీడీపీ నాయకురాలు ఇల్తిజా ముఫ్తీ సామాజిక మాధ్యమ వేదికగా ఆందోళన వ్యక్తం చేస్తూ, గుహ పరిసరాల్లో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని హెచ్చరించారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం రోజుకు కేవలం 10వేలమంది భక్తులను మాత్రమే అనుమతించాలనే నిబంధన ఉన్నప్పటికీ, మొదటి నాలుగు రోజుల్లోనే ఏకంగా 93వేల మందికి పైగా భక్తులు గుహను సందర్శించారు. అధికారిక నమోదు లేకుండా వస్తున్న వేలాది మంది అదనపు భక్తుల వల్ల అక్కడి మౌలిక వసతులపై, పర్యావరణంపై తీవ్ర ఒత్తిడిపెరుగుతోందని జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా కూడా ఆందోళన వ్యక్తంచేశారు. అమర్‌నాథ్ మంచు లింగం ఇంత వేగంగా కరిగిపోవడానికి గ్లోబల్ వార్మింగ్ (భూతాపం),మానవ కార్యకలాపాలే ప్రధానకారణాలని శాస్త్రవేత్తలు, నిపుణులు హెచ్చరిస్తున్నారు. సముద్ర మట్టానికి 3,888 మీటర్లఎత్తులో ఉన్న ఈ గుహ పరిసర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగుతున్నాయి. గతంలో 2018, 2020, 2022 సంవత్సరాల్లోనూ మంచు లింగం త్వరగా కరిగినప్పటికీ ఈసారి కేవలం ఐదు రోజుల్లోనే కరిగిపోవడం పర్యావరణ విపత్తుకు అద్దం పడుతోంది.

# మేఘాలయ హనీమూన్ హత్య కేసు నిర్దోషినని సుప్రీంలో సోనమ్ వాదన



**న్యూఢిల్లీ, జులై 10:** మేఘాలయ హానీమూన్ హత్య కేసులో తనను తప్పుగా ఇరికించారని ప్రధాన నిందితురాలు సోనమ్ రఘువంశీ సుప్రీంకోర్టుకు తెలిపారు.మేఘాలయలో హానీమూన్ సందర్భంగా తన భర్త రాజా హత్య కేసుల ప్రధాన నిందితురాలైన సోనమ్ రఘువంశీ, తాను నిర్దోషినని సుప్రీంకోర్టులో వాదించారు. రాష్ట్ర హైకోర్టు మంజూరు చేసిన తన బెయిల్‌ను రద్దు చేయాలన్న మేఘాలయ ప్రభుత్వ అభ్యర్థనను వ్యతిరేకిస్తూ ఆమె అఫిడవిట్ దాఖలు చేశారు. తనను తప్పుగా ఇరికించారని, ప్రాసిక్యూషన్ కేసు కేవలం అనుమానం, పరిస్థితుల పైనే ఆధారపడి ఉందని సోనమ్ తన అఫిడవిట్‌లో ఆరోపించారు. ఆమెకు బెయిల్ మంజూరు చేయాలన్న హైకోర్టు నిర్ణయాన్ని మేఘాలయ ప్రభుత్వం సవాలు చేయగా, సుప్రీంకోర్టు సోనమ్ అభ్యర్థనను విచారించింది. హైకోర్టు ఉత్తర్వుల ఆధారంగా ఆమె ఇప్పటికే విడుదలయ్యారని పేర్కొంటూ, ఆమె బెయిల్‌ను రద్దు చేయడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. బెయిలు మంజూరు చేయడానికి హైకోర్టు చెప్పిన కారణాలపై ధర్మాసనానికి సందేహాలు వ్యక్తమైనప్పటికీ, ఈ దశలో జోక్యం చేసుకోకూడదని నిర్ణయించుకుంది. విచారణ సందర్భంగా, తన అరెస్టుకు గల కారణాలను తనకు తెలియ జేయలేదని, సరైన న్యాయ సహాయం నిరాకరించారని సోనమ్ తరఫు న్యాయవాది వాదించారు. గతంలో బెయిలు దరఖాస్తుల సమయంలో దిగువ కోర్టులలో ఈ అభ్యంతరాలను ఎందుకు లేవనెత్తలేదని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. మేఘాలయ తరఫున వాదిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, ఈకేసు 'దిగ్భ్రాంతికరమ్, పథకం ప్రకారం జరిగిన హత్యఅని, అరెస్టు పత్రాలలో జరిగిన ఒక అక్షర దోషం కారణంగా బెయిలు మంజూరు చేశారని వాదించారు. హత్యకు సంబంధించిన సెక్షన్ 103కు బదులుగా, అరెస్టు మెమోలో పొరపాటున భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)లోని సెక్షన్ 403ను పేర్కొన్నారని మెహతా వివరించారు. ఇది కేవలం ఒక గుమాస్తా పొరపాటు అని, దీనివల్ల నిందితురాలికి ఎలాంటి నష్టం జరగదని ఆయన వాదించారు. ఇలాంటి పొరపాటు అరెస్టును రద్దు చేయగలదా? బెయిలు మంజూరును సమర్థించగలదా? అనే విషయాన్ని విస్తృత ధర్మాసనానికి నివేదించవచ్చని కూడా సుప్రీంకోర్టు సూచించింది.

# అయోధ్య విరాళాల చోరీ కేసు: 13న సుప్రీంలో విచారణ

**న్యూఢిల్లీ, జులై 10:**అయోధ్య రామాలయం విరాళాల చోరీపై నమోదు అయిన పిటిషన్లపై జులై 13వ తేదీన విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. రామాలయ నిధుల చోరీ కేసులో అరెస్టు అయిన 8 మందిని ఒక్క రోజు కస్టడీలోకి తీసుకోవాలని జులై7వ తేదీన అయోధ్య కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్న విషయం తెలిసిందే. అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుశ్ మిశ్రా, కరుణేశ్ పాండేలను రిమాండ్‌లోకి తీసుకోవాలని కోర్టు సూచించింది. జూన్ 29వ తేదీన స్థానిక కోర్టు 8 మంది నిందితులను 14రోజుల జుడిషియల్ కస్టడీకి ఆదేశించింది. అయితే ఈ అంశంపై దాఖలైన మూడు పిటీషన్లను సుప్రీంకోర్టు విచారించనున్నది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చితో కూడిన ధర్మాసనం ఆ పిటీషన్లను పరిశీలించనున్నది.

# సంక్షిప్త వార్తలు

## రష్యాపై ఉక్రెయిన్ భీకర దాడులు

**క్యీవ్,జులై 10:** రష్యా ఆర్థిక జీవనాడి అయిన చమురు శుద్ధి కర్మాగారాలు, ఇంధన నిల్వ కేంద్రాలే లక్ష్యంగా ఉక్రెయిన్ తన డ్రోన్ దాడులను ముమ్మరం చేసింది. రష్యాలోని స్టావ్‌రోపోల్, ట్వెర్, ఉఫా ప్రాంతాలతో పాటు క్రిమియాలోని కీలక చమురు పంపింగ్ స్టేషన్లను తమ దళాలు పూర్తిగా ధ్వంసం చేశాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. యుద్ధాన్ని ముగించడానికి మాస్కో నిరాకరిస్తుండడం వల్లే ఈ దాడులు పెంచామని, రష్యా వెనక్కి తగ్గే వరకు ప్రతిరోజూ అక్కడ యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తామని ఆయన హెచ్చరించారు.

## డిజిటల్ సంతకాలు వీసాలకు చెల్లవు..

**న్యూఢిల్లీ, జులై 10:** హెచ్1బీ వీసా పిటిషన్లు, గ్రీన్ కార్డ్ దరఖాస్తులు సహా ఇమిగ్రేషన్ ప్రయోజన అభ్యర్థనలపై దరఖాస్తుదారులు ఎలా సంతకం చేయాలన్న విషయమై అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సీఐఎస్) శుక్రవారం నుంచి కొత్త నిబంధనలను అమలుకు తెచ్చింది. కొత్త నిబంధనల ప్రకారం చేతిరాతతో చేసిన సంతకాలు లేదా నకలు సంతకాన్ని(రీప్రొడ్యూస్డ్ సిగ్నేచర్) మాత్రమే అధికారులు స్వీకరించనున్నారు. కాపీ పేస్ట్ చేసిన సంతకం, ఆటో జనరేటెడ్ లేదా అనధికార సంతకంతో కూడిన దరఖాస్తును అధికారులు తిరస్కరిస్తారు.

## చైనా మెగా ప్రాజెక్టుకు భూకంపాల ముప్పు

**బీజింగ్,జులై 10:** బ్రహ్మపుత్ర నదిపై చైనా భారీ స్థాయిలో నిర్మిస్తున్న మెగా హైడ్రోపవర్ ప్రాజెక్టు భద్రతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ డ్యామ్ నిర్మాణ ప్రాంతం కింద ఒక క్రియాశీలక ఫాల్ట్ లైన్ ఉన్నట్లు చైనాకు చెందిన జియాలజిస్టులే స్వయంగా హెచ్చరించారు. దీనివల్ల ఆ ప్రాంతంలో భూకంపాలు సంభవించే, కొండచరియలు విరిగిపడే ప్రమాదం పొంచి ఉందని వారి అధ్యయన నివేదిక వెల్లడించింది. ఈ నివేదిక గత నెలలో ప్రచురితమైంది.

## బాలీవుడ్ నటుడికి 3నెలల జైలు



**న్యూఢిల్లీ, జులై 10:** బాలీవుడ్ నటుడు రాజ్‌పాల్ యాదవ్‌కు చెక్ బౌన్స్ కేసులో ఢిల్లీ హైకోర్టు మూడునెలల జైలు శిక్ష విధించింది. ట్రయల్ కోర్టు విధించిన ఆరునెలల శిక్షను హైకోర్టుతగ్గించింది. జస్టిస్ స్వర్ణకాంత శర్మ తీర్పు వెలువరించారు. అయితే, తీర్పు అమలుపై రెండునెలల స్టే విధించి, ఉన్నత న్యాయ స్థానాన్ని ఆశ్రయించే అవకాశం కల్పించారు. ఈ తీర్పుపై రాజ్‌పాల్ యాదవ్ స్పందిస్తూ,ప్రస్తుతం నాదగ్గర డబ్బులేనందున జైలుశిక్ష అను భవించాల్సి వస్తోందన్నారు.

## ఎయిర్‌రూటులో తరలిస్తున్న కొకైన్ పట్టివేత

**న్యూఢిల్లీ,జులై 10:** భారత్‌కు విమాన మార్గంలో తరలిస్తున్న సుమారు 22 కేజీల కొకైన్‌ను అమెరికా పోలీసులు పట్టుకున్నారు. ఆ కొకైన్ విలువ సుమారు 1.5 మిలియన్ల డాలర్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. మియామీ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ఉన్న ఎయిర్ కార్గో వేర్‌హౌజ్‌లో ఆ కొకైన్‌ను సీజ్ చేశారు. అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ అధికారులు ఆ డ్రగ్స్‌ను సీజ్ చేశారు. ఓ పార్సిల్‌లో ఉన్న స్పీకర్లు, ఆంప్లిఫయర్స్ కింద ఆ కొకైన్ దాచారు. మ్యూజిక్ ఎక్విప్మెంట్ అన్న మార్కింగ్‌తో పార్సిల్ చేశారు.

## సర్ ఫారాలు నింపేందుకు డబ్బు డిమాండ్!

**రాంచి,జులై 10:** ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పత్రాల పంపిణీ కోసం బూత్ స్థాయి అధికారిణి (బీఎల్‌వో) డబ్బులు డిమాండ్ చేసినట్లు గ్రామస్తులు ఆరోపించారు. దీనితో పాటు డబ్బులు తీసుకుని సర్ ఫారాలు నింపుతున్న సైబర్ కేఫ్‌పై ఎన్నికల అధికారులు చర్యలు చేపట్టారు.జార్ఖండ్‌లో ఈ సంఘటన జరిగింది. గర్వా జిల్లాలో బీఎల్‌వోగా విధులు నిర్వహిస్తున్న జమీలా బీబీ,సర్ ఫారాల పంపిణీ, పూరించడం, స్వీకరించడం కోసం రూ. 50 నుంచి రూ.100 వరకు డిమాండ్ చేసినట్లు గ్రామస్తులు ఆరోపించారు.

## ఫోర్జరీ పత్రాలతో ఉద్యోగాలు పొందిన టీచర్ల తొలగింపు

**పాట్నా,జులై 10:** బీహార్ విద్యాశాఖ రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. నకిలీ పట్టాలు, ఫోర్జరీ చేసిన విద్యా ధ్రువీకరణ పత్రాలను సమర్పించి మోసపూరితంగా ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలు సంపాదించిన 3,035మంది టీచర్లను విధుల్లోంచి తొలగించింది. 2006నుండి 2015 మధ్య కాలంలో జరిగిన ఉపాధ్యాయుల నియామకాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర విజిలెన్స్ బ్యూరో గత కొంతకాలంగా లోతైన దర్యాప్తు చేపట్టింది. ఈ సుదీర్ఘ విచారణ ముగిసిన తర్వాత విజిలెన్స్ బ్యూరో సమర్పించిన నివేదిక ఆధారంగా ఈ భారీ చర్యలకు విద్యాశాఖ పూనుకుంది.

# శబరిమల కానుకల లెక్కింపుపై హైకోర్టు కీలక ఆదేశాలు



**తిరువనంతపురం, జులై 10:** శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన కానుకల మదింపు, భద్రతకు సంబంధించి కేరళ హైకోర్టు తాజాగా ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డుకు కీలక ఆదేశాలు జారీ చేసింది. 80 బస్తాలలో భద్రపరిచిన అయ్యప్పస్వామి బంగారు, వెండి కానుకల లెక్కింపు ప్రక్రియను పర్యవేక్షిస్తున్న మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కెటి శంకరన్‌కు అవసరమైన అన్ని సహాయ సహకారాలుఅందించాలని బోర్డును కోర్టు ఆదేశించింది. ప్రత్యేక కమిషనర్ సమర్పించిన నివేదికను పరిశీలిస్తూ జస్టిస్ వి.రాజా విజయ రాఘవన్ ఈ ఉత్తర్వులు ఇచ్చారు. జులై 4న నిర్వహించిన తనిఖీల్లో ఆ 80 సంచులలో కేవలం బంగారం, వెండి మాత్రమే కాకుండా ఇతర సామగ్రి కూడా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో, విలువ లేని వస్తువులను ముందుగా వేరు చేస్తే తప్ప అసలైన కానుకల విలువను నిర్ధారించడం సాధ్యం కాదని నివేదిక పేర్కొంది. ఈ వేరుచేసే ప్రక్రియకు, మదింపునకు పూర్తి సహకారం అందిస్తామని దేవస్థానం బోర్డు కోర్టుకు హామీ ఇచ్చింది. భవిష్యత్తులో స్వీకరించే విలువైన కానుకలను సురక్షితంగా భద్రపరచడానికి అనుసరించబోయే శాశ్వత విధానాన్ని తమకు తెలియజేయాలని బోర్డు స్టాండింగ్ కౌన్సిల్‌ను హైకోర్టు ఆదేశించింది. ఆలయానికి వచ్చే కానుకలను క్రమానుగతంగా మదింపు చేసి, ఒక సమగ్రమైన డిజిటల్ ఇన్వెంటరీ ద్వారా నమోదు చేయడమే దీని ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఆగస్టు 4వ తేదీకి వాయిదా వేసింది.

# డిజిటల్‌రైల్వే టికెట్లు బుక్‌చేసిన మొబైల్‌లోనే చూపించాలి

**న్యూఢిల్లీ,జులై 10:** భారతీయ రైల్వే శాఖ డిజిటల్ అన్‌రిజర్వ్‌డ్ టికెట్ల విషయంలో ప్రయాణికులకు కీలక స్పష్టతనిచ్చింది. రైల్ వన్ యాప్ ద్వారా బుక్ చేసుకున్న డిజిటల్ టికెట్లను ప్రయాణ సమయంలో తప్పనిసరిగా బుకింగ్ చేసిన మొబైల్ ఫోన్‌లోనే చూపించాలని స్పష్టం చేసింది. టికెట్ స్క్రీన్‌షాట్లు, పీడీఎఫ్ కాపీలు లేదా వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా ఫార్వార్డ్ చేసిన కాపీలు చెల్లవని తేల్చి చెప్పింది. వీటిని ప్రయాణానికి సరైన ఆధారాలుగా పరిగణించబోమని రైల్వే అధికారులు వెల్లడించారు. డిజిటల్ టికెట్ల దుర్వినియోగాన్ని అరికట్టేందుకే ఈ నిబంధనను కఠినంగా అమలు చేస్తున్నట్లు సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే అధికారిక ఎక్స్ ఖాతాలో వెల్లడించింది. ఇటీవల ఓ ప్రయాణికుడు వాట్సాప్ స్క్రీన్‌షాట్ చూపించగా, అధికారులు అతడికి జరిమానా విధించినట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో ఈ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రయాణికులు రైలు బయలుదేరక ముందే టికెట్ బుక్ చేసుకోవాలని, ప్రయాణ సమయంలో టికెట్ బుక్ చేసిన ఫోన్‌తో పాటు తప్పనిసరిగా అసలు గుర్తింపుకార్డును వెంట ఉంచుకోవాలని అధికారులు సూచించారు. రైల్వేశాఖ నిర్ణయంపై సోషల్ మీడియా వేదికగా ప్రయాణికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. కుటుంబ సభ్యులందరికీ ఒకరే టికెట్లు బుక్‌చేసే సందర్భాల్లోనూ, సాంకేతిక పరిజ్ఞానంలేని వృద్ధుల ప్రయాణించేటప్పుడు ఎదురయ్యే సాధకబాధల గురించి పలువురు ప్రశ్నిస్తున్నారు. టికెట్ బుక్ చేసిన వ్యక్తి ప్రయాణంలో లేకపోతే ఇబ్బందులు తప్పవని వారు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రయాణికుల ఆందోళనలపై రైల్వే శాఖ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు.రైల్ వన్‌యాప్‌లో డిజిటల్ పద్ధతిలోఅన్‌రిజర్వ్‌డ్ టికెట్లుకొనుగోలు చేస్తే 3శాతంరాయితీ లభిస్తున్నప్పటికీ, తాజాగా ఈ నిబంధన అనేక మందికి ఇబ్బందికరంగా మారింది.

# గురుగ్రామ్‌లో ఎన్‌కౌంటర్

## నలుగురు క్రిమినల్స్ హతం

**గురుగ్రామ్,జులై 10:**ఢిల్లీసమీపంలోని గురుగ్రామ్‌లో గురువారం రాత్రి పోలీసులు, నేరస్థుల మధ్య ఫైరింగ్ జరిగింది. సుమారు 60 రౌండ్ల పాటు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఆ ఘటనలో నలుగురు నేరస్థులు మృతిచెందగా, ముగ్గురు పోలీసులు గాయపడ్డారు. గురుగ్రామ్‌లోని సుశాంత్ లోక ఫేజ్‌లో ఆ ఎన్‌కౌంటర్ జరిగింది. గురువారం రాత్రి 9.30 నిమిషాలకు క్రైం బ్రాంచ్ పోలీసులు సమాచారం అందుకున్నారు. ఓ స్కార్పియో ఎస్‌యూవీలో సాయుధ వ్యక్తులు ఉన్నట్లు తెలిసింది. ఆ ఇంటెలిజెన్స్ ఆధారంగా క్రైం బ్రాంచ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సువాంత్ లోక్ ఫేజ్‌లో ఉన్న ఓ వ్యాపారి ఇంటి వద్ద ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. విదేశాల్లో ఉన్న ఓ గ్యాంగ్‌స్టర్ వ్యాపారి నుంచి బెదిరింపుకు పాల్పడుతున్నట్లు తెలిసింది. అనుమానిత నిందితులను పోలీసులు చుట్టుముట్టారు. లొంగిపోవాలని ఆదేశించారు. కానీ నిందిత వ్యక్తులు విచక్షణారహితంగా ఫైరింగ్ చేశారు. ఆ కాల్పులకు కౌంటర్‌గా పోలీసులు ఫైరింగ్‌కు దిగారు. దీపక్ నందల్ గ్యాంగ్‌కు చెందిన షూటర్లు ఈ కాల్పుల్లో పాల్గొన్నారు. అందరికీ గాయాలు అయినట్లు తెలిసింది. ఓ ప్రైవేటు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. కానీ నలుగురు మృతిచెందినట్లు డాక్టర్లు చెప్పారు. అయిదో వ్యక్తి మాత్రం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు గురుగ్రామ్ పోలీసులు కూడా గాయపడ్డారు. వాళ్లను కూడా ఆస్పత్రికి తీసుకెళ్లారు.

# ఉత్తరాదిని ముంచెత్తుతున్న భారీ వర్షాలు

## విరిగిపడుతున్న కొండచరియలు

## పెద్దసంఖ్యలో సాధారణ ప్రజలు మృతి



**న్యూఢిల్లీ,జులై 10:** ఉత్తరాది రాష్ట్రాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. భారీ వర్షాలకు ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో కొండచరియలు విరిగిపడగా పలువురు మరణించినట్లు అధికారులు వెల్లడించారు. యూపీలోని సంత్ కబీర్ నగర్, కుషినగర్, బులంద్ షహర్, షమ్లీ, ఘజియాబాద్ లలో వర్షాల కారణంగా కొందరు మరణించారు. భారీ వర్షాల ధాటికి నదులు, వాగులు ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తుండగా కొన్ని ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే 16 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదవ్వగా సూరత్ లో రోడ్లు జలమయమై వాగులను తలపిస్తున్నాయి. మరోవైపు ఉత్తరాఖండ్‌లో నేడు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. ఇప్పటికే కురిసిన భారీ వర్షాలకు అలకనంద, మందాకిని నదులు పొంగి పొర్లుతుండగా మరోసారి అతిభారీ వర్షాల హెచ్చరికలు రావడంతో అధికారులు అప్రమత్తమై లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. రుద్రప్రయాగ్ జిల్లాలో స్కూళ్లను మూసివేశారు. హిమాచల్ ప్రదేశ్ లో 75 ప్రాంతాల్లో రోడ్లు ధ్వంసమవ్వగా 29 విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు వర్షాలు, గాలులకు పాడైనట్లు గుర్తించారు. భారీ వర్షాల నేపథ్యంలో చార్ ధామ్ యాత్రకు అంతరాయం ఏర్పడింది. ఉత్తరకాశి జిల్లాలో కొండచరియలు విరిగిపడటంతో గంగోత్రి హైవే మూసుకుపోయింది. ఉత్తరప్రదేశ్ లోనూ నేడు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఘజియాబాద్, మీరట్, హాపూర్, బులంద్ షహర్, బాఘ్ పత్, ముజఫర్ నగర్, మొరాదాబాద్ జిల్లాల్లో స్కూళ్లకు ముందుగానే సెలవు ప్రకటించారు. మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది.

# ఉద్యోగుల నూతన హెల్త్ స్కీమ్‌లో 15 నుంచి చికిత్సలు



### 943 ఆస్పత్రుల్లో హెల్త్‌కార్డులపై నగదురహిత వైద్యసేవలు

### మరో 24 జిల్లా కేంద్రాల్లో నూతన వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా

### హెల్త్‌కార్డుల పంపిణీ సంఘాలతో సిఎస్ సమావేశం

**హైదరాబాద్, జూలై 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల నూతన హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్)ను ఈ నెల 15 నుంచి అమలు చేయనున్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా హెల్త్‌కార్డుల పంపిణీ చేయనున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) కింద హెల్త్ కార్డులను ఈ నెల 15 నుంచి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా త్వరలో ఉద్యోగులకు హెల్త్ కార్డులను అధికారికంగా పంపిణీ చేయనున్నట్లు సమావేశంలో వెల్లడించారు. ఉద్యోగులకు, పెన్షనర్లకు మెరుగైన, నగదు రహిత వైద్య సేవలు అందించేందుకు ఈ హెల్త్ కార్డు విధానం ఉపయోగపడుతుందని సమావేశంలో అభిప్రాయపడుతూ, అమలుకు సంబంధించిన ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఖర్చుతో అన్నీ జిల్లా కేంద్రంలో వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ బోర్డు సమావేశం శుక్రవారం మధ్యాహ్నం నూతన సిఎస్ సంజయ్‌జాజు అధ్యక్షతన సచివాలయంలో జరిగింది. క్యూఆర్ కోడ్‌తో నూతన హెల్త్ కార్డులు మొబైల్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అన్ని వివరాలతో ఈహెచ్ఎస్‌టి యాప్ రూపొందించారు. చికిత్సలకు సీజీహెచ్ఎస్ రేట్లు వర్తింపజేస్తారు.

నాలుగు రోజుల్లో నూతన ఈహెచ్ఎస్ మార్గదర్శకాల జిఒ విడుదల చేయనున్నారు. నూతన హెల్త్ కార్డులపై చికిత్సలు ఈ నెల 15 నుంచి ప్రారంభమవుతాయి. రాష్ట్రవ్యాప్తంగా 943 హాస్పిటల్స్‌లో హెల్త్‌కార్డులపై నగదురహిత వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి. 2594 ప్రొసీజర్స్ కవర్ అవుతాయి. ఇప్పుడున్న 12 వెల్ నెస్ సెంటర్లకు తోడు మరో 24 జిల్లా కేంద్రాల్లో నూతన వెల్ నెస్ సెంటర్లు ఏర్పాటు చేస్తారు. అవుట్ పేషెంట్ ట్రీట్మెంట్, పరీక్షలు, రోజువారీ ఔషధాలు వెల్ నెస్ సెంటర్లలో అందుబాటులో ఉంటాయి. నూతన ఈహెచ్ఎస్ మార్గదర్శకాలపై చర్చ కోసం సోమవారం సీఈవోతో సమావేశం ఉంటుంది. సమావేశంలో పలు శాఖల ఉన్నతాధికారులు మహేష్ దత్ ఎక్కా, క్రిస్టినా చొంగ్తూ, సిక్తా పట్నాయక్, హనుమంత్ కొండిబా, షికా గోయల్, పాపిరెడ్డి, వాణి ప్రసాద్, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మారం జగదీశ్వర్ (టీఎన్జీవో అధ్యక్షులు), ఏలూరి శ్రీనివాసరావు (టీజీవో అధ్యక్షులు), దామోదర్ రెడ్డి (పీఆర్‌టీయూ), చావా రవి (యూటీఎఫ్), శ్రీనివాసరెడ్డి (సెక్రెటేరియట్ అసోసియేషన్), వంగ రవీందర్ రెడ్డి (ట్రెసా), సదానంద గౌడ్ (ఎస్టీయూ), సైదులు (ఎస్‌టీఎఫ్), దాస్య నాయక్ (క్లాస్4 ఉద్యోగుల సంఘం), పెన్షనర్ల సంఘ ప్రతినిధులు వెంకటరెడ్డి, కృష్ణమూర్తి, ఉమాదేవి, బి. శ్యామ్ (టీజీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి) పాల్గొన్నారు.

# రేవంత్ ఫోబియాతో హరీశ్‌రావుకు దిగులు

### చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**హైదరాబాద్, జూలై 10, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫోబియాతో హరీశ్‌రావుకు మళ్లీ కనీసం ఎమ్మెల్యేగానైనా గెలుస్తామోలేదో అనే దిగులు పట్టుకొందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గాంధీభవన్‌లో శుక్రవారం మాట్లాడుతూ హరీశ్‌రావు 'రేవంత్ రెడ్డి'కి పిచ్చి అంటుండు, అసలు పిచ్చి లేసింది ఆయనకే అన్నారు. హరీశ్‌రావు, కేటీఆర్ స్వైరల్‌లో విలన్ లాగ ప్రవర్తిస్తున్నారని, హంతకులే సంతాప సభ పెట్టినట్లు బీఆర్ఎస్ నాయకులు తీరు ఉందని అన్నారు.



గతంలో ఆంధ్ర సెంటిమెంట్‌ను రెచ్చగొట్టి పబ్బం గడుపుకున్నారని, ఇప్పుడు కూడా రెచ్చగొట్టాలని చూస్తే కుదరదంటూ చెప్పారు. మీరు దోచుకున్న 1400 కోట్ల పార్టీ ఫండ్ ను అమరవీరులు కుటుంబాలకు ఇవ్వండని డిమాండ్ చేశారు. మీరు కాళేశ్వరం లో ఎంత దోచుకున్నారో ప్రజలకు అర్థం అయిందని అన్నారు. జైలుకు వెళ్లకూడదనే కుట్రలో కాళేశ్వరం కట్టారని, తొందరలోనే తెలంగాణ ప్రజలు మీపై తిరగబడే పరిస్థితి వస్తుందనీ హెచ్చరించారు. హరీష్ రావు పుట్టకముందే కాంగ్రెస్ పార్టీ ప్రాజెక్టు లు కట్టిందనీ అన్నారు. కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టుల వలన ప్రజలు సుభిక్షంగా ఉన్నారనీ ఆయన చెప్పారు. మీరు కట్టిన ఏకైక ప్రాజెక్టు కాళేశ్వరం కులేశ్వరం అయిందనీ గుర్తుచేశారు. తెలంగాణ పట్ల మాకు నిబద్ధత ఉందని ముఖ్యమంత్రి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బాగా పని చేస్తున్నారని కితాబు ఇచ్చారు.

# ఎలక్ట్రిక్ బస్సులు వద్దు - డీజిల్‌బస్సులే ముద్దు

### టిజిఎస్ఆర్టీసి జెఎసి డిమాండ్

**హైదరాబాద్, జూలై 10, ప్రభాతవార్త:** ఎలక్ట్రిక్ బస్సులు వద్దు - డీజిల్ బస్సులే ముద్దు అని టిజిఎస్ఆర్టీసి జెఎసి డిమాండ్ చేసింది. కాలుష్య నివారణ పేరుతో ఆర్టీసిలో ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెట్టడం జరిగిందని, ఈ మధ్య కాలంలో జెబిఎం, ఒలెక్ట్రా బస్సులు అకస్మాత్తుగా షార్ట్ సర్క్యూట్ సంభవించి దగ్ధం అవుతుండడంతో అటు ప్రజలు, ఇటు ఆర్టీసి సిబ్బంది భయభ్రాంతులకు గురవుతున్నారని జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి మౌలానా, కోకన్వీనర్లు కత్తుల యాదయ్య, బి.యాదగిరి అన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను రిపేర్ చేయుటకు ఆయా కంపెనీలు తరలించడం వలన బస్సులు ప్రైవేటు డిపోలలో పని చేస్తున్న కండక్టర్లకు డ్యూటీలు లేకపోవడంతో నిత్యం లీవులు పెడడం, కొంతమందిని ఇతర డిపోలకు బదిలీ చేయడం వల్ల కార్మికులు తీవ్ర అభద్రతా భావంతో ఉన్నారన్నారు. ఆర్టిసి సంస్థ మొదలైనప్పటి నుండి డీజిల్ బస్సులనే ఉపయోగిస్తున్నారని, అవి ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా పని చేస్తున్నాయని, వాటివల్ల ప్రయాణీకులకు భద్రత కల్పించటంతో పాటు వారిని క్షేమంగా, సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చుటకు డీజిల్ బస్సులే ఉత్తమమని జెఎసి భావిస్తోందన్నారు. కాబట్టి ఆర్టిసి యాజమాన్యం తక్షణమే ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సుల స్థానంలో డీజిల్ బస్సులను కొనుగోలు చేసి నడిపించాలని జెఎసి డిమాండ్ చేసింది.

# మత్స్యకారుల అభివృద్ధికి కట్టుబడిన సర్కారు

### మంచి నీటి చేపల ఉత్పత్తిలో రాష్ట్రం అగ్రస్థానం

### రూ.47.03 కోట్లతో ఎగుమతి కేంద్రం నిర్మాణం: మంత్రి శ్రీహరి

**హైదరాబాద్, జూలై 10, ప్రభాతవార్త:** వెనుకబడిన వర్గాలు ముఖ్యంగా మత్స్యకారుల జీవన ప్రమాణాలను పెంపొందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ప్రభుత్వం మత్స్య రంగానికి చాలా ప్రాధాన్య తనిస్తోందని, మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి పలు నిర్ణయాలను తీసుకుంటోందని వెల్లడించారు. జాతీయ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా కోహెడలో రూ. 47.03 కోట్లతో నిర్మాణం చేయనున్న అంతర్జాతీయ స్థాయి ఎగుమతి హోల్‌సేల్ చేపల మార్కెట్‌కు శుక్రవారం ఆయన భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు.

బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వం మత్స్యకారుల ఆర్థిక అభ్యున్నతి కోసం మరో చరిత్రాత్మక అడుగు వేసిందన్నారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ సమీపంలోని కోహెడలో దేశంలోనే తొలి అంతర్జాతీయ మంచినీటి చేపల ఎగుమతి కేంద్రాన్ని ఏర్పాటు చేయనుందని పేర్కొన్నారు. ఈ అంతర్జాతీయ స్థాయి మార్కెట్ ప్రారంభమైతే రాష్ట్రంలోని చేపల ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో గిట్టుబాటు ధర లభిస్తుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించే ఆలోచనలో తెలంగాణ ప్రభుత్వం ఉందని చెప్పారు. తెలంగాణ మత్స్య రంగానికి ఈ నిర్ణయంతో కొత్త వెలుగు రాబోతోందన్నారు. కోహెడలో అంతర్జాతీయ మంచినీటి చేపల ఎగుమతి కేంద్రాన్ని సుమారు 13 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్నట్లు వెల్లడించారు.

2027 ఆగస్టు నాటికి పనులను పూర్తి చేసి కార్యకలాపాలను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ నిధుల్లో కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు ఖర్చు చేస్తూ ఈ ప్రాజెక్టును నిర్మిస్తున్నట్లు వివరించారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద మంజూరైన ఈ ప్రాజెక్టు ఎంతోమంది మత్స్యకారుల జీవితాలను మార్చనుందని అభిప్రాయపడ్డారు.

తెలంగాణ రాష్ట్రం మంచినీటి చేపల ఉత్పత్తిలో దేశంలోనే అగ్రస్థానంలో ఉందని పేర్కొన్నారు. 2025లో రాష్ట్రంలో తొమ్మిది వేల కోట్ల విలువైన చేపలు, రొయ్యలు ఉత్పత్తి అయ్యాయన్నారు.

# సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహం

### రాష్ట్రంలో 489 క్లస్టర్లలో అమలు

### ఎకరానికి రైతులకు రూ.4 నుండి 5 వేల ఆర్థిక సాయం

**హైదరాబాద్, జూలై 10, ప్రభాతవార్త:** రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం వల్ల నేల సారం తగ్గిపోవడంతో పాటు ప్రజల ఆరోగ్యంపైనా ప్రభావం పడుతున్న నేపథ్యంలో ప్రకృతి (సేంద్రీయ) వ్యవసాయానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వ్యవసాయ శాఖ అధికార వర్గాల వివరాల ప్రకారం రసాయన రహిత, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరిస్తోంది. రైతులకు ఆర్థిక సహాయం, శిక్షణతో పాటు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తూ సేంద్రియ సాగును మరింత ప్రోత్సహిస్తోంది. రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు సేంద్రియ వ్యవసాయం చేసే రైతులకు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నాయి. తెలంగాణ, రాజస్థాన్ సహా పలు రాష్ట్రాల్లో రసాయనాలకు బదులుగా సహజ పద్ధతులు అవలంబిస్తూ పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు పండించే వారికి ఎకరానికి రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు నగదు ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాయి. అదేవిధంగా నేషనల్ మిషన్ ఆన్ నేచరల్ ఫార్మింగ్, పరంపరాగత్ కృషి వికాస్ యోజన ద్వారా రైతులకు సేంద్రియ సాగుకు ప్రత్యేక శిక్షణ, ఎరువులు, విత్తనాల కోసం ఈ సాయం అందుతుంది. నేషనల్ మిషన్ ఆన్ నాచురల్ ఫార్మింగ్ కింద రాష్ట్రంలోని 489 క్లస్టర్లను గుర్తించి ఆసక్తి ఉన్న రైతులకు ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక శిక్షణ అందించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, నేల ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు నాణ్యమైన ఆహార ఉత్పత్తులను పెంచడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. కాగా ప్రకృతి వ్యవసాయంలో ఎలాంటి రసాయన ఎరువులు లేదా కృత్రిమ పురుగుమందులు ఉపయోగించరు. ఆవు పేడ, ఆవు మూత్రం, బెల్లం, పప్పు పిండి వంటి స్థానికంగా లభించే సహజ పదార్థాలతో తయారుచేసిన జీవామృతం, ఇతర సేంద్రియ ద్రావణాలను మాత్రమే పంటలకు వినియోగిస్తారు. వీటి తయారీ విధానంపై రైతులకు ఇప్పటికే ప్రత్యేక శిక్షణ కూడా అందించారు. రైతు, వినియోగదారు, పర్యావరణం.. ఈ మూడింటికీ ప్రయోజనం చేకూర్చే సుస్థిర వ్యవసాయ విధానంగా ప్రకృతి వ్యవసాయం మారుతున్న నేపథ్యంలో, మరింత మంది రైతులు ఈ విధానాన్ని అవలంబించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

# తల్లి, కుమారుడి దాడిలో తండ్రి మృతి

### కుటుంబకలహాలే కారణం

### భార్య, కుమారుడిపై కేసు నమోదు


**సుల్తానాబాద్, ప్రభాతవార్త:** మండలంలోని కదంబాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని తుర్కకాశిపల్లిలో కుటుంబకలహాలు విషాదానికి దారితీశాయి. భార్య, కుమారుడు కలిసి దాడి చేయడంతో తండ్రి మృతి చెందిన ఘటన గురువారంరాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తుర్కకాశిపల్లికి చెందిన సయ్యద్ గోరేమియా(40)కు భార్యతో ఆరు నెలలుగా తరచూ కుటుంబ విభేదాలు కొనసాగుతున్నాయి. ఈ వివాదాలపై పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. దీంతో సయ్యద్ గోరేమియా రెండు నెలలుగా మెట్‌పల్లి ప్రాంతంలో నివసిస్తూ, మూడు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. గురువారం రాత్రి భార్య వద్దకు వెళ్లిన సందర్భంగా మరోసారి గొడవ జరగగా, కుమారుడు సయ్యద్‌అలీ (18) మటిపెల్లతో తండ్రిపై దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం భార్య కూడా నీళ్ల సీసాతో కొట్టడంతో సయ్యద్ గోరేమియా తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు వెల్లడించారు. మృతుడి తండ్రి సయ్యద్ మస్తాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు సుల్తానాబాద్ ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

# నేడు గాంధీభవన్‌లో తుంగతుర్తి సమావేశం

### మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త:** తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ ఆదేశాలతో సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం లోని ఇటీవలే జరిగిన రాజకీయ పరిణామాలపై పార్టీ అంతర్గత సమావేశం శనివారం మధ్యాహ్నం గాంధీభవన్‌లో ఏర్పాటు చేశామనీ మాజీ ఎమ్మెల్యే టిపిసిసి వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు.

ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే మందుల సామెల్, ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా మంత్రులతో పాటు నియోజకవర్గంలోని ముఖ్య నాయకులను ఆహ్వానించాలని సూర్యాపేట జిల్లా పార్టీ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్యకి ఫోన్ ద్వారా ఆదేశాలు జారీచేశామని జగ్గారెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని ఇన్‌ఛార్జ్‌లు, ముఖ్య నాయకులకు, ప్రజా ప్రతినిధులకు జిల్లా పార్టీ అధ్యక్షులు స్వయంగా ఫోన్ చేసి ఆహ్వానిస్తారనీ ఆయన వివరించారు. కాంగ్రెస్ నాయకులు నేటి మధ్యాహ్నం 12 గంటలకు గాంధీ భవన్ కు రావాలని జగ్గారెడ్డి తెలిపారు. సచిన్‌సావంత్ జగ్గారెడ్డిలను కొండసురేఖ, కడియం వివాదం తుంగతుర్తి ఎంపి చామలపెత్తనం ఆరోపణలపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఒక పరిశీలక కమిటీని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ నియమించి ఆదేశాలు జారీచేయడంతో ఈ సమావేశం ఏర్పాటు చేశారు.




సిఎం ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డా.జి.చిన్నారెడ్డి. కె.విద్యాసాగర్

# సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 247

**హైదరాబాద్ (బేగంపేట), జులై 10, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన 237వ సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 247 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 120 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 45, హోం శాఖకు 17 దరఖాస్తులు వచ్చాయి. తదితర శాఖలకు సంబంధించి 65 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో సీఎం ప్రజావాణీ ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి కె.విద్యాసాగర్, దరఖాస్తులను స్వీకరించి ఎండార్స్ చేసి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించారు. సిఎం ప్రజావాణిని క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్, సికిందరాబాద్ డీసీసీ అధ్యక్షుడు దీపక్‌జాన్ సందర్శించి డా.చిన్నారెడ్డి, విద్యాసాగర్‌లతో ముచ్చటించారు.

# తెలంగాణ ప్రజలకు నష్టం జరిగితే సహించేది లేదు

### ఎంపి ఈటల రాజేందర్

**హైదరాబాద్ (కంటోన్మెంట్), జులై 10, ప్రభాతవార్త :** నేనే తెలంగాణ బిడ్డ ను, ఉద్యమకారున్ని, అదే నా గుర్తింపు అని, రాజకీయాల కోసం, తెలంగాణ ప్రజల కోసం నష్టం జరుగుతుంటే ఊరుకోనని మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ తెలిపారు. శుక్రవారం కంటోన్మెంట్ డైమండ్ పాయింట్ సమీపంలోని గాయిత్రి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈటల మాట్లాడారు. నన్ను కాల్చిచంపుతానన్నా, నేను ప్రజల విషయంలో రాజీ పడనని అన్నారు. మేడిగడ్డలో నీళ్లు నిలప కుండానే ఎత్తిపోయవచ్చా, అర్థమవుతుందా రేవంత్‌రెడ్డి, నేనే తెలంగాణ మట్టి బిడ్డను, ఉద్యమకారున్ని అదే నా గుర్తింపు అన్నారు. కాంగ్రెస్ పార్టీని కానీ, ఇంకో పార్టీని కానీ తిట్టడానికి రాలేదన్నారు. పని చేయాల్సిన వారిని అడుగుతా, ప్రశ్నిస్తానని ఎంపి ఈటల అన్నారు. దేవాదులకు బేరాజ్ లేదు.. లేకుండా నీళ్లు పంప్ చేస్తున్నారు. మేడిగడ్డకు నీళ్లు పంపమని అడగడం లేదన్నారు. కిందకు నీటిని పంప్ చేయమని అడుగుతున్నా అని అన్నారు. ప్రజలకు కోపం వస్తే కేసిఆర్ వంటి వ్యక్తికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. కాళేశ్వరంలో జరిగిన అవినీతిని బయటపెట్టి బాధ్యునిపై చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయాల కోసం ప్రజలను, రైతులను ఇబ్బంది పెట్టకూడదన్నారు. ఎకె 47 తీసుకొచ్చి



మీడియాతో సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి ఈటల రాజేందర్

కనతమీద పెట్టినా రాజీపడనని, ధర్మం కోసం, ప్రజల కోసం పోరాడుతామని ఈటల అన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మద మల్లికార్జున్, బిజెపి నేతలు పిట్ల నాగేశ్, వేణుగోపాల్‌రెడ్డి, గిరిధర్, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ రిటైర్డ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

# గనుల్లో పటిష్ట రక్షణ చర్యలు

### విధినిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

### మైన్స్ సేఫ్టీ డైరెక్టర్ జనరల్ సాగేశ్

**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త:** సింగరేణి బొగ్గు గనుల్లోని పనిస్థలాల్లో పటిష్టమైన రక్షణ చర్యలు తీసుకోవాలని మైన్స్ సేఫ్టీ డైరెక్టర్ జనరల్ సాగేశ్ కుమార్ స్పష్టం చేశారు. విధి నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సింగరేణి ఏరియా బొగ్గుగనులను సందర్శించి, తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియా కాసిపేట1 బొగ్గు గనిలోకి దిగి పని స్థలాల్లో కార్మికుల కల్పిస్తున్న రక్షణ చర్యలు, వారికి అమలు చేస్తున్న వసతులను తనిఖీ చేశారు. కార్మికులతో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదరహిత సింగరేణిగా మార్చేందుకు అందరు కృషి చేయాలన్నారు. బొగ్గు గనుల్లో కార్మికుల ప్రాణాలకు రక్షణ అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా తీసుకోవాలని చెప్పారు.

గాలి సరఫరా పర్యవేక్షణ, ప్రమాద హెచ్చరిక వ్యవస్థలు, యాంత్రిక పరికరాల వాడకం, మరియు నిరంతర భద్రతా తనిఖీల ద్వారా ప్రాణాపాయాలను నివారించవచ్చన్నారు. గనుల్లో అనుసరించాల్సిన పకడ్బందీ రక్షణ చర్యల్లో భాగంగా భూగర్భ గనుల్లో కార్మికులకు సరిపడా ఆక్సిజన్ అందేలా చూసుకోవడం, ఉక్కపోత లేకుండా అధునాతన వెంటిలేషన్ సిస్టమ్‌లను ఏర్పాటు చేయడం చాలా ముఖ్యమని తెలిపారు. అంతేకాకుండా గనుల్లో మీథేన్, కార్బన్ మోనాక్సైడ్ వంటి హానికరమైన వాయువులు లీకైనప్పుడు ముందుగానే పసిగట్టే ఆటోమేటిక్ సెన్సార్లను, అలారం సిస్టమ్‌లను అమర్చాలన్నారు. ఇక నిపుణులైన ఇంజనీర్లు, భద్రతా అధికారులు ప్రతి షిఫ్ట్‌లోనూ గనిలోని పైకప్పులు, గోడలను నిరంతరం తనిఖీ చేసి, పటిష్టతను నిర్ధారించాలని పేర్కొన్నారు. మైనింగ్ చట్టాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా గనుల నిర్వహణ జరిగేలా పిఐబి భద్రతా నిబంధనల ప్రకారం యాజమాన్యాలు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గని ఆఫీస్లోని రికార్డులను పరిశీలించారు.

# గిరిజనుల అభివృద్ధికి అంకిత భావంతో పనిచేశా

### బెల్లయ్య నాయక్

**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త:** గిరిజనుల సంక్షేమంకోసం అంకితభావంతో గతరెండేళ్ళు పనిచేశానని కొత్తపథకాలకు రూపకల్పన చేసి అభివృద్ధి దిశగా అడుగులు వేసేలా ప్రయత్నం చేశానని ట్రైకార్ ఛైర్మన్ గా బాధ్యతల నుంచి రిలీవ్ అయిన బెల్లయ్య నాయక్ అన్నారు. శుక్రవారం ఆయన గాంధీభవన్‌లో మాట్లాడుతూ గిరిజన సంక్షేమశాఖలోని పథకాలను పొందేందుకు చైతన్యం చేయడమే కాకుండా వారికి అవి అందుకునేలా చేశానని చెప్పారు. ఈ సందర్భంగా తన కార్యాలయ సిబ్బంది బెల్లయ్యకు ఘనంగా వీడ్కోలు పలికారు. ట్రైకార్ ఛైర్మన్‌గా అవకాశాన్ని కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకి, ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్ రెడ్డి కి, కాంగ్రెస్ రాష్ట్ర పార్టీ అధ్యక్షులు మహేష్ గౌడ్‌కి, పార్టీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ రెండు సంవత్సరాల కాలంలో ప్రభుత్వ సహకారంతో గిరిజనుల సంక్షేమ కోసం ఎన్నో కార్యక్రమాలు చేసే అవకాశం వచ్చిందని. రాబోయే రోజులలో ప్రభుత్వం, పార్టీ ఎలాంటి బాధ్యతలు ఇచ్చినా ప్రజల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు.

# కెటిఆర్‌తో ఎంపి వద్దిరాజు రవిచంద్ర భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 10:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మర్యాద పూర్వకంగా కలిశారు. తనపై నమ్మకం ఉంచి తనను పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా ఎంపిక చేసిన బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్, సహకరించిన కేటీఆర్‌కు వద్దిరాజు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంపి రవిచంద్రకు కేటీఆర్ పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వద్దిరాజు ప్రస్తుతం బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీలీడర్‌గా వ్యవహరిస్తున్నారు. పార్టీ పార్లమెంటరీ ఫ్లోర్ లీడర్‌గా వ్యవహరించిన కేఆర్ సురేశ్‌రెడ్డి పదవీకాలం ఇటీవల ముగిసిన నేపథ్యంలో ఆయన స్థానంలో వద్దిరాజును ఎంపిక చేశారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన రవిచంద్ర బహుజనులకు, పార్టీకి అందిస్తున్న సేవలను గుర్తించిన కేసీఆర్ రెండోసారి రాజ్యసభకు ఎంపిక చేశారు. గతంలో రాజ్యసభ సభ్యుడిగా ఉన్న డాక్టర్ బండ ప్రకాశ్ ముదిరాజ్ శాసనమండలికి వెళ్లారు. ఆయన స్థానంలో తొలిసారి వద్దిరాజును రాజ్యసభకు పంపించారు. తాజాగా రెండోసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఆయనతోపాటు రాజ్యసభలో బీఆర్ఎస్ సభ్యులుగా దీవకొండ దామోదర్‌రావు, బండి పార్థ సారథిరెడ్డి కొనసాగు తున్నారు. రవిచంద్ర 2030 ఏప్రిల్ వరకు ఈ బాధ్యతల్లో కొనసాగ నున్నారు. ప్రస్తుతం ఆయన పెట్రోలియం, సహజవాయువు పార్లమెంటరీ స్థాయీసంఘం, బొగ్గు గనుల శాఖ సంప్రదింపుల కమిటీ సభ్యులుగా వ్యవహరిస్తున్నారు.

# భరోసా లేకపోవడంతో బిఆర్ఎస్ కేడర్‌ను కోల్పోతోంది

### ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీ భరోసా లేని పార్టీగా మారడంతో ఆ పార్టీ క్యాడర్ ను కాపాడుకోలేకపోతుందని అందుకే బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ సోల్లు కబుర్లు చెబుతున్నారనీ ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ కెటిఆర్ అధికారంలోకి వస్తామని ఫోన్ ట్యాపింగ్ చేసినట్టు సినిమా వాళ్ల ఫోన్లు వింటున్నట్టు కలలు కంటు న్నాడనీ ఎద్దేవా చేశారు. జూబ్లిహిల్స్ ఉప ఎన్నికలో కూడా సర్వేలో తామే ఉన్నామని కెటిఆర్ అన్నాడనీ గుర్తుచేశారు. కంటోన్మెంట్, జూబ్లిహిల్స్ సిట్టింగ్ స్థానాన్ని బిఆర్ఎస్ కోల్పోయిందనీ ఇదీ కూడా అంతే అని ఆయన అన్నారు. తుంగతుర్తి అంశంపై స్పందిస్తూ అదీ మా ఇంటి సమస్య మాకు ఏం పంచాయతీలు లేవు మందుల సామెలు నాకు సోదరుడు అని ఆయన అన్నారు. మండల కమిటీ అధ్యక్షుల విషయంలో అందరినీ సంప్రదించి నిర్ణయం తీసుకుంటే బాగుండు అన్నాను అని ఆయన వివరించారు. విషయం సద్దు మణిగించాలని భావించాను అని చెప్పుకొన్నారు. నేను కాంగ్రెస్ కార్యకర్తను మన గెలుపు కోసం పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వాలనీ కోరుకుంటున్నాను అని అఆన్నారు. అందరం కూర్చొని చర్చలు జరిపిపదవులు ఇవ్వమని మందుల సామెలు ను అడిగాను తుంగతుర్తిలో నా పెత్తనం ఏమీ లేదనీ వివరణ ఇచ్చారు.




సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రముఖ సినీ దర్శకుడు తిప్పారెడ్డి భరద్వాజ, చిత్రంలో విమలక్క తదితరులు

# ఆద్య కళల ఏర్పాటుకు జిఒను అమలు చేయాలి

### రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జులై 10, ప్రభాతవార్త:** నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయం గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఆద్యకళల మ్యూజియం ఏర్పాటుకు ప్రభుత్వం జారీ చేసిన జీవోను వెంటనే అమలు చేయాలని పలువురు ప్రముఖులు డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆద్యకళా పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు నిర్వహణలో జరిగింది. ప్రముఖ కవి పసునూరి రవీందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సినీ దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క తదితరులు పాల్గొని ప్రసంగించారు. తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు ఎన్నో యేళ్లు శ్రమించి సుమారు 5,000 అరుదైన ఆదిమ జాతి కళాఖండాలను సేకరించారని కొనియాడారు. ఇలాంటి ఆద్య కళలను కాపాడుకుని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చరిత్రను, సంస్కృతిని కాపాడు కోవాలనే స్పృహ అధికారులకు లేకపోవడం విచారకరమని విమలక్క అన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు, ప్రఫెసర్ గూడూరి మనోజ, ఎస్. జీవన్ కుమార్, భూపతి వెంకటేశ్వర్లు, రచయిత్రి దాసోజు లలిత, మన్నారం నాగరాజు, ప్రొఫెసర్ వినాయక రెడ్డి, కన్నెగంటి రవి సహా పలువురు ప్రముఖులు, సాంస్కృతిక రంగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇంజినీరింగ్ ఫీజుకు గడువు 14 తేదీ

**తొలి విడతలో 91 శాతం సీట్లు కేటాయింపు**

**87 కాలేజీల్లో 100 శాతం సీట్లు**

**ట్యూషన్ ఫీజు మొత్తం ముందుగానే చెల్లించాలి**

**సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన**

**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరంలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సర ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్ సెట్-2026 ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లో భాగంగా శుక్రవారం మొదటి విడత సీట్ల కేటాయింపు చేశారు. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 14లోపుగా కాలేజీకి చెందిన ట్యూషన్ ఫీజును చెల్లించిన తరువాతనే సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన ప్రకటనలో తెలిపారు. గతంలో మాదిరిగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందే విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించకుండానే సెల్ఫ్ రిపోర్టింగ్ చేసేవారు. కానీ ఈ ఏడాది నుంచి అలా కాకుండా సీటు పొందిన విద్యార్థి ఆ కాలేజీకి చెందిన ట్యూషన్ ఫీజును చెల్లిస్తేనే సెల్ఫ్ రిపోర్టింగ్ చేయడానికి అవకాశం ఉంటుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంలో ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలో కోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో హైకోర్టు ఆదేశాల మేరకు విద్యార్థుల నుంచి నేరుగా ఫీజులను వసూలు చేసుకోవడానికి కోర్టు తీర్పు ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎంఎస్ నంబర్ 9 ప్రకారం సదలింపులు ఇవ్వాలని కోరినప్పటికీ విద్యార్థుల నుంచి ముందుగా ఫీజులు వసూలు చేసుకొని .. ఆ తరువాత ప్రభుత్వం నుంచి రీయింబర్స్‌మెంట్ నిధులు వస్తే విద్యార్థి చెల్లించిన ఫీజును తిరిగి విద్యార్థి ఖాతాలోకి చెల్లించాలని కాలేజీలకు కోర్టు సూచించిన నేపథ్యంలో శుక్రవారం ఇంజినీరింగ్ మొదటి విడత సీట్ల కేటాయింపు సందర్భంగా అధికారులు ట్యూషన్ ఫీజులను విద్యార్థి సొంత ఖాతా నుంచి చెల్లించాలని సూచించారు. 88,510 సీట్లకు గాను 79,891 సీట్లను కేటాయించారు. మొత్తం సీట్లలో 90.7 శాతం సీట్లను మొదటి విడతలో కన్వీనర్ కోటాలో కేటాయించినట్లు సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 87 కాలేజీల్లో 100 శాతం సీట్ల కేటాయింపు చేశారు. అందులో 8 యూనివర్సిటీ కాలేజీలు ఉండగా, 79 ప్రైవేటు కాలేజీలున్నాయి. ఎప్ సెట్-2026లో 89,450 మంది ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. వారిలో 88,510 మంది వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. వారిలో 79,891 మందికి మొదటి విడతలో కన్వీనర్ కోటాలో సీట్లను కేటాయించారు. రాష్ట్రంలో 176 ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో 88,053 సీట్లు కన్వీనర్ కోటాలో అందుబాటులో ఉండగా.. అందులో 79,891 సీట్లను కేటాయింపు చేశారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చినప్పటికీ 8619 సీట్లను కేటాయించ లేదు. ఈడబ్ల్యూఎస్ కోటాలో 6335 సీట్లను కేటాయించారు. ఈ నెల 4న చేపట్టిన మాక్ అలాట్‌మెంట్ సీట్లలో 35,402 మంది తమ ఆప్షన్లను మార్చుకున్నారు. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 14 వరకు తమ సొంత ఖాతాల నుంచి ట్యూషన్ ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని ప్రకటనలో పేర్కొన్నారు. ఒకవేళ చెల్లించిన ట్యూషన్ ఫీజు రీఫండ్ అయితే ఏ ఖాతా నుంచి చెల్లించారో అదే ఖాతాలోకి తిరిగి చెల్లిస్తారు కాబట్టి విద్యార్థులు తమ సొంత ఖాతాల నుంచే ట్యూషన్ ఫీజు చెల్లించాలని స్పష్టం చేశారు.
ఒక గవర్నమెంట్ కాలేజీలో 196 సీట్లు ఉంటే 56(28.6శాతం) సీట్లను కేటాయించారు. 21 యూనివర్సిటీ కాలేజీల్లో 6363 సీట్లకుగానూ 5303 సీట్లను(83.3శాతం) కేటాయించారు. 2 ప్రైవేటు యూనివర్సిటీల్లో 1367 సీట్లకుగానూ 1366 సీట్లను(99.9శాతం) కేటాయించగా కేవలం ఒక్క సీటు మాత్రమే ఖాళీగా ఉంది. 152 ప్రైవేటు కాలేజీల్లో 80,127 సీట్లకుగాను 73166 సీట్లను(91.3శాతం) కేటాయించారు.. మరో 6961 సీట్లు ఖాళీగా ఉన్నాయి. మొత్తం కేటాయింపు చేసిన సీట్లలో కంప్యూటర్ సైన్స్‌లో 62,509 సీట్లు ఉండగా అందులో 58,376 సీట్లను కేటాయించారు. 93 శాతం సీట్లను మొదటి విడతలోనే కేటాయించారు. ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ విభాగంలో 17054 సీట్లకుగాను 14,688 సీట్లను(86శాతం) కేటాయించారు. సివిల్, మెకానికల్ ఇతర బ్రాంచ్‌లకు సంబంధించి 7455 సీట్లకుగాను 5968 సీట్లను(80శాతం) కేటాయించారు. ఇతర ఇంజినీరింగ్ బ్రాంచ్‌లకు సంబంధించి 1035 సీట్లకుగాను 859 సీట్లను(83శాతం) కేటాయించారు. మొత్తం కన్వీనర్ కోటాలో 88053 సీట్లకు గాను 79,891 సీట్లను(91శాతం) కేటాయించగా మరో 8162 సీట్లు ఖాళీగా ఉన్నాయి.



## తెలంగాణను అత్యంత ప్రాధాన్య పెట్టుబడి గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**పారిశ్రామిక మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పురోగతిపై సిఎస్ సంజయ్‌జాజు సమీక్ష**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 10:** తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అత్యంత ప్రాధాన్య పెట్టుబడి గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేయాలని పరిశ్రమల శాఖ అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు ఆదేశించారు. రాష్ట్రంలో చేపడుతున్న కీలక పారిశ్రామిక మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పురోగతిపై సిఎస్ శుక్రవారం సచివాలయంలో పరిశ్రమలు, వాణిజ్య శాఖ సీనియర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణంగా పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేయాలని, మరిన్ని పెట్టుబడులను ఆకర్షించడానికి, పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను కల్పించడానికి వీలు కలుగుతుందని అన్నారు. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) ద్వారా భారత్ ఫ్యూచర్ సిటీ, జహీరాబాద్ ఇండస్ట్రియల్ సిటీ, కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్‌తో పాటు ఇతర వ్యూహాత్మక పారిశ్రామిక మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పురోగతిపై ప్రధాన కార్యదర్శి సమీక్ష నిర్వహించారు. టీజీఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ శశాంక ఆయా ప్రాజెక్టుల ప్రస్తుత స్థితి, అభివృద్ధి చేస్తున్న మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల ఆకర్షణ, పూర్తి చేయాల్సిన గడువులపై సిఎస్‌కు వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించే దిశగా అధికారులు స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్లాలని ఆయన ఆదేశించారు. అలాగే రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రాజెక్టుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎదురయ్యే అవరోధాలను ముందుగానే గుర్తించి, శాఖల మధ్య సమన్వయంతో వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భారత్ ఫ్యూచర్ సిటీ, జహీరాబాద్ ఇండస్ట్రియల్ సిటీ, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు తెలంగాణ పారిశ్రామిక రంగాన్ని రూపాంతరం చెందించడంతో పాటు భారీ పెట్టుబడులను ఆకర్షించి, ప్రాంతీయ సమతుల అభివృద్ధికి దోహదపడే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, చేనేత,వస్త్ర శాఖ ప్రత్యేక కార్యదర్శి కాత్యాయని దేవి, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవో ఆజితిరెడ్డి, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కమాండ్ కంట్రోల్‌లో 23 ఎస్‌పిఒ డ్రైవర్ పోస్టుల కోసం

**మాజీ సైనికుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం**

**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త:** బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్‌లో 23 ఎస్‌పిఒ డ్రైవర్ పోస్టుల కోసం పారా మిలటరీ విభాగం మాజీ సైనికుల నుంచి దరఖాస్తులను పోలీసు శాఖ ఆహ్వానించింది. దరఖాస్తు చేసుకునే వారిలో తెలంగాణ వారికి ప్రాధాన్యత వుంటుందని క మాండ్ కంట్రోల్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తు చేసుకునే వారు 58 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారు అయి వుండాలని గతంలో తాము పనిచేసిన పారా మిలటరీ విభాగం తాలూకు సర్టిఫికేట్లు సమర్పిం చాలని ఆయన కోరారు. ఈ నెల 12వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఎంపికైన వారికి నెలకు 26 వేల రూపాయల వేతనం వుంటుందని, ఎలాంటి సెలవు వుండదని ఆయన వెల్ల డిం చారు. దీనికి సంబంధించి ఎలాంటి సమాచారం కావాలంటే ఆర్ఐ గోపాల్ రెడ్డి సెల్ నంబర్ 8712674111లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

## హాజ్ యాత్రికులకు రూ.10వేల రిఫండ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 10:** హాజ్ 2026 యాత్రికులకు సంబంధించి రాష్ట్ర హాజ్ కమిటీ శుక్రవారం కీలక ప్రకటన చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ మేరకు, హాజ్ యాత్రికులకు రూ. 10వేల చొప్పున రీఫండ్ చేసే ప్రక్రియను ప్రారంభించినట్లు హాజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ షా గులాం అఫ్జల్ తెలిపారు. ఈ మొత్తాన్ని నేరుగా యాత్రికుల బ్యాంక్ ఖాతాల్లో ఆన్‌లైన్ కోర్ బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా జమ చేస్తామని ఆయన స్పష్టం చేశారు. విమాన ఇంధన ధరల పెంపు నేపథ్యంలో, హాజ్ కమిటీ ఆఫ్ ఇండియా సర్క్యులర్ ప్రకారం.. ఇంకా చెల్లించని యాత్రికులు రూ. 10వేల చొప్పున నేరుగా హాజ్ కమిటీ ఆఫ్ ఇండియాకు చెల్లించాలని సూచించారు. ఇప్పటికే 2,871 మంది యాత్రికులు సౌదీ అరేబియాకు వెళ్లినందున, మిగిలిన వారు ఈ నిబంధనను పాటించాలని కమిటీ కోరింది. యాత్రికులు ఈ విషయాన్ని గమనించి, తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర హాజ్ కమిటీ విజ్ఞప్తి చేసింది.

## గవర్నర్‌ను కలిసిన ఎంపి ధర్మపురి అరవింద్, ఎస్‌బిఐ సిజిఎం నీలేష్ ద్వివేది

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 10:** నిజామాబాద్ లోక్‌సభ సభ్యులు శ్రీ ధర్మపురి అరవింద్ శుక్రవారం లోక్ భవన్‌లో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై వారు చర్చించారు. అనంతరం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీ నీలేష్ ద్వివేది, ఇతర అధికారులతో కలిసి గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బ్యాంకింగ్ సేవలు, ఆర్థిక రంగానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. తెలంగాణలో విశిష్ట సేవలు అందిస్తున్న నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జీ) 26వ స్పెషల్ కాంపోజిట్ గ్రూప్ (ఎస్‌సీజీ) అధికారులు, సిబ్బందిని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అభినందించారు. శుక్రవారం ఎస్‌సీజీ అధికారులు లోక్ భవన్‌లో గవర్నర్‌ను కలిశారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణలో, అత్యున్నత వృత్తి నైపుణ్యం, అప్రమత్తతతో వారు అందిస్తున్న సేవలను గవర్నర్ ప్రశంసించారు.

## మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ తొలి ప్రొవిజనల్ లిస్ట్ విడుదల

**1,931 పోస్టుల మెరిట్ జాబితా విడుదల**

**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త:** మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఏఎన్ఎం) పోస్టుల తొలి ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ విడుదలైంది. మొత్తం 1,931 మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఫిమేల్) పోస్టుల భర్తీకి సంబంధించిన తొలి ప్రొవిజనల్ మెరిట్ జాబితాను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు శుక్రవారం విడుదల చేసింది. మే 14న అభ్యర్థులు పరీక్షలో పొందిన మార్కులు, కాంట్రాక్ట్/అవుట్‌సోర్సి ంగ్ సేవలకు సంబంధించిన వెయిటేజ్ మార్కులతో కూడిన ప్రొవిజనల్ జాబితాను విడుదల చేసి, మే 18 నుంచి మే 22 వరకు అభ్యంతరాలను స్వీకరించారు. అభ్యంతరాలను పరిశీలించి, పరిష్కరించిన బోర్డు.. శుక్రవారం తొలి ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌ను విడుదల చేసింది. నియామకాల్లో పారదర్శకత కోసం మరోసారి అభ్యంతరాలు స్వీకరించాలని బోర్డు నిర్ణయించింది. ఈ మేరకు ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌పై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 13 నుంచి 15 సాయంత్రం 5 గంటల వరకు ఎంహెచ్ఎస్ఆర్‌బి వెబ్‌సైట్‌లో తమ లాగిన్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని బోర్డు వెల్లడించింది. అభ్యంతరాలు ఒక్కసారి మాత్రమే నమోదు చేసే అవకాశం ఉంటుందని కాబట్టి అభ్యర్థులు జాగ్రత్తగా వ్యవహరించాలని బోర్డు సూచించింది.

# మెడికల్ ఎక్విప్‌మెంట్ కొనుగోళ్లలో పారదర్శకతకు ప్రాధాన్యం

**కొత్త విధానానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి**

**అధికారులను ఆదేశించిన మంత్రి దామోదర రాజనర్సింహ**

**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ హాస్పిటళ్లకు క్వాలిటీ మెడికల్ ఎక్విప్‌మెంట్‌ను వేగంగా, పారదర్శకంగా అందించేందుకు ప్రొక్యూర్‌మెంట్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ టీజీఎంఎస్ఐడీసీ అధికారులను ఆదేశించారు. కోఠిలోని టీజీఎంఎస్ఐడీసీ ఆఫీసులో శుక్రవారం నిర్వహించిన రివ్యూ మీటింగ్‌లో మెడికల్ ఎక్విప్‌మెంట్ ప్రొక్యూర్‌మెంట్, టెండర్ ప్రాసెస్, ఎక్విప్‌మెంట్ వర్కింగ్ స్టేటస్, మెయింటెనెన్స్ తదితర అంశాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో ఏర్పాటు చేసే ప్రతి మెడికల్ ఎక్విప్‌మెంట్ క్వాలిటీదిగా ఉండటంతోపాటు నిర్ణీత సమయంలో అందుబాటులోకి రావాలని మంత్రి స్పష్టం చేశారు. పారదర్శక, డిజిటలైజేషన్‌కు ప్రాధాన్యతను ఇస్తూ నూతన విధానానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో అన్ని కొనుగోళ్లు ఒకే విధమైన ప్రామాణిక విధానాల ప్రకారం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రొక్యూర్‌మెంట్ ప్రక్రియను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని మంత్రి ఆదేశించారు. కొనుగోళ్ల కోసం ఎండ్ టు ఎండ్ డిజిటల్ టూల్‌ను త్వరితగతిన అమల్లోకి తీసుకువచ్చి, ఇండెంట్ నుంచి హాస్పిటల్‌లో ఇన్‌స్టలేషన్ వరకు ప్రతి దశను ఆన్‌లైన్‌లో ట్రాక్ చేసే విధంగా వ్యవస్థను రూపొందించాలని ఆదేశించారు. హాస్పిటళ్లలో ఏర్పాటు చేసిన మెడికల్ ఎక్విప్‌మెంట్ నిరంతరం పనిచేసేలా పటిష్టమైన మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ హాస్పిటళ్లలోని ఎక్విప్‌మెంట్ పనితీరును పర్యవేక్షించేందుకు సెంట్రలైజ్డ్ డ్యాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న కాంప్రహెన్సివ్ యాన్యువల్ మెయింటనన్స్ కాంట్రాక్ట్ (సీఎఎంసీ) అగ్రిమెంట్లను సమీక్షి ంచి, సర్వీస్ లెవల్ అగ్రిమెంట్స్ (ఎస్ఎల్ఏ) పాటించని వెండర్లపై కఠినమైన పెనాల్టీలు విధించేలా నిబంధనలను సవరించాలని మంత్రి సూచించారు. ఎక్విప్‌మెంట్ మెయింటెనెన్స్‌లో నిర్లక్ష్యానికి తావు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ ఎక్విప్‌మెంట్ పనితీరును క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు ఎనిమిది మంది బయోమెడికల్ ఇంజినీర్లను నియమించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.



## గవర్నర్‌ను కలిసిన నూతన సిఎస్ సంజయ్‌జాజు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 10:** తెలంగాణ నూతన ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు శుక్రవారం లోక్ భవన్‌లో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన సంజయ్ జాజుకు గవర్నర్ అభినందనలు తెలిపారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం, సుపరిపాలన లక్ష్యాల సాధనలో సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షి స్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. భేటీ సందర్భంగా రాష్ట్ర పరిపాలనకు సంబంధించిన పలు అంశాలపై వారు చర్చించారు. సమావే శంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం దానకిషోర్ ఉన్నారు.

## తెలంగాణ జనసేన పార్టీలో చేరికలు

**పవన్‌కల్యాణ్ సమక్షంలో వివిధ పార్టీల నేతల చేరిక**

**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త:** తెలంగాణ జనసేన పార్టీలో శుక్రవారం పలు చేరికలు జరిగాయని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం ప్రకటించింది. తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలువురు రాజకీయ, సామాజిక, విద్యా, ఉద్యోగ సంఘాల నాయకులు జనసేన సిద్ధాంతాలకు, పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నాయకత్వానికి ఆకర్షితులై జనసేన పార్టీలో చేరినట్టు వెల్లడించారు. హైదరాబాదులో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ ఉపాధ్యక్షులు బొంగునూరు మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్, తెలంగాణ రాష్ట్ర బాధ్యులు నేమూరి శంకర్ గౌడ్, ప్రచార కార్యదర్శి సాగర్ ఆర్.కె. నాయుడు, నాయకులు రాధారం రాజలింగం, ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, మచ్చా సుధాకర్, గడల శ్రీనివాస్, మిరియాల రామకృష్ణ, ప్రజీత్ గౌడ్, తనీష్ పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో తెలంగాణ విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి. రవీందర్, మీసాల శ్రీనివాస్ రావు - నిజామాబాద్, దేవరకొండ రామ్ మోహన్ రావు - మహేశ్వరంటీ, మైదంశెట్టి రవి వర్మ - శేరిలింగంపల్లి, బి. రవీందర్ గౌడ్ - దేవరకద్ర, బత్తిని సత్యనారాయణ గౌడ్ - కుత్బుల్లాపూర్, ఆరె మహేందర్ - చొప్పదండి, మేడ రామకృష్ణ - మహబూబ్‌నగర్, బండారు రాజ్ కుమార్ - కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి, ఎడ్ల సాయికృష్ణప్రియ - కరీంనగర్‌కి చెందిన ప్రముఖ వైద్యురాలు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... రాజకీయాల్లో మేధావులు, వైద్యులు, యువత ముందుకు రావడం సమాజానికి ఎంతో అవసరమన్నారు. విలువలతో కూడిన, పారదర్శకమైన పాలన కోసం సేవాభావం ఉన్న ప్రతి ఒక్కరూ రాజకీయాల్లో భాగస్వాములు కావాలన్నారు. అలాంటి వ్యక్తులు జనసేనలో చేరడం పార్టీకి బలాన్ని చేకూరుస్తుందన్నారు. పార్టీలో చేరిన వారు తెలంగాణలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

# ఒఆర్ఆర్ ప్రమాదాలకు ఎఐ ఆధారిత టెక్నాలజీ



ఒఆర్ఆర్‌పై జరిగిన ఉన్నత స్థాయి సమన్వయ సమావేశంలో పాల్గొన్న సిపి సజ్జనార్, హెచ్ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జాయింట్ సిపి ట్రాఫిక్ జోయల్ డేవిస్

**ప్రమాదాలను అరికట్టేందుకు 80 క్రిటికల్ స్పాట్ల గుర్తింపు**

**ఉన్నతస్థాయి సమన్వయ సమావేశంలో**

**సిపి సజ్జనార్, హెచ్ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్**

**హైదరాబాద్ జులై 10, ప్రభాతవార్త :** హైదరాబాద్ మహానగరం చుట్టూ ఉన్న ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రజా భద్రతను మెరుగుపరచడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా అధికార యంత్రాంగం చర్యలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా శుక్రవారం హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ అధ్యక్షతన టీజీఐసీసీసీలో కీలక సమన్వయ సమావేశం జరిగింది. ఈ భేటీలో హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్ రోహిత్ గోపిడిలతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గత మే నెలలో ఓఆర్ఆర్ పై జరిగిన సమన్వయ సమావేశంలో చర్చించిన అంశాల పురోగతిపై ఈ సందర్భం గా సమీక్షి ంచారు. ఇందులో భాగంగా రహదారి భద్రతపై తీసుకుం టున్న చర్యలను అధికారులు వివరించారు. ఈ సమావేశంలో సీపీ వీసీ సజ్జనం మాట్లాడుతూ ఓఆర్ఆర్‌పై రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు 80 క్రిటికల్ స్పాట్స్‌ను గుర్తించినట్లు, వీటిలో ఇప్పటికే కొన్ని చోట్ల ఎన్‌ఫోర్స్ మెంట్ పటిష్టం చేసినట్లు వివరించారు. ఓఆర్ఆర్ పై ప్రమాదాల నివారణకు ఏఐ ఆధారిత ఎలక్ట్రానిక్ ఎన్ఫోర్స్మెంట్ సిస్టమ్‌ను అమల్లోకి తీసుకువచ్చే అవకాశాన్ని పరిశీలించాలని నిర్ణయిం చినట్లు వెల్లడించారు. ఈ అత్యాధునిక సాంకేతికత ద్వారా వివిధ రకాల ట్రాఫిక్ ఉల్లంఘనలను సులభంగా గుర్తించి చర్యలు తీసుకోవచ్చని, దీనివల్ల పదే పదే నిబంధనలను ఉల్లంఘించే ధోరణికి అడ్డుకట్ట వేయవచ్చని అభిప్రాయపడ్డారు. ఓఆర్ఆర్ పై నమోదవుతున్న ఉల్లంఘనల్లో దాదాపు 99 శాతం వాహనాలు రీపీటెడ్ వైలేషన్స్‌కు పాల్పడు తున్నాయని, అలాంటి వాహనదారుల్లో మార్పు తీసుకువచ్చేందుకు విస్తృత అవగాహన కార్యక్రమాలను నిర్వహిం చాల్సి న అవసరం ఉందని సూచించారు. ఓఆర్ఆర్‌పై వాహనాలు మొరాయించడం (బ్రేక్ డౌన్) వంటి ఘటనలు ప్రమాదాలకు దారితీస్తున్నాయని, ఇలాంటి వాహనాలను వీలైనంత త్వరగా అక్కడి నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, అలాగే రోడ్డుపై ఎక్కడా వాహనాలు నిలపకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఒకవేళ వాహనాలు ఆగిపోతే, తక్షణమే 14449 నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.
హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ మాట్లాడుతూ, ఓఆర్ఆర్ పై ప్రయాణికుల రక్షణే పరమావధిగా హెచ్ఎండీఏ తరఫున అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. ఓఆర్ఆర్ ప్రయాణాన్ని మరింత సురక్షితంగా మార్చేందుకు అన్ని విభాగాల సమన్వయంతో పనిచేస్తూ.. తమ వంతు పూర్తి సహకారాన్ని అందిస్తామని చెప్పారు.

# వర్షాభావంతో విద్యుత్ డిమాండ్ పెరిగే ఛాన్స్

**సమర్థవంతంగా బొగ్గు, నీటి నిర్వహణ**

**కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ**

**రాష్ట్రాలకు త్వరలో మార్గదర్శకాలు**

**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా సూపర్ ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో రాబోయే మూడు నెలల పాటు గరిష్ట డిమాండ్ అధికంగానే ఉంటుందని కేంద్రం అంచనా వేసింది. వర్షాభావ పరిస్థితుల నడుమ ఖరీఫ్ సాగుతో పాటు, పారిశ్రామిక, గృహ అవసరాలకు విద్యుత్‌కు డిమాండ్ భారీగా పెరిగే ఛాన్స్ ఉందని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ అంచనా వేసింది. మే, జూన్ నెలల్లో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగింది. మే నెలలో గరిష్ట డిమాండ్ అంచనా వేసిన 271 గిగావాట్లకు చేరగా, జూన్ చివరి రెండు వారాల్లో ఇది 250 గిగావాట్లను దాటింది. సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుందనే అంచనాల మధ్య, రాబోయే మూడు నెలల్లో గరిష్ట డిమాండ్ 247 నుండి 278 గిగావాట్లు ఉంటుందని కేంద్ర ప్రభుత్వం అంచనా వేసిందని ఒక ప్రభుత్వ అధికారి తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రాల్లోని థర్మల్ తదితర విద్యుత్ కేంద్రాలు పూర్తి స్థాయిలో ఉత్పత్తి చేసేలా మార్గదర్శకాల రూపకల్పన చేస్తోంది. ఇందుకు అనుగుణంగా బొగ్గు నిల్వలుతో పాటు, నీరు తదితర వాటిని సమర్థవంతగా నిర్వహించాలని, తద్వారా విద్యుత్ ఉత్పత్తి పూర్తి స్థాయిలో చేయవచ్చని భావిస్తోంది. వీటికి సంబంధించి రెండు మూడు రోజుల్లో రాష్ట్రాలకు కేంద్రం మార్గదర్శకాలను విడుదల చేయనున్నట్లు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ సెక్రటరీ ఒకరు వెల్లడించారు. తగినంత బొగ్గు మరియు నీటి సరఫరాలను నిర్వహించాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు ఆదేశాలు జారీ చేసేందుకు సిద్ధమవుతోంది. విద్యుత్ అంతరాయాలను తగ్గించడానికి నిర్వహణ కూడా పూర్తి చేయ బడుతుంది. అస్తవ్యస్త వాతావరణ పరిస్థితులు, విద్యుత్ డిమాండ్ మరియు ఉత్పత్తిపై వాటి ప్రభావం నేపథ్యంలో సన్నద్ధతను బలోపేతం చేసుకోవాలని విద్యుత్ సంస్థలు, రాష్ట్రాలను కోరుతూ విద్యుత్ మంత్రిత్వ శాఖ ఒక ప్రణాళికను జారీ చేయడానికి సిద్ధమవుతోందని ఈ పరిణామంపై అవగాహన ఉన్న వ్యక్తులు తెలి పారు. రాష్ట్రాలు తగినంత బొగ్గు నిల్వలను నిర్వ హించుకోవాలని, థర్మల్ విద్యుత్ ప్లాంట్లకు సరి పడా నీటి సరఫరాను నిర్ధారించుకోవాలన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న సిఎండి జితేష్ విపాటిల్, డైరెక్టర్లు శివాజీ,నర్సింహులు, చక్రపాణి తదితరులు

## విద్యుత్ బిల్లుల వసూళ్లు మరింత మెరుగుపరచాలి

**టిజిఎస్పీడిసిఎల్ సిఎండి జితేష్ వి.పాటిల్**

**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త:** వినియోగదారులకు వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించడంతో పాటు పెండింగ్ పనుల పరిష్కారం, ఆదాయ వసూళ్ల పెంపు, భద్రతా ప్రమాణాల అమలు, వర్షాకాల సన్నద్ధత నెట్‌వర్క్ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండీ జితేష్ విపాటిల్ ఆదేశించారు. ఆదేశించారు. ఈమేరకు శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అన్ని సర్కిళ్ల అధికారులతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. విద్యుత్ బిల్లుల బకాయిల వసూళ్లను వేగవంతం చేయాలని, ప్రతి నెల 15వ తేదీలోగా డి లిస్ట్ బకాయిలపై వంద శాతం చర్యలు పూర్తి చేయాలని సూచించారు. విద్యుత్ బిల్లుల్లో చూపిస్తున్న బకాయిలపై వినియోగదారులకు అవగాహన కల్పించి వసూళ్లను మరింత మెరుగుపరచాలని ఆదేశించారు. హెచ్‌టీఏసీడీ, ఎల్‌టీఏసీడీ డిపాజిట్ల వసూళ్లు, ప్రభుత్వ సేవలకు సంబంధించిన అసాధారణ బిల్లింగ్ అంశాల సవరణలను ప్రాధాన్యతతో చేపట్టాలని సూచించారు.
హెచ్‌టీ కోర్టు కేసుల వివరాలను సర్కిల్ వారీగా సమగ్ర నివేదికల రూపంలో కార్పొరేట్ కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. ప్రాజెక్టులు, ఐటీ విభాగానికి సంబంధించి ప్రతి సర్కిల్‌లో కనీసం ఒక సబ్‌స్టేషన్‌ను మిడ్జిల్ మోడల్ సబ్‌స్టేషన్"గా అభివృద్ధి చేయాలని సూచించారు. ఆపరేషన్స్ ఎనర్జీ ఆడిట్ అంశాలపై మాట్లాడుతూ, నిర్వహణ.మరమ్మతులబడ్జెట్‌ను పూర్తిస్థాయిలో వినియోగించి డీటీఆర్ ప్లింత్‌ల ఎత్తు పెంపు, వదులుగా ఉన్న లైన్ల సవరణ వంటి భద్రతా చర్యలను చేపట్టాలని సూచించారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, లైన్లు ఇతర మౌలిక సదుపాయాలను వెంటనే గుర్తించి మరమ్మతులు చేపట్టాలన్నారు.
ఫీల్డ్ సిబ్బంది విధులు నిర్వహించే సమయంలో వ్యక్తిగత భద్రతా పరికరాలు తప్పనిసరిగా వినియోగించేలా అధికారులు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. టీజీఎస్పీడీసీఎల్‌ను "జీరో డెత్ ఆర్గనైజేషన్"గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఉద్యోగి భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు.

# కండూ ఎఐ ఇండియా చిప్ డిజైన్ హెడ్‌క్వార్టర్స్‌ను ప్రారంభించిన కెటిఆర్




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై10:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) శుక్రవారం హైదరాబాద్‌లో ప్రముఖ సెమీకండక్టర్ సంస్థ కండూ ఏఐ ఏర్పాటు చేసిన ఇండియా చిప్ డిజైన్ హెడ్‌క్వార్టర్స్‌ను ప్రారంభించారు. కొండాపూర్‌లోని క్రిషే ఎమరాల్డ్ భవనంలో ఏర్పాటు చేసిన ఈ నూతన కేంద్రం అడ్వాన్స్‌డ్ సెమీకండక్టర్ డిజైన్, హైస్పీడ్ కనెక్టివిటీ, నెక్స్ట్ జనరేషన్ ఏఐ సిస్టమ్ డెవలప్‌మెంట్‌కు కీలక ఇంజనీరింగ్ హబ్‌గా సేవలందించనుంది. ఈ కార్యక్రమంలో కండూ ఏఐ సీఈఓ, కోఫౌండర్ సృజన్ లింగతో పాటు సంస్థ ప్రతినిధులు, పరిశ్రమల ప్రముఖులు, ఉద్యోగులు, భాగస్వాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, హైదరాబాద్ ప్రపంచ స్థాయి సెమీకండక్టర్, డీప్‌టెక్, ఏఐ రంగాలకు విశ్వసనీయ గమ్యస్థానంగా ఎదగడం తెలంగాణ ప్రభుత్వం అనుసరించిన దూరదృష్టి విధానాల ఫలితమని అన్నారు. ప్రతిభ, పరిశ్రమలకు అనుకూల వాతావరణం, అత్యుత్తమ మౌలిక సదుపాయాల కారణంగానే ప్రపంచ దిగ్గజ సంస్థలు హైదరాబాద్‌ను తమ విస్తరణకు ఎంచుకుంటున్నాయని పేర్కొన్నారు. కండూ ఏఐ తన ఇండియా చిప్ డిజైన్ హెడ్‌క్వార్టర్స్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడం నగర ప్రతిష్ఠను మరింత పెంచుతుందని కేటీఆర్ అన్నారు. ఈ సంస్థ ద్వారా అత్యాధునిక సాంకేతిక ఆవిష్కరణలు, ఉన్నత స్థాయి ఉపాధి అవకాశాలు, సెమీకండక్టర్ పరిశ్రమలో మరిన్ని పెట్టుబడులు తెలంగాణకు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కండూ ఏఐ యాజమాన్యానికి, ఉద్యోగులకు ఆయన అభినందనలు తెలిపారు. కండూ ఏఐ సీఈఓ, కోఫౌండర్ సృజన్ లింగ మాట్లాడుతూ, ప్రపంచ స్థాయి సెమీకండక్టర్ ఇంజనీరింగ్ ప్రతిభకు హైదరాబాద్ అత్యుత్తమ కేంద్రంగా నిలిచిందని పేర్కొన్నారు. సంస్థ దీర్ఘకాలిక వ్యూహంలో భాగంగానే ఇండియా చిప్ డిజైన్ హెడ్‌క్వార్టర్స్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో స్థానిక ప్రతిభను మరింత ప్రోత్సహిస్తూ విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు, ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని తెలిపారు. కాగా, ఈ కేంద్రంలో చిప్ డిజైన్, వెరిఫికేషన్, వాలిడేషన్, ఫర్మ్‌వేర్, సాఫ్ట్‌వేర్, సిస్టమ్స్ ఇంజనీరింగ్, కస్టమర్ సపోర్ట్ వంటి కీలక విభాగాలు పనిచేయనున్నాయి. దీంతో కండూ ఏఐ గ్లోబల్ ఇంజనీరింగ్ నెట్‌వర్క్ మరింత బలోపేతం కావడంతో పాటు, హైదరాబాద్ అంతర్జాతీయ సెమీకండక్టర్ హబ్‌గా తన స్థానాన్ని మరింత బలపరుచుకోనుంది.



# గిన్నిస్ రికార్డుల్లోకి కర్ణాటక పనస

## 72 కిలోల బరువు ఉన్నట్లు నిర్ధారణ

**బెంగళూరు,జులై 10:** కర్ణాటకలో ప్రదర్శించిన ఒక పనసపండు ఏకంగా 72 కిలోల బరువుతో గిన్నిస్ రికార్డుల్లోకి వెళుతోంది. గిన్నిస్ బుక్ వివరాల ప్రకారం 2024లో అమెరికాలోని ఫ్లోరిడాలో ఓ రైతు పండించిన 54.43 కిలోల పనసే ప్రపంచంలోనే అత్యంత బరువైనది. దీంతో రైతు ప్రతాప్ ఈ పండును ప్రపంచ రికార్డు కోసం పంపే ప్రయత్నాలు చేస్తున్నారు. హాసన్ జిల్లా సకలేశ్‌పుర్ పట్టణంలోని శ్రీనివాస కన్వెన్షన్ హాల్‌లో ఇటీవల పనస, మామిడి పండ్ల ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో హెబ్బనహళ్లి గ్రామానికి చెందిన రైతు హెచ్.బి.ప్రతాప్ కుమార్ తన తోటలో పండిన మూడు భారీ పనసపండ్లను ప్రదర్శనకు తీసుకొచ్చారు. వాటిలో 72 కిలోల బరువున్న పనసపండు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. సాధారణంగా పనస పండును ఒక వ్యక్తి చేత్తో ఎత్తగలడు. కానీ ఈ భారీ పండును మాత్రం ఒకరు ఎత్తడం సాధ్యం కాలేదు. దాంతో ఇద్దరు కలిసి దానిని ఎత్తి బరువు చూడాల్సి వచ్చింది. దాని పరిమాణం, బరువు చూసిన వారంతా సెల్ఫీలు తీసుకుంటూ ఆసక్తిగా వీక్షించారు. ప్రస్తుతం గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రకారం ప్రపంచంలోనే అత్యంత బరువైన పనసపండు అమెరికాలోని ఫ్లోరిడాలో 2024లో నమోదైంది. ఆ పండు బరువు 54.43 కిలోలు. అయితే హాసన్ జిల్లాలో ప్రదర్శించిన పనసపండు 72 కిలోలు ఉండటంతో, అది ప్రస్తుతరికార్డును దాదాపు 18 కిలోల తేడాతో అధిగమించే అవకాశం కనిపిస్తోంది. సకలేశ్‌పుర్ తాలూకా ఉద్యానవన శాఖ సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ బి.ఇ. భానుప్రకాశ్ మాట్లాడుతూ, తమకు తెలిసినంత వరకు ఉద్యానవన శాఖ వద్ద ఇంత భారీ బరువున్న పనస రకం లేదన్నారు. ఈ పనస ప్రపంచంలోనే అత్యంత బరువైనదా అనే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. అవసరమైన ధ్రువీకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌కు పంపే ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. అన్ని ప్రమాణాలు సరిపోతే హెబ్బనహళ్లి గ్రామం పేరు ప్రపంచ రికార్డుల పుస్తకంలో నిలిచే అవకాశం ఉందన్నారు. ఈ యేడాది ప్రదర్శనలో ఉంచిన పనసపండు బరువు 72 కిలోలు కాగా, గత ఏడాది తమ తోటలో ఏకంగా 80 కిలోల బరువున్న పనసపండు కాసిందని ప్రతాప్ తెలిపారు. దానిని రికార్డుల కోసం నమోదు చేయలేకపోయామని చెప్పారు. ఈ భారీ పనస పండ్లను పెంచడానికి ఎలాంటి రసాయన ఎరువులు ఉపయోగించలేదని ఆయన వెల్లడించారు. పూర్తిగా సహజ పద్ధతుల్లోనే సాగు చేస్తున్నట్లు చెప్పారు. మల్నాడు ప్రాంతంలో ఈ రకాన్ని మక్కె పనస అని పిలుస్తారని తెలిపారు.

## ఆల్కహాల్ ఆధారిత దగ్గు సిరప్‌లకు డాక్టర్ల చీటీ తప్పనిసరి

**న్యూఢిల్లీ,జులై 10:** దేశంలో ఆల్కహాల్ ఆధారిత ఔషధాల నియంత్రణను మరింత పటిష్టం చేసేందుకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ నిబంధనలను మరింత కఠినతరం చేసింది. 12 శాతంకంటే ఎక్కువ ఇథైల్ ఆల్కహాల్ కలిగిన ఔషధాలను లైసెన్స్ లేకుండా విక్రయించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే ఈ మందులను విక్రయించాలని పేర్కొంది. ఈ మేరకు డ్రగ్స్ రూల్స్, 2026ను ప్రభుత్వం నోటిఫై చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం 12 శాతం కంటే ఎక్కువ ఇథైల్ ఆల్కహాల్ కలిగి 30 మిల్లీలీటర్ల కంటే పెద్ద సీసాల్లో విక్రయించే సిరప్‌లు/టానిక్‌లను షెడ్యూల్ బీ1 పరిధిలోకి తీసుకొచ్చినట్లు పేర్కొంది. కొన్నిరకాల దగ్గు సిరప్‌లు, టానిక్‌లలో ఔషధాల స్థిరత్వం కోసం, క్రియాశీల పదార్థాలను కరిగించడం కోసం ఇథైల్ ఆల్కహాల్‌ను ఎక్కువశాతం ఉపయోగిస్తారు. అయితే ఈ ఔషధాలు సులభంగా లభిస్తుండటంతో వీటిని చికిత్స కోసం కాకుండా మత్తు కోసం దుర్వినియోగం చేస్తున్నారు. ఈ విషయంలో పలు రాష్ట్రాల నుంచి ఆందోళనలు వ్యక్తం అయ్యాయి. ఈ నేపథ్యంలో డ్రగ్స్ కన్సల్టేటివ్ కమిటీ, డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డుల సిఫార్సుల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం వల్ల అవసరమైన రోగులకు ఈ ఔషధాలు ఎప్పటిలాగే అందుబాటులో ఉంటాయి. కానీ రిజిస్టర్డ్ డాక్టర్ ఇచ్చిన చెల్లుబాటు అయ్యే ప్రిస్క్రిప్షన్ ఉంటేనే ఈమందులు విక్రయించనున్నారు. వీటి విక్రయానికు సంబంధించిన వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. నియంత్రణ అధికారుల తనిఖీల కోసం ఆ ప్రిస్క్రిప్షన్లు, విక్రయ రికార్డులను కనీసం మూడేళ్ల పాటు భద్రపరచాల్సి ఉంటుంది.

# హత్యచేసినా.. బంగ్లాకు వెళ్తా

## అక్కడే మరణిస్తా: షేక్ హసీనా



**న్యూఢిల్లీ,జులై 10:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, అవామీ లీగ్ అధినేత్రి షేక్ హసీనా కీలక ప్రకటన చేశారు. స్వదేశంలో మరణశిక్షను ఎదుర్కొంటున్న ప్పటికీ, ఈ యేడాది డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లి న్యాయస్థానం ముందు లొంగిపోవాలని నిర్ణయించుకున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్న 78 యేళ్ల హసీనా, ఒక మీడియా సంస్థకు టెలిఫోన్ ద్వారా ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఈ విషయాలను స్పష్టం చేశారు. తనతో పాటు పార్టీకి చెందిన ఇతర సీనియర్ నాయకులు కూడా స్వదేశానికి తిరిగి వస్తారని ఆమె పేర్కొన్నారు. వారు నన్ను అరెస్టు చేయవచ్చు లేదా హతమార్చవచ్చు. ఏదేమైనా నేను వెళ్లాల్సిందే. ఒకవేళ మరణం సంభవిస్తే, అది నా తల్లిదండ్రులు విశ్రమిస్తున్న నా మాతృభూమిపైనే జరగాలి అని హసీనా భావోద్వేగానికి లోనయ్యారు. మరణశిక్షను ఎదుర్కొంటున్న మరో సీనియర్ నాయకుడు, మాజీ హోం మంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమల్ కూడా ఆమెతో పాటు బంగ్లాదేశ్‌కు వెళ్లే వారిలో ఉన్నారు. 2024లో విద్యార్థులు, సామాన్య ప్రజలు చేపట్టిన భారీ నిరసనల కారణంగా షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన సంగతి విదితమే. సుమారు రెండు దశాబ్దాల పాటు ప్రధానిగా బాధ్యతలు నిర్వర్తించిన ఆమె, 2024 ఆగస్టులో ప్రాణరక్షణ కోసం భారత్‌కు చేరుకుని రాజకీయ ఆశ్రయం పొందారు. నిరసనల అణిచివేతలో చోటుచేసుకున్న హింసాకాండ, మానవత్వానికి వ్యతిరేకంగా జరిగిన నేరాల ఆరోపణల నేపథ్యంలో బంగ్లాదేశ్‌లోని ప్రత్యేక ట్రైబ్యునల్ 2025 నవంబర్‌లో ఆమెకు మరణశిక్ష విధించింది. ఆమె పార్టీ అయిన అవామీ లీగ్‌పై కూడా నిషేధం విధించారు. అయితే, తనపై నమోదైన కేసులన్నీ రాజకీయ ప్రేరేపితమైనవని హసీనా కొట్టిపారేశారు.

# హైదరాబాద్- బెంగళూరు మధ్య అదనపు సర్వీసులు: ఆర్‌టిసి నిర్ణయం

**హైదరాబాద్, ప్రభాతవార్త, జులై 10:** హైదరాబాద్- బెంగళూరు మధ్య ప్రయాణించే ఐటీ ఉద్యోగులు, వ్యాపారులు, సాధారణ ప్రయాణీకులకు మరింత చేరువయ్యేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్‌ఆర్‌టిసి) చర్యలు ప్రారంభించింది. ఆర్‌టిసి ప్రవేశపెట్టిన వినూత్న ఆఫర్‌కి ప్రయాణీకుల నుంచి విశేష స్పందన లభించడంతో హైదరాబాద్, బెంగళూర్ రూట్లలో ఆర్‌టిసి బస్సు సర్వీసు స్టాపింగ్‌ల సంఖ్యను పెంచడంతోపాటు, బెంగళూరు వెళ్లే ప్రయాణీకులకు నగరంలో ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని కల్పించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని సంస్థ ప్రకటించింది. బెంగళూరుకు ఆర్‌టిసి బస్సు టికెట్ బుక్ చేసుకున్న ప్రయాణీకులు, హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాల నుండి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ రూట్లో నడిచే పుష్పక్ ఈ-సిటీ ఎసి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. బెంగళూరు ప్రయాణ టికెట్ చూపించి ఈ ఉచిత సౌకర్యాన్ని పొందవచ్చని సంస్థ తెలిపింది.

ఆర్‌టిసి యాజమాన్యం తీసుకున్న ఈ సరికొత్త నిర్ణయం వల్ల ప్రయాణీకులకు ఆర్థిక భారం తగ్గడమే కాకుండా,ప్రయాణం మరింత సులువైందని, దీని ఫలితంగా ప్రతిరోజూ అదనంగా 60 నుండి 70 టికెట్లు బుక్ అవుతున్నట్టు సంస్థ వెల్లడించింది. ప్రయాణీకుల రద్దీతోపాటు డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్-బెంగళూర్ మధ్య బస్ స్టాపింగ్‌లను సంస్థ భారీగా పెంచింది. రద్దీకి అనుగుణంగా అదనపు సర్వీసులను నడపాలని ఆర్‌టిసి ఎండీ నాగిరెడ్డి అధికారులను ఆదేశించారు. "ప్రయాణీకుల సౌకర్యార్థం, వారి సురక్షిత ప్రయాణమే ధ్యేయంగా టిజిఎస్‌ఆర్‌టీసీ నిరంతరం కొత్త ఆలోచనలతో ముందుకు సాగుతోందని ఆర్‌టిసి ఎండీ వై నాగిరెడ్డి తెలిపారు. బెంగళూరు ప్రయాణీకుల కోసం ప్రవేశపెట్టిన ఉచిత పుష్పక్ ఎసి కనెక్టివిటీకి వస్తున్న ఆదరణ చాలా సంతోషాన్నిస్తోందని, ఈ సదుపాయాన్ని ప్రయాణీకులందరూ మరింతగా సద్వినియోగం చేసుకోవాలని నాగిరెడ్డి కోరారు.

# క్రికెట్‌తో విడదీయరాని బంధం

## మెల్‌బోర్న్ గ్రౌండ్‌లో క్రికెటర్లతో ప్రధాని మోడీ భేటీ



**మెల్‌బోర్న్,జులై 10:** ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా భారతప్రధాని నరేంద్రమోడీ మెల్‌బోర్న్ లోని ప్రముఖ మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌ను సందర్శించి యువ క్రికెటర్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన భారత్-ఆస్ట్రేలియా మధ్య క్రీడా సంబంధాలను మరింత బలోపేతం చేసే ఇండియా-ఆస్ట్రేలియా స్పోర్ట్స్ కొలాబరేషన్ రోడ్‌మ్యాప్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఎంసిజిలో ప్రసంగించిన ప్రధాని మోడీ మాట్లాడుతూ, ప్రతి భారతీయుడికి ఈ స్టేడియంలో అడుగుపెట్టడం రెండు భావోద్వేగాలను కలిగిస్తుందని అన్నారు. ఒకటి భారత్‌ఆస్ట్రేలియా క్రికెట్ మ్యాచ్ ఉత్సాహం కాగా, మరొకటి రెండు దేశాల్లోనూ క్రికెట్ కేవలం ఆట మాత్రమే కాకుండా ప్రజల అభిమానం, భావోద్వేగంగా మారిందనే విషయాన్ని గుర్తు చేస్తుందని చెప్పారు. అయితే ఈ రోజు చివరి ఓవర్ ఉత్కంఠ లేదని, ఆటపై ఆనందం, రెండు దేశాలస్నేహం, భవిష్యత్‌ఛాంపియన్ల ఉత్సాహం మాత్రమే కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథనీ అల్బనీస్ సమక్షంలో ఇండియా-ఆస్ట్రేలియా స్పోర్ట్స్ కొలాబరేషన్ రోడ్ మ్యాప్‌ను ప్రారంభించిన ప్రధాని మోడీ, ఈ కార్యక్రమం ద్వారా కేవలం క్రికెట్‌కే పరిమితం కాకుండా ఇతర క్రీడల్లో కూడా ఇరు దేశాలు కలిసి పనిచేస్తాయని తెలిపారు.

ఈ సహకారంలో భాగంగా క్రీడా శిక్షణ, స్పోర్ట్స్ సైన్స్, ఆధునిక క్రీడా సాంకేతికత, ప్రతిభ అభివృద్ధి, క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి వంటి రంగాల్లో పరస్పర సహకారం పెంచనున్నట్లు వెల్లడించారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథనీ అల్బనీస్‌తో తన ప్రతి భేటీలోనూ క్రికెట్ సహజంగానే చర్చకు వస్తుందని ప్రధాని మోడీ పేర్కొన్నారు.

అహ్మదాబాద్‌లోని స్టేడియాన్ని ఇద్దరూ కలిసి సందర్శించిన విషయాన్ని గుర్తు చేశారు. మెల్‌బోర్న్‌లో కూడా మాజీ క్రికెట్ దిగ్గజాలు స్టీవ్ వా, లిసా స్టాలేకర్ సమక్షంలో ఉండటం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ, ఆ దేశ ప్రతిపక్ష నాయకుడు అంగస్ టేలర్‌ను కూడా కలిశారు. ఈ సందర్భంగా భారత్-ఆస్ట్రేలియా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలో పేతం చేసే అంశాలపై చర్చించారు. భారత్‌తో సంబంధాలను మరింత విస్తరించేందుకు ఆస్ట్రేలియాలోని ప్రధాన రాజకీయ పార్టీల నుంచి కూడా విస్తృత మద్దతు ఉందని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.

# నాటో సదస్సులో ప్రపంచ నేతలకు ఎర్డోగన్ వినూత్న కానుక



## నేతల పేర్లు చెక్కిన రివాల్వర్లు బహూకరణ

**అంకారా,జులై 10:** నాటో సదస్సు ముగిసిన అనంతరం టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్ ప్రపంచ దేశాల నేతలకు ఊహించని విధంగా ప్రత్యేక కానుక అందించారు. ప్రతి నాయకుడికి వారి పేర్లు చెక్కిన పురాతన నమూనా రివాల్వర్‌ను చెక్క పెట్టెలో బహూకరించారు. ఆయుధంతో పాటు కొన్ని బుల్లెట్లు కూడా అందించడంతో ఈకానుక అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. టర్కీ రక్షణ పరిశ్రమ సామర్థ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఎర్డోగన్ ఈబహుమతిని ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఈ రివాల్వర్ 1990లలో టర్కీ ప్రభుత్వ ఆయుధ తయారీ సంస్థ ఎంకెఇ తయారుచేసిన అరుదైన "గుముసాయ్ 357 మాగ్నమ్" మోడల్‌గా గుర్తించారు. ప్రతి రివాల్వర్‌ను ప్రత్యేకంగా తయారు చేసిన చెక్క పెట్టెలో ఉంచారు. పెట్టెపై టర్కీ జాతీయ పతాకంతోపాటు నాటో లోగోను ముద్రించారు. మా దేశంలో తయారైన తొలి రివాల్వర్‌తరహా తుపాకి అనే శాసనాన్ని టర్కిష్, ఆంగ్లభాషల్లో పొందుపరిచారు. ఆయుధంతో పాటు బుల్లెట్లు, ఎగుమతి నిబంధనల నుంచి మినహాయింపు ఉన్నట్లు తెలిపే పత్రాన్ని కూడా అందించారు. అనేక దేశాల్లో ఆయుధాల రవాణాపై కఠిన నిబంధనలు ఉండటంతో రివాల్వర్లను వెంటనే తరలించడం సాధ్యపడలేదు. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, జర్మనీ చాన్స్‌లర్ ఫ్రెడ్రిక్ మెర్జ్, నెదర్లాండ్స్ ప్రధాని రాబ్ జెట్టెన్‌లకు అందించిన రివాల్వర్లు ప్రస్తుతం అంకారాలోనే భద్రపరిచినట్లు సమాచారం. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ మాట్లాడుతూ, తమ పేర్లు చెక్కిన రివాల్వర్, శుభ్రపరిచే కిట్‌తోపాటు బుల్లెట్లుకూడా అందించారని తెలిపారు. స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ ప్రతినిధి మాట్లాడుతూ, అన్ని దేశాధినేతలకు ఒకే తరహా రివాల్వర్‌ను వారి పేర్లతో అందించినట్లు వెల్లడించారు. స్లోవాకియా అధ్యక్షుడు పీటర్ పెల్లెగ్రిని తనకు అందిన రివాల్వర్‌ను విమాన ప్రయాణంలోనే మీడియాకు చూపించారు. ఈ బహుమతి కారణంగా వివిధ దేశాల భద్రతా బృందాలు, కస్టమ్స్ అధికారులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సి వచ్చింది. బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ తన రివాల్వర్‌ను బ్రస్సెల్స్ విమానాశ్రయ పోలీసులకు అప్పగించారు. పోలాండ్ అధ్యక్షుడు కరోల్ నవ్రోకీకి అందిన రివాల్వర్ వార్సా విమానాశ్రయంలో కస్టమ్స్ అనుమతులకోసం నిల్వలో ఉంది.

నెదర్లాండ్స్, స్వీడన్ ప్రధానుల కార్యాలయాలు తమ రివాల్వర్లను అంకారా లోని రాయబార కార్యాలయాలకు తరలించినట్లు వెల్లడించాయి. నెదర్లాండ్స్‌కు చెందిన రివాల్వర్‌ను పనిచేయకుండా మార్చనున్నట్లు, స్వీడన్‌కు చెందినది దిగుమతి అనుమతుల కోసం వేచిఉన్నట్లు తెలిపాయి. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీకి అందిన రివాల్వర్‌ను రోమ్‌లోని ప్రభుత్వ భవనం పలాజ్జో చిగిలో ఇతరఅధికారిక బహుమతులతో పాటు భద్రపరిచారు. యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డర్ లేయెన్ తనకు అందిన రివాల్వర్‌ను సైనిక మ్యూజియంకు విరాళంగా ఇవ్వాలని నిర్ణయించగా, గ్రీస్ నాయకుడు దానిని ఏథెన్స్ యుద్ధ మ్యూజియంకు అందజేయనున్నట్లు ప్రకటించారు. కెనడా ప్రధాని మార్క్ కార్నీ సరదాగా స్పందిస్తూ, నేను ఇచ్చిన మేపుల్ సిరప్‌తో పోలిస్తే టర్కీ కానుక చాలా భిన్నంగా ఉందన్నారు.

# ఆర్టీఐ నిబంధనల అమలులో నిర్లక్ష్యం సహించం

## ఉల్లంఘనలకు పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తప్పవు

### ఎపి రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ సజ్జా శ్రీనివాసరావు

**విజయవాడ,జులై 10, ప్రభాతవార్తప్రతినిధి:** సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) లోని సెక్షన్ 4(1) (బి) నిబంధనలను ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో తప్పని సరిగా అమలుచేయాలని, చట్టం అమలులో ఎలాంటి నిర్లక్ష్యాన్నీ సహించబోమని రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ సజ్జా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఆర్టీఐ చట్టం అమలుపై శుక్రవారం విజయవాడ రూరల్‌లోని గొల్లపూడిలో ఉన్న పలు ప్రభుత్వ కార్యాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ కార్యాలయం, గొల్లపూడి గ్రామపంచాయతీ కార్యాలయంతోపాటు డైరెక్టరేట్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ కార్యాలయం, బందరు రోడ్డులోని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) కార్యాలయాలను సందర్శించి, ఆర్టీఐ చట్టం అమలు తీరును పరిశిలించి, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఆయా కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ఆర్టీఐ రిజిస్టర్లు, రికార్డులు, పౌరులకు అందిస్తున్న సమాచార వ్యవస్థను పరిశీలించి అధికారులకు తగినసూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రధాన సమాచార కమిషనర్ మాట్లాడుతూ.. ఆర్టీఐ చట్టం ప్రభుత్వ ఆఫీసుల్లో ఏవిధంగా అమలు అవుతుందో పరిశీలనలో భాగంగా తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. గత కొంతకాలంగా రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఆర్టీఐ నిబంధనలు సక్రమంగా అమలు కావడం లేదంటూ కమిషన్‌కు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లు మొదటి అప్పిలేట్ అథా రిటీల వివరాలతో కూడిన నేమ్ బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, జాబ్ చార్టులు, సిటిజన్ చార్టర్లను ప్రదర్శించకపోవడం వంటి లోపాలను రాష్ట్ర వ్యాప్తంగా గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ పరిస్థితులను సరిదిద్దేందుకు రాష్ట్ర సమాచార కమిషన్ ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని తెలిపారు. ఇందులో భాగంగా సమాచార కమిషనర్లు ఒక్కొక్కరికి రెండుజిల్లాల చొప్పున బాధ్యతలు అప్పగించి, ప్రభుత్వ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించేలా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఆర్టీఐచట్టంపై పూర్తి అవగాహన పెంపొందించడం, చట్టాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేయించడమే ఆకస్మిక తనిఖీల ప్రధాన ఉద్దేశంఅని ఆయన తెలిపారు. తనిఖీల్లో నిర్లక్ష్యం, విధి నిర్వహణలో లోపాలులేదా నిబంధనల ఉల్లంఘనలు గుర్తిస్తే సంబంధితఅధికారులపై చట్టప్రకారం కఠిన చర్యలుతీసుకుంటామని హెచ్చరించారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ దేవాదాయ శాఖలో ఆర్టీఐ చట్టం అమలు తీరును రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ కు వివరించారు. అలాగే గొల్లపూడి గ్రామ పంచాయతీ, డైరెక్టరేట్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయాల్లో సంబంధిత అధికారులు అందించిన వివరాలు, రికార్డులను పరిశీలించిన ప్రధాన సమాచార కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

# అవినీతి అధికారులను టార్గెట్ చేస్తున్న సైబర్ నేరగాళ్లు

## ఎసిబి పేరిట బెదరింపులకు పాల్పడి రూ. లక్షల్లో వసూళ్లు

**హైదరాబాద్, జులై 10 ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్ల ట్రెండ్ మార్చారు. ఇప్పటివరకు చేస్తున్న నేరాలకు భిన్నంగా ఎసిబి కేసుల్లో వున్న వారు, ఎసిబి దాడులు జరిగిన సర్కారీ విభాగాల్లో పనిచేస్తున్న వారిని టార్గెట్ చేస్తూ అందినంత దోచుకుంటున్నారు. వీటిపై అప్రమత్తంగా వుండాలని ఓవైపు ఎసిబి, మరోవైపు సైబర్ క్రైం పోలీసులు హెచ్చరిస్తున్నా మోసపోతున్న వారి సంఖ్య ఆగడంలేదు. అయితే కొన్నిసార్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తుండగా ఇంకొన్ని సార్లు మౌనంగా వుంటుండం సైబర్ నేరగాళ్లకు ఊతం ఇస్తోంది. గతంలో ఎసిబి పేరు చెప్పి కొందరు నేరగాళ్లు రెవెన్యూ, అబ్కారీ, రిజిస్ట్రేషన్ విభాగాల అధికారులు, సిబ్బందిని బెదిరించి వసూళ్లకు పాల్పడిన ఘటనలు అనేకం వున్నాయి. మీడియాలో ఎక్కడైనా అవినీతి, అక్రమాలపై వార్తలు రాగానే ఈ తరహా నేరాలకు పాల్పడే నేరగాళ్లు రెచ్చిపోయి ఆయా విభాగాల అధికారులకు ఫోన్‌లు చేసి తాము ఎసిబి అధికారులమని బెదిరించి అందినంతా దండుకునే వారు. దీనిపై ఎసిబి ఎన్ని హెచ్చరికలు చేసినా పెద్దగా ప్రయోజనం వుండడడం లేదు. కొన్నిసార్లు ఇలాంటి నేరాలకు పాల్పడిన వారు పోలీసులకు పట్టుబడిన ఉదంతాలు వున్నా ఇప్పటికీ కొన్నిచోట్ల ఈ తరహా నేరాలు సాగుతూనే వున్నాయి. అయితే తాజాగా సైబర్ నేరగాళ్ల సర్కారీ విభాగాల్లో అక్రమార్కులుగా పేరొందిన వారిని బెదిరించి వసూళ్లకు పాల్పడడం పెరిగి పోయింది. చేర్యాల తహసీల్దార్ ఇటీవలే ఎసిబికి పట్టుబడగా దీని తరువాత ఎసిబి అధికారులు ఆ కార్యాలయంతో పాటు అక్కడ పనిచేసే అధికారులు, సిబ్బంది, పలువురు అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ఎసిబి సోదాలు చేర్యాల తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులను హడలెత్తించగా దీనిని సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మలచుకుని సొమ్ముచేసు కున్నారు. ఎసిబి దాడుల తరువాత ఈ కార్యాలయంలో ఆర్ఐగా పనిచేస్తున్న ఓ అధికారికి ఎసిబి అధికారుల పేరిట సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి మీపైనా ఇంకా చాలా మందిపైనా అనేక ఆరోపణలు వున్నాయి...మీపై కేసు నమోదు కాకుండా వుండాలంటే వెంటనే మేము సూచించిన బ్యాంకు ఖాతాకు లక్ష రూపాయలు పంపాలని లేకుంటే నెక్స్ట్ మిమ్మల్నే అరెస్టు చేయాల్సి వుంటుందని బెదిరించారు.

దీంతో బెదిరిపోయిన సదరు అధికారి సైబర్ నేరగాళ్లు చెప్పినట్లే నిమిషాల వ్యవధిలో లక్ష రూపాయలు నేరగాళ్లు సూచించిన బ్యాంకు ఖాతాకు బదిలీ చేశారు. డబ్బులు పంపిన తరువాత తనకు ఫోన్ చేసిన వ్యక్తికి ఫోన్ చేసి, తనను ఏమీ అనవద్దని, మీరు చెప్పినట్లే చేశానని చెప్పాలని ఫోన్ చేయగా అది స్విచాఫ్‌గా తేలింది. మరోసారి చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించిన సదరు అధికారి వెంటనే సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేబట్టారు. చేర్యాలతో పాటు మరో మూడుచోట్ల ఇ టువంటి ఘటనలు జరిగినట్లు సైబర్ క్రైం పోలీసుల దృష్టికి వచ్చింది. అయితే ఈ ఘటనలపై ఫిర్యాదులు అందక పోవడంతో సైబర్ క్రైం పో లీసులు అంతర్గతంగా విచారణ చేబట్టారు. ఈ తరహా ఘటనలపై సర్కారీ విభాగాల అధికారులు అప్రమత్తంగా వుండాలని సైబర్ క్రైం పోలీసులు కోరుతున్నారు.

# అంగన్‌వాడీల్లో భర్తీ ప్రక్రియ ప్రారంభం

## వివిధ జిల్లాల్లో నోటిఫికేషన్లు విడుదల

**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త :** తెలంగాణలోని నిరుద్యోగ మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలను కల్పించనుంది. ఇందుకు గాను తాజాగా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో 15,982 అంగన్‌వాడీ పోస్టుల భర్తీప్రక్రియ ప్రారంభమైంది. ఇందులో భాగంగా నిజామాబాద్‌జిల్లాతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అంగన్‌వాడీ టీచర్, అంగన్ వాడీ ఆయా ఖాళీల భర్తీకి అధికారిక నోటిఫికేషన్లు వెలువడ్డాయి. నిజామాబాద్ జిల్లాలోని ఐదు సమగ్ర శిశు అభివృద్ధి సేవల ప్రాజెక్టుల పరిధిలో 179 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నిజామాబాద్‌తో పాటు ములుగు, నల్గొండ, గద్వాల, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, కామారెడ్డి, పెద్దపల్లి, కొత్తగూడెం జిల్లాల్లో కూడా ఈ నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. ఈ నోటిఫికేషన్లలో పేర్కొన్న వివరాలు ప్రకారం దరఖాస్తుదారులు తప్పకుండా ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఉండాలి. స్థానికంగా ఇంటర్ అభ్యర్థులు లేకపోతే 10వ తరగతి చదివిన వారికి అవకాశం కల్పించనున్నారు. అలాగే ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 18 నుండి 35 సంవత్సరాల మధ్యఉండాలి. ప్రధానంగా ఖాళీఉన్న కేంద్రం పరిధిలోని స్థానిక వివాహిత మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ ద్వారా 100 మార్కులకు ఈ ఎంపిక జరుగుతుంది. ఇందులో ఇంటర్ మార్కులకు 70, అనాథలకు 10, వితంతువులకు 5, దివ్యాంగులకు 5 వెయిటేజీతోపాటు 10 మార్కులకు ఇంటర్వ్యూ ఉంటుందని వెల్లడించింది.

# నేడు విజయవాడలో మెగా జాబ్ మేళా

**విజయవాడ, జులై 10, ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో నిరుద్యోగ మైనారిటీ యువత కోసం రాష్ట్రస్థాయి మెగా జాబ్ మేళాను నేడు నిర్వహిస్తున్నట్లు మైనారిటీ, న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇస్లాం పేటలోని షాజహూర్ ముసాఫిర్ ఖానాలో ఉదయం 9 గంటల నుండి జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. నిరుద్యోగమైనారిటీ యువత కోసం, ఉద్యోగ, ఉపాధి కల్పనకు ప్రఖ్యాతిగాంచిన 60 నుండి 70 మల్టీ నేషనల్ సంస్థలు, డోమెస్టిక్ కంపెనీలుపాల్గొంటున్నట్లు మంత్రి తెలిపారు. ఐటి,బ్యాంకింగ్, ఫైనాన్స్, హెల్త్ కేర్, లాజిస్టిక్స్, రిటైల్ తదితర రంగాలలో వివిధ స్థాయిలలో 2500 నుండి 3500 మందికి ఉపాధిఅవకాశాలుకల్పించడమే జాబ్ మేళా ముఖ్య ఉద్దేశమని తెలిపారు. 10వ తరగతినుండి పీజీ దాకా చదివిన నిరుద్యోగులంతా పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఫరూక్ పిలుపు నిచ్చారు.

# వరుస ఓటములపై మంత్రి అజారుద్దీన్ అసంతృప్తి

**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త:** ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న భారత జట్టుకు వరుస ఓటములతో పరాభవం పాలవుతోంది. ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో భారత క్రికెట్ జట్టు వరుసగా మూడోఓటమితో సిరీస్‌ను చేజార్చుకుంది. కాగా ఈ వరుస ఓటములపై మాజీ భారత కెప్టెన్, తెలంగాణ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఐపీఎల్ మైండ్ సెట్ నుండి భారత బ్యాటర్లు ఎంత త్వరగా బయట పడితే అంత మంచిదని అన్నారు. ఇంగ్లాండ్‌తో ఆడటం అనేది పూర్తిగా భిన్నమైన విషయమని, ఐపిఎల్‌లో ఆడినట్లు ప్రతి బంతిని స్టేడియం దాటించడానికి ఇక్కడ కుదరదని స్పష్టం చేశారు.

ఫ్యాషన్ ఫ్యాషన్

# రాజసాన అనార్కలీ






అనార్కలీ గ్రాండ్‌లుక్ ఉంటుంది. మొఘలుల కాలం నాటిది! రాజనర్తకి అనార్కలీ వేసుకునేదనీ, తన పేరుమీదుగానే తీసుకొచ్చారనీ చెబుతారు. దానిమ్మ మొగ్గ అనీ అర్థమట. శతాబ్దాల నాటిదే! కానీ ఇప్పటికీ దాని రాజసం తగ్గలేదనేది వాస్తవం. అందుకే అది వేసుకుని అమ్మాయిలు నడిచొస్తోంటే అచ్చు యువరాణుల్లానే ఉంటారు. నడకకి దీటుగా పోటీపడతాయీ దుస్తులు మరి. కాబట్టే, ఆ రాయల్ లుక్. లావు, సన్నం, ఎత్తు, పొడవు, అన్న తేడాలేకుండా ఎవరికైనా నప్పుతుంది. దీనిలోనూ ఎన్ని రకాలని? దొరికే వస్త్ర రకాలకీ కొదవలేదు. ఇంకేం, స్నేహితురాళ్ల కాదు. వధువులూ తమ పెళ్లి వేడుకల్లో వీటికి ప్రాధాన్యమిస్తున్నారు. ఓ మంచి అనార్కలీ డ్రెస్, పెద్ద జుంకీలు చాలు వేడుకకి సిద్ధం. లేదు లేదు ఇంకా ప్రత్యేకంగా కనిపించా లంటే కాస్త హంగులున్న డిజైనర్ అనార్కలీ, దీన్ని ఎంచు కోవడమంటే కేవలం డ్రెస్‌ని ఎంచుకోవడంలా చూడరు ఫ్యాషనిస్టులు. సొగసుని అందిపుచ్చు కోవడం అంటారు.

# శ్రీరామరాజ్యం

త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడి పరిపాలనా కాలంలో ధర్మం నాలుగు పాదాల మీద నడిచేదంటారు. ఆ విషయాన్ని బలపరిచే ఉదంతాలు అనేకం రామాయణ మహాకావ్యంలో చూస్తాం. ఆదికవి వాల్మీకి విరచిత సంక్షిప్త రామాయణంలో పుత్ర మరణం కించి ద్రక్ష్యం పురుషాఃక్వచిత్ అన్నారు. రామరాజ్యంలో తండ్రి కంటే ముందు పుత్రులు మరణించడం అన్నది లేదు. రుషివాక్యం సత్యదూరం కాదు కదా!

**నిర్దస్యుర భవల్లోకో నానర్థం కశ్చిదస్పృశత్**
**నచస్మవృద్ధా బాలానాం ప్రేత కార్యాణి కుర్వతే** వాల్మీకి రామాయణం యుద్ధకాండ లోని ఈ శ్లోకానికి రామరాజ్యంలో దొంగలు లేరు. పిల్లలకు ప్రేతకార్యం చేసే అవసరం ఎన్నడూ ఎక్కడా కలగలేదు అనేది భావం. ఆ కాలంలో ప్రజలెవ్వరినీ అకాలమృత్యువు హరించలేదంటూ తులసీదాసు రామాయణంలోనూ లిఖితమైంది. కంకంటి పాపరాజు ఉత్తర రామాయణంలో సుతులు లేక కలంగు సుదతు లెక్కడ లేరు అంటూ భరతుడు శ్రీరామచంద్రుడికి తెలియ జేయడం కనిపిస్తుంది. ఇందులోనే ధర్మాభిదానమంత కడు నిక్కమొనర్చే ముదుసళ్లనైనను గడియబోక అనే ప్రయోగం ఉంది. రామ రాజ్యంలో ప్రజలెవ్వరూ బాధపడలేదు. లోకం ధర్మబద్ధంగా నడిచింది. అకాల మరణాలు సంభవించవు అనేది భావం. □

# మెక్సికన్ పరోటా రోల్స్



కావలసిన పదార్థాలు: బ్రకోలీ ముక్కలు: ఒక కప్పు, సన్నగా తరిగిన ఉల్లిగడ్డ, క్యాప్సికం, టమాట ముక్కలు: పావు కప్పు చొప్పున, చీజ్ తురుము: ఒక కప్పు, ఉడికించిన స్వీట్‌కార్న్: రెండు టేబుల్ స్పూన్లు, మిరియాల పొడి: అర టీస్పూన్, కారం: ఒక టీస్పూన్, ఉప్పు: తగినంత, నిమ్మరసం: ఒక టేబుల్ స్పూన్, గోధుమపిండి, మైదాపిండి: ఒక కప్పు చొప్పున, నూనె: అర కప్పు. **తయారీ** .. ఒక గిన్నెలో మైదాపిండి, గోధుమపిండి, ఒక టేబుల్ స్పూన్ నూనె, కొద్దిగా ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంలో తగినన్ని నీళ్లు పోసి ముద్దలా కలిపి పావుగంట మూతపెట్టి పక్కనపెట్టాలి. బ్రకోలీ ముక్కల్ని పది నిమిషాల పాటు ఉప్పునీళ్లలో ఉడికించి చిన్నగా తరగాలి. ఒక గిన్నెలో బ్రకోలీ, టమాట, క్యాప్సికం, ఉల్లిగడ్డ ముక్కలు, చీజ్ తురుము, స్వీట్ కార్న్, కారం, మిరియాల పొడి, ఉప్పు, నిమ్మరసం వేసి బాగా కలపాలి. స్టవ్ మీద పెనం పెట్టి వేడి చెయ్యాలి. పిండి మిశ్రమాన్ని కొద్దికొద్దిగా తీసుకుని చపాతీలా ఒత్తి పెనంపై వేసి ఒక నిమిషంపాటు రెండు వైపులా తిప్పుతూ కాల్చుకోవాలి. కాలిన చపాతీ మధ్యలో బ్రకోలీ మిశ్రమం పెట్టి గుండ్రంగా చుట్టి ఒక నిమిషంపాటు మూతపెడితే వేడివేడి మెక్సికన్ పరోటా రోల్స్ సిద్ధం. □

# సియాచిన్‌లో శివంగి



భారత సైనిక చరిత్రలో నూతన అధ్యాయాన్ని లిఖిస్తూ కెప్టెన్ శివ చౌహాన్ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన యుద్ధ క్షేత్రమైన సియాచిన్ గ్లేసియర్‌లోని కుమార్ పోస్ట్‌లో ఆపరేషనల్ విధుల్లో నియమితులైన తొలి మహిళా అధికారిగా శివ సరికొత్త చరిత్ర సృష్టించారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌కు చెందిన శివ చౌహాన్, 11 ఏళ్ల ప్రాయంలోనే తండ్రిని కోల్పోయారు. తల్లి, సోదరి అండతో అనేక సవాళ్లను అధిగమించి, తన చిన్ననాటి కలను సాకారం చేసుకునే దిశగా సైన్యంలో అడుగుపెట్టారు. 2020లో సివిల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ పూర్తి చేసిన ఆమె, సర్వీసెస్ సెలక్షన్ బోర్డు (ఎస్‌ఎస్‌బి) నిర్వహించిన పరీక్షలో ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించారు. అనంతరం చెన్నైలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకుని, 2021 మే నెలలో కార్ప్స్ ఆఫ్ ఇంజినీర్స్‌లో అధి కారిగా నియమితులయ్యారు. కఠినమైన శిక్షణ అనంతరం 2023 జనవరి 2న కెప్టెన్ శివ చౌహాన్‌ను సుమారు 15,632 అడుగుల ఎత్తులో ఉన్న కుమార్ పోస్ట్‌లో మూడు నెలల కాలానికి నియమించారు. అక్కడ ఇంజినీరింగ్ బృందానికి నాయకత్వం వహిస్తూ, మైనస్ 40 నుంచి 50 డిగ్రీల సెల్సియస్ గడ్డకట్టే చలిలోనూ హెలిప్యాడ్‌ల నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాల కల్పన నిర్వహణ బాధ్యతలను ఆమె సమర్థవంతంగా నిర్వర్తించడంతో ఆమె మరో మెట్టుకు ఎదిగారు. సియాచిన్ వంటి అత్యంత కఠినమైన భౌగోళిక పరిస్థితుల్లో లింగభేదం లేకుండా, కేవలం ప్రతిభ మరియు దక్షత ఆధారంగానే సైన్యం కీలక బాధ్యతలు అప్పగిస్తుందనడానికి కెప్టెన్ శివ చౌహాన్ నియామకమే నిదర్శనం. వ్యక్తిగత కష్టాలను అధిగమించి దేశ సేవలో ఉన్నత శిఖరాలను అధిరోహించిన ఆమె ప్రస్థానం, రక్షణ రంగంలో స్థిరపడాల నుకునే ఎంతో మంది యువతులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. □

# పెరుగు





డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

మంచి బాక్టీరియా ఎక్కువగా ఉండే రిఫ్రెష్ క్రీముల ప్రోబయోటిక్ ఆహారం. ఇది పిల్లల నుంచి పెద్దల వరకు సులభంగా జీర్ణమయ్యే సంపూర్ణాహారం. దీన్ని పెరుగు, మొసారు, దధి, దహి యోగర్ట్, త్రైర్, దోయీ అని అంటారు. ఇది కేవలం ఒక గంటలో పెరుగు 91% జీర్ణ అయ్యే మంచి ఆహార పదార్థాం. పెరుగు శరీరానికి బలాన్ని, రోగ నిరోధక శక్తిని ఆకలిని, జీర్ణశక్తిని, రుచిని పెంపొందించే ఎనర్జీ బూస్టర్ అంతే గాకుండా శరీర పోషణకు మూలమైన ముఖ్యమైన ఆంటీ ఆక్సిడెంట్ అని చెప్పవచ్చు. ఇది అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్‌ని తగ్గిస్తుంది. ఇది గుండె, చర్మం, జుట్టు, జీర్ణకోశ ఆరోగ్యా నికి మంచిది. ఇది శరీర అధిక బరువుని తగ్గిస్తుంది. శరీరంలో వేడిని తగిస్తుంది. దీనిలోని మంచి బాక్టీరియా గట్‌హెల్త్‌కి మంచిది. ఇది దంతాలు ఎముకలకు బలం, శరీరంలోని అధిక షుగర్ లెవల్స్‌ని తగ్గిస్తుంది. ఇమ్యూనిటీని పెంపొందించి దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా చేస్తుంది. పెరుగులోని విటమిన్స్ మినరల్స్, కాల్షియం త్వరగా రక్తంలో కలిసేలా చేస్తాయి. ఎండవేడికి చర్మం పాడవకుండా, నగనిగలాడేలాగ చేస్తుంది. ఇది నరాలకి శక్తిని జీర్ణశక్తిని పెంపొందించే ఔషధ కారకం ఆహారం అని చెప్పవచ్చు. వేసవిలో శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుతుంది. శరీరంలో మంట, వాపుని తగిస్తుంది. నిద్ర పట్టనివారు, ఉన్మాదం ఉన్నవారు, ఫట్స్‌తో బాధపడేవారు, మాన సిక సమస్యలున్న వారిలో సెరిటోనిన్ పెరిగి నిద్రపడుతుంది సెరెయాసిస్, ఎగ్జిమా వంటి చర్మ వ్యాధులున్నవారు వాడవచ్చు రెగ్యులర్‌గా పెరుగు తీసుకుంటే అపెండిసైటిస్, ఎమిబియాసిస్, మలబద్ధకం, జ్వరం, విరేచనాలు, బహిష్ఠులు సక్రమంగా రాక పోవడం వంటి వ్యాధులు రావు. కడుపులో అల్సర్ ఉండే వారిలో, గ్యాస్ట్రిక్ ఇంటేషన్ ఉన్న, హైపర్ అసిడిటీ ఉన్నప్పుడు పెరుగు జీర్ణ అయ్యేటప్పుడు అది సిఓ2 నీరుగా మారడం వల్ల హైపర్ అసిడిటీ, అల్సర్, గ్యాస్ తగ్గుతుంది. పెప్సిన్ ఎంజైమ్స్ విడుదల వల్ల ఆహారం జీర్ణమవుతుంది పెరుగు ఒత్తిడి, ఆందోళ నకు కారణమయ్యే హార్మోన్ల స్థాయి తగ్గిస్తుంది. గర్భిణీలు, కామెర్లు, హైపటైటిస్, లివర్ వ్యాధులున్నవారు, ఆంటి బయాటిక్స్, హోపటైటిస్, లివర్ వ్యాధులున్న వారు, ఆంటి బయాటిక్స్, దీర్ఘకాలిక వ్యాధులకి మందులు వాడే వారు పెరుగుని వాడడం వల్ల దానిలోని ఇన్‌ఫ్లమేటరీ గుణాలు, మంటని తగ్గించి శరీరాన్ని చల్లగా ఉంచుతాయి. జలుబుగా ఉన్నప్పుడు మూత్ర సంబంధ రోగాల్లో, జిగురు విరేచలున్న ప్పుడు పెరుగు వాడడం మంచది. ఇది జీర్ణ వ్యవస్థని పటిష్ఠం చేస్తుంది. పెరుగు ఎక్కువగా తీసుకుంటే బరువు పెరుగుతారు. దీనివల్ల మందకొడితనం, స్థూల కాయం, ఇన్‌ఫ్లమేషన్, రక్తస్రావ రుగ్మతలు, కఫం, వాతం ఎక్కువై కుష్టు, గోధుమ రంగు మచ్చలు, రక్తహీనత మలబద్ధకం, వస్తుంది. పెరుగులోని బయో జెనిక్ ఆమైన్ వల్ల తలనొప్పి, మైగ్రేన్ ఎక్కువవుతుంది. కీళ్ళనొప్పులు వస్తాయి. గెలాక్టోజ్ అనే రసాయన సమ్మేళనం వల్ల అరుదుగా అండాశయ కేన్సర్ వచ్చే అవకాశం ఉంది. చలువచేసే పెరుగులో వేడి కల్గించే ఉల్లిగడ్డ ముక్కలు వేసుకొని తింటే ఎలర్జీలు, దద్దుర్లు, జీర్ణకోశ సమస్యలు వాంతులు, తామర, సోంయాస్ వంటి వ్యాధులు వస్తాయి. అలాగే పాలు, పెరుగు కలిపికాని, వెంటనేకాని తిన్నా ఎసిడిటీ, అజీర్తి, అతిసారం, కడుపునొప్పి అనీజీ ఉంటుంది. పెరుగు తిన్న వెంటనే మినపప్పుతో చేసిన పదార్థాలు, నూనె, నెయ్యి, వెన్న అధికంగా ఉండే ఆహార పదార్థాలు తిన్న జీర్ణకోశ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. □

# 'గ్రహాంతర ప్రేమికుడ్ని' చిత్రం ట్రైలర్ విడుదల



ప్రముఖ యూట్యూబర్, క్రియేటివ్ డైరెక్టర్ స్టైల్ రవి తెరకెక్కిస్తున్న వినూత్న ఓటిటి చిత్రం 'గ్రహాంతర ప్రేమికుడ్ని. సినీ చరిత్రలోనే ఒక మైండ్‌బ్లోయింగ్ ప్రయోగంగా రాబోతున్న ఈ సినిమా ఫస్ట్ లుక్, ట్రైలర్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెలగపూడి సచివాలయంలో ఘనంగా విడుదల చేశారు. 'విశ్వంలో ఏలియన్స్ ఉనికిపై ప్రపంచవ్యాప్తంగా సైంటిస్టులు రీసెర్చ్ చేస్తున్నారు. ఇలాంటి టైంలో ప్రజలను ఆలోచింపజేసే కథాంశంతో వస్తున్న 'గ్రహాంతర ప్రేమికుడ్ని ఒక అద్భుత ప్రయోగం. ఏలియన్స్‌తో మానవాళికి ముప్పా? మేలా? అనే పాయింట్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. ఇలాంటి కొత్త కంటెంట్ తో వచ్చే దర్శకులకు, ఎపిలో సినిమా తీసే ప్రతి ఒక్కరికీ కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుంద్ది అని చిత్ర యూనిట్‌ని మంత్రి కందుల దుర్గేష్ అభినందించారు. "భూమి ట్రాన్సిట్ జోన్‌లో 1,715 నక్షత్రాలు ఉన్నాయనే సైంటిఫిక్ రీసెర్చ్ ఆధారంగా ఈ కథను సిద్ధం చేశాం. విశ్వకాంతి వేగంతో ఏలియన్స్ ప్రయాణించే విజువల్స్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తాయి. ఎఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), హైఎండ్ విజువల్ ఎఫెక్ట్స్, టాప్ నాచ్ కంప్యూటర్ గ్రాఫిక్స్ సాయంతో అంతర్జాతీయ సాంకేతిక ప్రమాణాలతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం్మ అని సినిమాపై ఉన్న నమ్మకాన్ని దర్శకుడు స్టైల్ రవి వ్యక్తపరిచారు. ఈ చిత్రంలో భవానీ కపూర్, రమ్య రాథోడ్, సముద్రాల శ్రీధర్ శర్మ, రమేష్ వర్మ, వారణాసి పాత్రుడు, యశ్వంత్ చంద్ర, మల్లెపాడు రమేష్, సైదులు తదితరులు నటిస్తున్నారు. నిర్మాతగా ఎలిజబెత్ (కెనడా) వ్యవహరించగా డిఒపి ప్రకాష్ జైన్ (రాజస్థాన్), ఎడిటర్ ఆంద్రు అలెక్సా, ఎఐ కంపోజర్ బెంజమిన్ వియర్, కంప్యూటర్ గ్రాఫిక్స్‌ను అలెక్సా తెరకెక్కించారు.

# రోషన్ కనకాల కొత్త చిత్రం ప్రారంభం



కొన్ని సినిమాలు ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తాయి. ఫాంటసీ, సైన్స్ ఫిక్షన్, ప్రేమ, మిస్టరీ కలిసిన అలాంటి కొత్త ప్రపంచాన్ని పరిచయం చేయబోతున్న ఓ భారీ కాన్సెప్ట్ సినిమా ఘనంగా ప్రారంభమైంది. రోషన్ కనకాల, గహజి ప్రధాన పాత్రల్లో సరి కొత్త హైకాన్సెప్ట్ సైఫై ఎంటర్‌టైనర్ అధికారి కంగా లాంచ్ అయ్యింది. సత్య, సుదర్శన్, రవితేజ నన్నిమాల ఇతర కీలక పాత్రలు పోషిస్తు న్నారు. ఈ చిత్రం ద్వారా విజయ్ కె కామిశెట్టి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ప్రముఖ దర్శకుడు విఐ ఆనంద్ వద్ద చీఫ్ అసోసియేట్ డైరెక్టర్, డైలాగ్ రైటర్‌గా ఎన్నో ఏళ్లుగా పనిచేసిన విజయ్, 'టైగర్', 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', 'ఒక్క క్షణం', 'డిస్కో రాజా', 'స్వయంభు' వంటి విజయవంతమైన చిత్రాలలో కీలక పాత్ర పోషించారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమలో ఫాంటసీ, సైన్స్ ఫిక్షన్ సినిమాల స్థాయిని తన వినూత్న స్టోరీ టెల్లింగ్‌తో మార్చిన విఐ ఆనంద్ అందించిన కథ ఆధారంగా ఈ చిత్రం రూపొందు తోంది. గుత్తా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై బాలాజీ గుట్ట, కౌశిక్‌రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి కమలాకర్ ఫిల్మ్ కార్పొరేషన్ సహకారం అందిస్తోంది. ఆసక్తికరమైన కాన్సెప్ట్, భారీ స్థాయి నిర్మాణంతో ఈ చిత్రం సరికొత్త సినిమాటిక్ అనుభూతిని అందించ నుంది. కాకతీయ హిల్స్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన సాంప్రదాయ పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం ఈ రోజు ఘనంగా ప్రారంభ మైంది. హీరో నిఖిల్ ముహూర్తపు షాట్‌కు క్లాప్ కొట్టగా, సినిమాటో గ్రాఫర్ కెకె సెంథిల్ కుమార్ కెమెరాను స్విచ్ ఆన్ చేశారు.

# తెర

## 'మైసా' కోసం రష్మిక రిస్కీ స్టంట్స్




బాడీ డబుల్ లేకుండా రెండు రోజుల్లో 20 గంటల పాటు అండర్‌వాటర్ ఫైట్ సీక్వెన్స్ పూర్తి చేసిన భారతీయ సినీ చరిత్రలో తొలి హీరోయిన్‌గా రికార్డు సృష్టించిన రష్మిక మందన్న నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రస్తుతం ప్రతిష్టాత్మక పాన్ ఇండియా యాక్షన్ డ్రామా 'మైసా' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ సినిమాలో ఆమె కెరీర్‌లోనే అత్యంత సవాల్‌తో కూడిన పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్ సినిమాపై భారీ ఆసక్తిని పెంచగా, ఇప్పుడు రష్మిక చేస్తున్న రిస్కీ స్టంట్స్ మరింత అంచనాలని పెంచుతోంది. రవీంద్ర పుల్లే దర్శకత్వంలో, అన్‌ఫార్ములా ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రష్మిక గోండ్ గిరిజన యువతి పాత్రలో నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా కోసం అత్యంత ప్రమాదకరమైన యాక్షన్ సన్నివేశాలను రష్మిక స్వయంగా చేశారు. రెండు రోజుల పాటు దాదాపు 20 గంటల పాటు నీటిలో ఉండి అత్యంత క్లిష్టమైన అండర్‌వాటర్ ఫైట్ సీక్వెన్స్‌ను చిత్రీకరించారు. ఈ సన్నివేశం కోసం బాడీ డబుల్‌ను ఉపయోగించకుండా, స్వయంగా నటించాలని రష్మిక నిర్ణయించుకున్నారు. సన్నివేశాల్లో సహజత్వం కోసం ఆమె చూపించిన ఈ అంకితభావం సినిమా టెక్నికల్ టీమ్‌తో పాటు అండర్‌వాటర్ యాక్షన్ టీమ్‌ను కూడా ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ చిత్రంలో రాహుల్ రవీంద్ర, ఈశ్వరి రావు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సినిమాటోగ్రఫీని శ్రేయాస్ పి.కృష్ణ అందిస్తుండగా, జేక్స్ బిజోయ్ సంగీతం సమకూరుస్తున్నారు. అంతర్జాతీయ యాక్షన్ కొరియోగ్రాఫర్ కేచా ఖాంఫక్‌డీ యాక్షన్ సన్నివేశాలను రూపొందిస్తున్నారు.


# 'ది ఇండియా స్టోరీ' ఇంటెన్స్ పోస్టర్ రిలీజ్



జీ స్టూడియోస్, ఎంఐజీ ప్రొడక్షన్ అండ్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న'ది ఇండియా స్టోర్థీ సినిమా నుంచి మరో ఆసక్తికరమైన పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. చేతన్ డీకే దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సాగర్ బి. షిండే కథ అందించడంతో పాటు నిర్మిస్తున్నారు. సమాజానికి సంబంధించిన కీలక అంశాన్ని కోర్ట్‌రూమ్ డ్రామా రూపంలో చూపిస్తున్న ఈ సినిమా జూలై 24, 2026న ప్రపంచవ్యాప్తంగా హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. విషపూరిత పురుగుమందుల వ్యవసాయం, దాని వల్ల ప్రజల ఆరోగ్యంపై పడుతున్న తీవ్ర ప్రభావం వంటి అంశాల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ సినిమాలోని కొత్త పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. విడుదల చేసిన పోస్టర్‌లో కాజల్ అగర్వాల్, శ్రేయాస్ తల్పాడే తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల్లో కనిపిస్తున్నారు. ఒక భయానక నిజాన్ని బయటపెట్టేందుకు వారు చేసే పోరాటాన్ని ఈ పోస్టర్ సూచిస్తోంది. కూరగాయల మార్కెట్ బ్యాక్ డ్రాప్ లో రూపొందిన ఈ పోస్టర్‌లో ఇద్దరూ ఆగ్రహంతో ఉన్న వ్యాపారుల మధ్య చిక్కుకున్నట్లు చూపించారు. చుట్టూ ఉన్న జనాలు వారిపై కూరగాయలు విసురుతూ, వేలెత్తి చూపిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాజల్, శ్రేయాస్ ముఖాల్లో కనిపించే భయం, చుట్టూ నెలకొన్న ఉద్రిక్త వాతావరణం నిజాన్ని బయటపెట్టే ప్రయత్నం చేసే వారికి ఎదురయ్యే ప్రతిఘటనను బలంగా చూపిస్తోంది.

# 'రక్త చరిత్ర' నా కెరీర్‌లో చాలా స్పెషల్

**: రామ్ గోపాల్ వర్మ**



'రాయలసీమ ఫ్యాక్షనిజంలోని యథార్థ ఘటనలను ఆధారంగా చేసుకుని 'రక్త చరిత్ర' సినిమాను తీశాను. అందులోని క్యారెక్టర్స్ గురించి ఎంతో స్టడీ చేసిన తర్వాతే ఈ సినిమాను మొదలుపెట్టాం. నా కెరీర్ లో చాలా స్పెషల్ సినిమా ఇది" అని సెన్సేషనల్ డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ అన్నారు. వివేక్ ఒబెరాయ్, సూర్య, రాధికా ఆప్టే, ప్రియమణి ప్రధాన పాత్రధారులుగా నటించిన ఈ సినిమా 2010లో విడుదలై, అప్పట్లో సూపర్ హిట్ అయింది. 16 ఏళ్ల తర్వాత ఈ సినిమాను త్రిపుర క్రియేషన్స్ అధినేత మురళీకృష్ణ వంకాయలపాటి, నట్టీస్ ఎంటర్టైన్మెంట్స్, క్విటీ ఎంటెర్టైనెంట్స్ తరపున నట్టి కుమార్ రీ రిలీజ్ చేస్తున్నారు. స్టార్ డామినేషన్ లో తప్పు లేదు సినిమా ఇండస్ట్రీ లో ఒకప్పుడు డైరెక్టర్ కు అధిక ప్రాధాన్యం ఉండేది. డైరెక్టర్ ను కెప్టెన్ ఆఫ్ ది షిప్ అనే వారు...మరి నేడు స్టార్ డామినేషన్ ఎక్కువైంది. దీనికి కారణం ఏమిటి? అన్న ప్రశ్నకు వర్మ బదులిస్తూ... డైరెక్టర్ కు ఏమైనా కిరీటం ఉంటుందా!. స్టార్ ముఖం చూసి ప్రేక్షకులు టిక్కెట్లు కొంటున్నప్పుడు... కోట్లాది రూపాయల బిజినెస్ స్టార్ మూలంగా జరుగుతున్నప్పుడు సహజంగానే స్టార్ డామినేషన్ ఉండటంలో ఎలాంటి తప్పు లేదు. ఫ్యామిలీ సెంటిమెంట్, మల్టీ స్టారర్ సినిమాలు తీయను నా జీవితంలో ఫ్యామిలీ సెంటిమెంట్ సినిమాలు ఎప్పటికీ తీయను. ఫ్యామిలీ సెంటిమెంట్ సినిమాలు ఎవరి కోసం తీయాలి. ఒక కుటుంబం థియేటర్ కు సినిమాకు వెళితే...భర్త ఏమో హీరోయిన్ ను చూస్తాడు, అత్యధిక థియేటర్లలో రీ రిలీజ్ చేస్తున్నాం: నట్టి కుమార్, మురళీకృష్ణ ఒకప్పుడు రాయలసీమలో రెండు వర్గాలు ఎలా కత్తులు దూసుకున్నాయి. దానివల్ల ఎంత మారణ హోమం జరిగిందన్న అంశాన్ని రక్త చరిత్ర సినిమాలో వర్మ చాలా చక్కగా చూపించారని, అప్పట్లో బ్లాక్ బస్టర్ అయిన ఈ చిత్రాన్ని ఈ జనరేషన్‌కి కూడా చూపించాలన్న ఉద్దేశ్యంతోనే రీ రిలీజ్ చేస్తున్నామని నిర్మాతలు నట్టి కుమార్, మురళీకృష్ణ వంకాయలపాటి తెలిపారు.

# 'సైరాబాను' మొదటి షెడ్యూల్ పూర్తి



శంబాల ఘనవిజయంతో మంచి జోష్‌లో ఉన్న హీరో ఆది సాయి కుమార్, ప్రస్తుతం సరికొత్త కాన్సెప్ట్,కమర్షియల్ అంశాల కలయికతో రూపొందుతున్న మరో ఆసక్తికరమైన ఎంటర్ టైనర్‌లో నటిస్తున్నారు. 'కెర్యాంప్'(K-Ramp) వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత, హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా నిర్మిస్తున్న ఈ మూవీ టైటిల్ 'సైరాబాను'. ఫణి కృష్ణ సిరికి దర్శకత్వం వహిస్తున్నారు. కృష్ణకాంత్ పరుచూరి సహనిర్మాతగా ఈ ప్రాజెక్ట్‌ను సమర్పిస్తున్నారు. ఒక హిందూ యువకుడు, ముస్లిం యువతి మధ్య సాగే విభిన్నమైన ప్రేమకథను దర్శకుడు ఫణి కృష్ణ సిరికి ఇందులో అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. హైదరాబాద్ , రాజమండ్రి నేపథ్యంలో సాగే ఈ చిత్రం మొదటి షూటింగ్ షెడ్యూల్ ఇప్పటికే పూర్తయింది. 15 రోజుల పాటు జరిగిన ఈ షెడ్యూల్‌లో ఆది సాయి కుమార్, బాంధవి శ్రీధర్, వెన్నెల కిషోర్, ఇతర ప్రధాన తారాగణం పాల్గొన్నారు. చిత్రం రూపుదిద్దు కుంటున్న తీరు పట్ల చిత్ర బృందం ఎంతో సంతోషంగా ఉంది, వారి ఉత్సాహం BTS (బిహైండ్‌దిసీన్స్) వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. సెట్స్‌లో నెలకొన్న సరదా వాతావరణాన్ని, అందరి ముఖాల్లోని ఆనందం ఈ వీడియో కళ్లకు కట్టినట్లు చూపిస్తుంది. ఈ ప్రాజెక్ట్ అనుభవజ్ఞులైన సాంకేతిక నిపుణుల పని చేస్తున్నారు. రామ్‌రెడ్డి సినిమాటోగ్రఫీ, శేఖర్ చంద్ర సంగీతం, చోటా కె ప్రసాద్ ఎడిటింగ్, బ్రహ్మ కడలి ప్రొడక్షన్ డిజైన్‌ను పర్యవేక్షిస్తున్నారు.



అంబరాన్నంటిన ఫ్రాన్స్ ఆనందం

# ఫ్రాన్స్ సెమీస్ హ్యాట్రిక్

**బోస్టన్, జులై 10:** నిరుటి రన్నరప్ ఫ్రాన్స్ సాకర్ వరల్డ్‌కప్-2026లో దూసుకుపోతోంది. 2022లో ఖతార్‌లో తృటిలో చేజారిన కప్‌ను ఈసారి సాధించడమే లక్ష్యంగా బరిలోకి దిగిన హాట్ ఫేవరెట్ ఫ్రాన్స్... ఆ దిశగా సెమీఫైనల్ చేరింది. బోస్టన్ వేదికగా జరిగిన తొలి క్వార్టర్ ఫైనల్లో మొరాకోపై 2-0 గోల్స్‌తో చిత్తుచేసింది. ఫ్రాన్స్ స్టార్ స్ట్రైకర్ కిలియన్ ఎంబాపె అద్భుతమైన ఆట తీరును ప్రదర్శించాడు. ఈ ఘన విజయంతో ప్రపంచకప్ చరిత్రలో వరుసగా మూడోసారి (2018, 2022, 2026) సెమీఫైనల్‌కు చేరిన జట్టుగా ఫ్రాన్స్ సరికొత్త రికార్డు సృష్టించింది.

### పెనాల్టీ మిస్ చేసిన ఎంబాపె

మ్యాచ్ ఆరంభం నుంచే ఫ్రాన్స్ మైదానంలో దూకుడు ఆట ప్రదర్శించింది. బంతిని ఎక్కువసేపు తమ ఆధీనంలో ఉంచుకుంటూ ఆటపై పట్టు సాధించింది. చివరకు 30వ నిమిషంలో ఫ్రాన్స్‌కు గోల్ చేసే అవకాశం చిక్కింది. మొరాకో డిఫెన్స్‌ను దాటుకుంటూ బాక్స్ లోపలికి దూసుకెళ్లిన ఎంబాపెను... ప్రత్యర్థి డిఫెండర్ నౌసైర్ మజ్రావోయి ప్రమాదకరంగా అడ్డుకున్నాడు. దీంతో రెఫరీ.. ఫ్రాన్స్‌కు పెనాల్టీ ప్రకటించారు. ఎంబాపె షాట్ కొట్టగా, మొరాకో గోల్‌కీపర్ యాసిన్ బోనో అద్భుతమైన డైవ్‌తో అడ్డుకున్నాడు. తొలి అర్ధభాగం ముగిసే సమయానికి ఇరు జట్లు గోల్ లెస్‌గా నిలిచాయి.

### ఎంబాపె, ఉస్మాన్ డెంబెలే గోల్స్

రెండో అర్ధభాగంలో మొరాకో వ్యూహాత్మకంగా పుంజుకోవడానికి ప్రయత్నించింది.కానీ, ఫ్రాన్స్ ఆ జట్టును నిలువరించింది. 60వ నిమిషంలో ఎంబాపె... బాక్స్ పైభాగం నుంచి బంతిని నెట్ కార్నర్‌లోకి పంపాడు. ఈఅద్భుత గోల్‌తో ఫ్రాన్స్ 1-0ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మొదటి గోల్ వచ్చిన ఉత్సాహంలో ఫ్రాన్స్ మరింత వేగంగా కదిలింది. మొరాకో జట్టు కోలుకునే లోపే ఉస్మాన్ డెంబెలే... దూయే అందించిన పాస్‌ను నెట్‌లోకి పంపి ఫ్రాన్స్‌కు రెండో గోల్ అందించాడు. రెండు గోల్స్‌తో వెనుకబడిన మొరాకో మ్యాచ్‌లోకి తిరిగి రావడానికి తమ స్టార్ ఆటగాళ్లు సోఫియాన్ రహిమి, సోఫియాన్ అమ్రబాత్, జకారియా ఎల్ ఊహాదీలను సబ్‌స్టిట్యూట్‌లుగా రంగంలోకి దించింది. మ్యాచ్ చివరి పది నిమిషాల్లో మొరాకో గోల్ కోసం సర్వశక్తులూ ఒడ్డినా ఫలితం లేకపోయింది.



ఆట

గోల్డెన్ బూట్ రేసులో ఎంబాపె

## ఫ్రాన్స్ కెప్టెన్ నయా చరిత్ర సెంచరీ క్లబ్‌లో ఎంబాపె

**బోస్టన్, జులై 10:** క్వార్టర్ ఫైనల్లో మొరాకోపై చేసిన గోల్‌తో ఫ్రాన్స్ కెప్టెన్ కిలియన్ ఎంబాపె అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో పలు మైలురాళ్లను అందుకున్నాడు. ఫ్రాన్స్ ఫుట్‌బాల్ చరిత్రలోనే అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో నేరుగా 100 గోల్స్‌లో భాగస్వామ్యాన్ని పంచుకున్న మొదటి ఆటగాడిగా ఎంబాపె నిలిచాడు. ఇంటర్నేషనల్ కెరీర్‌లో ఫ్రాన్స్ తరఫున ఇప్పటివరకు ఎంబాపె వ్యక్తిగతంగా 64 గోల్స్ చేశాడు. మరో 36గోల్స్‌కు అసిస్ట్‌లు అందించాడు. దీంతో 100 గోల్స్ మైలురాయిని కిలియన్ ఎంబాపె అందుకున్నట్లు అయింది.

సాకర్ ప్రపంచకప్‌లు (2018, 2022, 2026)లలో ఎంబాపె గోల్స్ సంఖ్య 20కి చేరింది. వరల్డ్ కప్‌లో అత్యధిక గోల్స్ చేసిన లియోనెల్ మెస్సీ (21 గోల్స్) ఆల్ టైమ్ రికార్డుకు ఎంబాపె కేవలం ఒక్క గోల్ దూరంలో ఉన్నాడు. ప్రస్తుత 2026 ప్రపంచకప్‌లో ఎంబాపెకు ఇది 8వ గోల్. దీంతో మెస్సీతో కలిసి ఈ టోర్నీలో అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా గోల్డెన్ బూట్ రేసులో సంయుక్తంగా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

# నార్వేకు పరీక్ష.. ఇంగ్లాండ్‌కు సవాల్




**మియామి, జులై 10:** ఫిఫా ప్రపంచ కప్‌లో మరో ఆసక్తికర పోరు నేడు జరగనుంది. మియామివేదికగా జరగనున్న క్వార్టర్ ఫైనల్లో నార్వే, ఇంగ్లాండ్ జట్లు తలపడనున్నాయి. భారత కాలమానం ప్రకారం శనివారం అర్ధరాత్రి తర్వాత రెండున్నర గంటలకు మ్యాచ్ ప్రారంభమవుతుంది. ప్రపంచ ఫుట్‌బాల్ అభిమానుల చూపంతా ఇప్పుడు ఈ మ్యాచ్‌పై నిలి చింది. మ్యాచ్ ఫలితంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

### సంచలనాల నార్వే

ఈ పోరు కేవలం రెండు జట్ల మధ్య పోటీ మాత్రమే కాదు, ప్రపంచంలోని అత్యుత్తమ స్ట్రైకర్లలో ఇద్దరైన ఎర్లింగ్ హాలాండ్, హ్యారీ మధ్య జరిగే ప్రతిష్ఠాత్మక ద్వంద్వ యుద్ధంగా మారింది. ఇరు జట్లు ప్రి క్వార్టర్ ఫైనల్లో అద్భుత విజయాలు సాధించిన జోష్‌లో ఉండటంతో ఈ మ్యాచ్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. నార్వే ఈ టోర్నీలో అందరినీ ఆశ్చర్యపరిచింది. గ్రూప్-ఐలో ఇరాక్‌పై 2-0గోల్స్‌తో గెలుపు బోణీ చేసిన నార్వే... సెనెగల్‌తో మ్యాచ్‌ను 1-1తో డ్రా చేసింది. చివరి లీగ్ మ్యాచ్‌లో ఫ్రాన్స్ చేతిలో 0-2తో ఓడింది. గ్రూప్-ఐలో ఫ్రాన్స్‌తో కలిసి నాకౌట్‌కు వచ్చిన నార్వే.... రౌండ్ ఆఫ్ 32లో ఐవరీకోస్ట్‌పై 2-1తో నెగ్గింది. ఇక ప్రి క్వార్టర్ ఫైనల్లో అయితే అయిదుసార్లు ప్రపంచ ఛాంపియన్లు బ్రెజిల్‌ను 2-1తో ఓడించి తొలిసారిగా క్వార్టర్ ఫైనల్ చేరుకుంది. ఆ మ్యాచ్‌లో హాలాండ్ రెండు గోల్స్ చేసి నార్వే జట్టును ముందుండి నడిపించాడు.

### అనుభవమే అండగా ఇంగ్లాండ్

మరోవైపు హాట్ ఫేవరేట్లలో ఒకటైన ఇంగ్లాండ్...ఈ వరల్డ్ కప్‌లో స్థాయికి తగ్గ ఆటతీరు కనబరుస్తోంది. ఇప్పటివరకు అజేయంగా ఉంది. గ్రూప్-ఎల్‌లో పనామాపై 2-0గోల్స్‌తో, క్రొయేషియాపై 2-0గోల్స్‌తో నెగ్గిన ఇంగ్లాండ్... ఘనాతో గోల్ లెస్ డ్రా చేసుకుంది. గ్రూప్-ఎల్ అగ్రస్థానంతో నాకౌట్‌కు వచ్చిన ఇంగ్లాండ్... రౌండ్ ఆఫ్ 32లో డీఆర్ కాంగోపై 2-1తో గెలుపొందింది. ఇక అతిథ్య మెక్సికోను దాని సొంత గడ్డపై 3-2తో ఓడించి ఉత్కంఠ విజయంతో క్వార్టర్ ఫైనల్ వచ్చింది. కోచ్ థామస్ టుచెల్ వ్యూహాలు, కెప్టెన్ హ్యారీ కేన్ నాయకత్వం జట్టుకు పెద్ద బలంగా నిలుస్తున్నాయి.

### హాలాండ్ వర్సెస్ కేన్ హ్యారీ

ఈ మ్యాచ్‌లో ప్రధాన ఆకర్షణ హాలాండ్-కేన్ హ్యారే. హాలాండ్ ఇప్పటికే ఈ టోర్నీలో ఏడు గోల్స్ చేసి అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. మరోవైపు కేన్ కీలక సమయాల్లో గోల్స్ సాధిస్తూ ఇంగ్లాండ్‌కు విజయాలు అందిస్తున్నాడు. ఇద్దరూ క్లబ్ ఫుట్‌బాల్ ఇంగ్లాండ్‌లోనే ఆడటం ఈ పోరుకు మరింత ఆసక్తి తీసుకొచ్చింది.

చరిత్ర పరంగా చూస్తే ఇంగ్లాండ్‌కే ఆధిక్యం ఉంది. ఇరు జట్లు ఇప్పటివరకు 12 సార్లు తలపడగా ఇంగ్లాండ్ ఏడు విజయాలు సాధించింది. నార్వే రెండు మ్యాచ్‌ల్లో మాత్రమే గెలిచింది. అయితే ఈసారి నార్వే గత రికార్డులను మార్చే సంకల్పంతో బరిలోకి దిగుతోంది. అనుభవం, సమతూకమైన జట్టు కూర్పు కారణంగా ఇంగ్లాండ్ స్వల్ప ఫేవరెట్‌గా కనిపిస్తోంది. అయితే హాలాండ్, ఒడెగార్డ్ వంటి ఆటగాళ్లు మ్యాచ్‌ను ఏ క్షణంలోనైనా మలుపుతిప్పే సామర్థ్యం కలిగి ఉండటంతో నార్వేను తక్కువ అంచనా వేయలేం. ఈమ్యాచ్‌లో గెలిచిన జట్టు సెమీస్‌లో అర్జెంటీనా-స్విట్జర్లాండ్ మ్యాచ్ విజేతతో తలపడనుంది. అందుకే ఈ క్వార్టర్ ఫైనల్‌ను అత్యంత ఆసక్తికర పోరుగా అభిమానులు ఎదురుచూస్తున్నారు.


## స్మృతి ట్రిపుల్ సెంచరీ; లార్డ్స్‌లో శతకం మిస్



**లండన్, జులై 10:** లార్డ్స్ వేదికగా భారత్ -ఇంగ్లాండ్ మహిళల జట్ల మధ్య జరుగుతున్న ఏకైక టెస్ట్‌లో ఓపెనర్ స్మృతి మంధాన అరుదైన ఘనత సాధించింది. భారత్ తరపున 300అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన మూడో మహిళా క్రికెటర్‌గా రికార్డు సృష్టించింది. 2013లో బంగ్లాదేశ్‌పై టీ20 మ్యాచ్‌తో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన మంధాన.. ఇప్పటివరకు అన్ని ఫార్మాట్లలో కలిపి 300 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో 9 టెస్ట్‌లు, 120 వన్డేలు, 171 టీ20 లున్నాయి. మహిళల క్రికెట్ చరిత్రలోనే అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్‌గా హర్మన్ ప్రీత్(374) అగ్రస్థానంలో ఉండగా..తర్వాత స్థానాల్లో సూజీ బేట్స్ (370), ఎలీస్ పెర్రీ(349), మిథాలీ రాజ్(333) ఉన్నారు.

కాగా సిడ్నీ టెస్ట్‌లో భారత్ విమెన్స్ తొలి ఇన్నింగ్స్ స్కోరు 275 మార్కు దాటింది. స్మృతి మంధాన(108 బంతుల్లో 83) తృటిలో సెంచరీ చేజార్చుకోగా.. కెప్టెన్ హర్‌ప్రీత్(58), దీప్తీశర్మ (56) అర్ధసెంచరీలతో రాణించారు. జిమీ రోడ్రిగ్స్ 35 రన్స్ చేసింది.

## తొలిసారి వింబుల్డన్ ఫైనల్లో జ్వెరెవ్



లండన్: జర్మనీ రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ తొలిసారి వింబుల్డన్ ఫైనల్లో ప్రవేశించాడు. తొలి సెమీఫైనల్లో బ్రిటిష్ వైల్డ్‌కార్డ్ ఆటగాడు ఆర్థర్ ఫెరీని 7-6, 6-2, 6-4 తేడాతో ఓడించాడు. సొంతగడ్డపై ఫైనల్ చేరాలన్న ఫెరీ ఆశలకు బ్రేక్ వేశాడు. మొదటి సెట్ చెమటోడ్చి నెగ్గిన ఫ్రెంచ్ ఓపెన్ ఛాంపియన్ జ్వెరెవ్... తరువాతి రెండు సెట్లను అలవోకగా కైవసం చేసుకున్నాడు. 2గంటల 14 నిమిషాల్లో మ్యాచ్ ముగించాడు. జ్వెరెవ్‌కు ఇది అయిదో గ్రాండ్ స్లామ్ ఫైనల్.

## భారత్‌లో బిగ్‌బాష్ లీగ్ ఆరంభ మ్యాచ్

**మెల్‌బోర్న్, జులై 10:** ఆస్ట్రేలియా టీ20 టోర్నీ బిగ్ బాష్ లీగ్ ప్రారంభ మ్యాచ్ డిసెంబర్ 12న చెన్నైలోని చెపాక్ స్టేడియం వేదికగా జరగనుంది. 2026-27 సీజన్ మొదటి మ్యాచ్‌ను భారత్‌లో నిర్వహించబోతున్నట్లు మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్, భారత ప్రధాని మోడీ సంయుక్తంగా చారిత్రాత్మక నిర్ణయాన్ని ప్రకటించారు. ఈ మ్యాచ్‌లో మెల్‌బోర్న్ రెనెగేడ్స్, పెర్త్ స్కోర్చర్స్ జట్లు తలపడతాయి. ఆస్ట్రేలియా వెలుపల జరగబోతున్న మొట్ట మొదటి బిగ్ బాష్ లీగ్ మ్యాచ్ ఇదే. అలాగే భారత్‌లో నిర్వహించబడుతున్న తొలి విదేశీ క్రికెట్ లీగ్ మ్యాచ్‌గా ఇది రికార్డు సృష్టించనుంది. మిగతా బిగ్‌బాష్ లీగ్ మ్యాచ్‌లు ఆస్ట్రేలియాలోనే డిసెంబర్ 15 నుంచి యథావిధిగా జరుగుతాయి.

## 7.26 బిలియన్ డాలర్లు పెరిగిన ఫారెక్స్ ఖజానా


**న్యూఢిల్లీ, జులై 10:** దేశ విదేశీ మారక ద్రవ్య నిల్వలు ఈనెల3తో ముగిసిన వారంలో 7.26 బిలియన్ అమెరికన్ డాలర్లు పెరిగి 674.193 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని భారతీయ రిజర్వ్ బ్యాంక్ శుక్రవారం వెల్లడించింది. అంతకుముందు వారంలో దేశ ఫారెక్స్ నిల్వలు 5.654 బిలియన్ డాలర్లు తగ్గి 666.933 బిలియన్ డాలర్లకు చేరాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో దేశ విదేశీ మారక నిల్వలు చరిత్రాత్మక గరిష్ఠ స్థాయి అయిన 728.494 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అనంతరం మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు పెరగడం, రూపాయిపై ఒత్తిడి అధికమవడం వల్ల ఆర్‌బీఐ డాలర్ల విక్రయం ద్వారా విదేశీ మారక మార్కెట్లో జోక్యం చేసుకోవాల్సి రావడంతో ఫారెక్స్ నిల్వలు వరుస వారాల పాటు తగ్గుముఖం పట్టాయి. విదేశీ మారక నిల్వలను పరిరక్షించేందుకు విదేశీ పర్యటనలను తగ్గించాలని, ఇంధన వినియోగాన్ని పరిమితం చేయాలని, ఏడాది పాటు బంగారం కొనుగోళ్లను నివారించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మే 11 నుంచి పలు సందర్భాల్లో దేశ ప్రజలకు విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే. ఈనెల 3తో ముగిసిన వారానికి సంబంధించిన ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం, ఫారెక్స్ నిల్వల్లో ప్రధాన భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 4.51 బిలియన్ డాలర్లు పెరిగి 545.578 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అమెరికన్ డాలర్ల రూపంలో లెక్కించే ఈ విదేశీ కరెన్సీ ఆస్తుల్లో యూరో, పౌండ్ స్టెర్లింగ్, జపాన్ యెన్ వంటి ఇతర ప్రధాన కరెన్సీల విలువల్లో వచ్చిన పెరుగుదల లేదా తగ్గుదల ప్రభావం కూడా ప్రతిబింబిస్తుంది.

## బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర నికరలాభం 2020 కోట్లు




**ముంబై:** ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర తొలి త్రైమాసికంలో బలమైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే బ్యాంక్ నికర లాభం 26.8శాతం పెరిగి రూ.1,593కోట్ల నుంచి రూ.2,020కోట్లకు చేరుకుంది. బ్యాంకు ప్రధాన ఆదాయమైన నికర వడ్డీ కూడా 14.5శాతంవృద్ధి చెంది రూ.3,292 కోట్ల నుంచి రూ.3,770 కోట్లకు పెరిగింది. రుణాలపై వచ్చే ఆదాయం స్థిరంగా పెరగడం ఈ వృద్ధికి ప్రధాన కారణమని బ్యాంకు తెలిపింది. ఆపరేటింగ్ పనితీరు కూడా మెరుగుపడింది. ఆపరేటింగ్ లాభం ఏడాది ప్రాతిపదికన 21.3 శాతం పెరిగి రూ.2,570 కోట్ల నుంచి రూ.3,117 కోట్లకు చేరుకుంది. ఇతర ఆదాయం 25 శాతం పెరిగి రూ.825 కోట్ల నుంచి రూ.1,029 కోట్లకు పెరిగింది. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి వరుసగా రెండో త్రైమాసికంలోనూ 1.45 శాతం వద్దనే కొనసాగగా, నికర ఎన్‌పీఎలు కూడా 0.13 శాతం వద్ద స్థిరంగా ఉన్నాయి. ఈ త్రైమాసికంలో కేటాయింపులు రూ.840 కోట్లుగా నమోదయ్యాయి. గత ఏడాది ఇదే కాలంలో ఇవి రూ.867 కోట్లు ఉండగా, గత త్రైమాసికంలో రూ.617 కోట్లుగా నమోదయ్యాయి. జూన్ 30, 2026తో ముగిసిన త్రైమాసికంలో కోవిడ్19కు సంబంధించిన అత్యవసర ప్రొవిజన్లలో రూ.250 కోట్లను తిరిగి రద్దు చేసినట్లు బ్యాంక్ తన నియంత్రణ సంస్థలకు సమర్పించిన నివేదికలో వెల్లడించింది.

## ఐదు ఐపీవోలకు సెబీ గ్రీన్ సిగ్నల్




**ముంబయి, జులై 10:** మార్కెట్ నియంత్రణ సంస్థ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా శుక్రవారం ఐదు కంపెనీల ఐపీవో ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. టోన్బో ఇమేజింగ్ ఇండియా లిమిటెడ్, మార్రీ రిటైల్ లిమిటెడ్, రెంటోమోజో లిమిటెడ్, జెట్‌వర్క్ మాన్యుఫ్యాక్చరింగ్ బిజినెస్ లిమిటెడ్, గుజరాత్ విక్టరీ ఫోర్జింగ్స్ లిమిటెడ్ సంస్థలకు సంబంధించిన డ్రాఫ్ట్ పత్రాలపై సెబీ అబ్జర్వేషన్ లెటర్ జారీ చేసింది. సెబీ పరిభాషలో ఇది తుది ఆమోదంగా పరిగణిస్తారు. జెట్‌వర్క్ మాన్యుఫ్యాక్చరింగ్ బిజినెస్‌జెట్‌వర్క్ ఐపీవోలో తాజా ఈక్విటీ షేర్ల జారీ తో పాటు ప్రస్తుత వాటాదారులు విక్రయించే ఆఫర్ ఫర్ సేల్ కూడా ఉండే అవకాశం ఉంది. ఐపీవో పరిమాణం, కంపెనీ విలువ వంటి తుది వివరాలు బుక్ బిల్డింగ్ ప్రక్రియ ద్వారా నిర్ణయించబడతాయి. కంపెనీలో ప్రస్తుతం ఖోస్లా వెంచర్స్, బైలీ గిఫోర్డ్, రాకేష్ గంగ్వాల్, యాక్సెల్, పీక్ శ్రీజు, గ్రీన్‌ఓక్, లైట్‌స్పీడ్ వంటి ప్రముఖ పెట్టుబడిదారులు ఉన్నారు. జెట్‌వర్క్ సాంకేతికత ఆధారిత తయారీ వేదికను నిర్వహిస్తోంది.

పరిశ్రమల నుంచి వచ్చే డిమాండ్‌ను వివిధ సరఫరాదారులు, తయారీ యూనిట్లతో అనుసంధానం చేస్తుంది. టోన్బో ఇమేజింగ్ ఐపీవోలో ప్రమోటర్ వాటాదారులు 19.60 లక్షల ఈక్విటీ షేర్లు, ప్రమోటర్ గ్రూప్ వాటాదారు 3.39 లక్షల షేర్లు, ఇన్వెస్టర్ వాటాదారులు 1.56 కోట్లకు పైగా ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయించనున్నారు. ప్రస్తుతం అరవింద్ లక్ష్మీకుమార్, అంకిత్ కుమార్, సిసీలియా డిసౌజా సంస్థ ప్రమోటర్లుగా ఉన్నారు. ప్రపంచ రక్షణ రంగ ప్రాజెక్టులు, ఉత్పత్తుల రూపకల్పన, నిధుల సమీకరణలో వీరికి విశేష అనుభవం ఉంది. గుజరాత్ విక్టరీ ఫోర్జింగ్స్ ఐపీవోలో 65 లక్షల వరకు తాజా ఈక్విటీ షేర్ల జారీ, 1.32 కోట్ల వరకు ఈక్విటీ షేర్ల ఆఫర్ ఫర్ సేల్‌తో వస్తోంది. ఒక్కో ఈక్విటీ షేరు ముఖ విలువ రూ.10గా నిర్ణయించారు.




# స్టాక్ మార్కెట్లలో జోష్ ర్యాలీ తీసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, జులై 10:** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ లాభాలతో ముగిశాయి. అన్ని రంగాల్లో కొనుగోళ్ల జోరుతో నిఫ్టీ 24,200 మార్క్‌ను అధిగమించి ముగిసింది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా మంచి ర్యాలీ నమోదు చేశాయి. ఎన్‌ఎస్‌ఈలోని రంగాల వారీ సూచీల్లో నిఫ్టీ ఎఫ్‌ఎంసీజీ మినహా మిగిలిన అన్ని సూచీలు లాభాల్లో ముగిశాయి. ప్రభుత్వ రంగ ఇండియన్ బ్యాంక్ షేరు 10శాతానికి పైగా పెరిగి నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ సూచీలో అగ్రగామిగా నిలిచింది. టీసీఎస్ జూన్ త్రైమాసిక ఫలితాలు అంచనాలకు మించి రావడం, ఐటీ రంగంలో డిమాండ్ మెరుగుపడుతున్నట్లు సంస్థ సంకేతాలు ఇవ్వడంతో ఐటీ షేర్లలో కొనుగోళ్లు పెరిగాయి.

ముడి చమురు ధరలు తగ్గడం, రూపాయి బలపడటం పెట్టుబడిదారుల విశ్వాసాన్ని మరింత పెంచాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 827.57 పాయింట్లు పెరిగి 77,569.39 వద్ద ముగిసింది. నిఫ్టీ50 సూచీ 244.10 పాయింట్లు లాభపడి 24,206.90 వద్ద స్థిరపడింది. వరుసగా రెండు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ మొత్తం 1.35శాతం, నిఫ్టీ 1.33శాతం పెరిగాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.36 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 1.48 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.85 శాతం లాభపడటం నిఫ్టీకి ప్రధాన బలంగా నిలిచింది. విస్తృత మార్కెట్‌లో ప్రధాన సూచీల కంటే మెరుగైన ప్రదర్శన కనిపించింది. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 1.40 శాతం, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 1.20 శాతం పెరిగాయి. మార్కెట్‌లో కొనుగోళ్ల ర్యాలీ స్పష్టంగా కనిపించింది.

ఎన్‌ఎస్ఈలో 2,339 షేర్లు లాభపడగా, 973 షేర్లు నష్టాల్లో ముగిశాయి. మరో 98 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. కమోడిటీలు, కరెన్సీ మార్కెట్‌సెప్టెంబర్ 2026 డెలివరీకి బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 10 సెంట్లు తగ్గి 76.20 డాలర్లకు చేరింది. భారత్ 10 సంవత్సరాల ప్రభుత్వ బాండ్ రిటర్నులు 6.754శాతం నుంచి 6.711 శాతానికి తగ్గింది. విదేశీ మారక ద్రవ్య మార్కెట్లో డాలర్‌తోపోలిస్తే రూపాయి స్వల్పంగా బలపడింది. రూపాయి విలువ గత ముగింపు 95.4700తో పోలిస్తే 95.3200వద్ద ట్రేడైంది. ఆగస్టు 5,2026 డెలివరీకి ఎంసీఎక్స్ బంగారం ఫ్యూచర్స్ ధర 0.74 శాతం తగ్గి 10 గ్రాములకు రూ.1,44,222కు చేరింది. ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన షేర్లుటాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ షేరు 0.90 శాతం పెరిగింది. ఇండియన్ బ్యాంక్ షేరు 10.11 శాతం ఎగసింది. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 2.43 శాతం లాభపడింది. ముత్తూట్ మైక్రోఫిన్ షేరు 13.19 శాతం జంప్ చేసింది. ఆనంద్ రాఠీ వెల్త్ 2.12శాతం పెరిగింది. హ్యుందాయ్ ఇంజినీరింగ్ అండ్ కన్స్ట్రక్షన్ నుంచి అంతర్జాతీయ కాంట్రాక్టు దక్కడంతో అయాన్ ఎక్స్ఛేంజ్ ఇండియా షేరు 17.38శాతంఎగిసింది. నికర లాభం 59.9 శాతం తగ్గడంతో ఐమ్‌కో ఎలెకాన్ షేరు 1.72 శాతం పడిపోయింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నుంచి రూ.18.54 కోట్ల విలువైన వర్క్ ఆర్డర్ పొందడంతో రైల్‌టెల్ కార్పొరేషన్ షేరు 2.31 శాతం పెరిగింది. సుమారు 51.98 మిలియన్ డాలర్లు విలువైన అంతర్జాతీయ ఆర్డర్ దక్కడంతో హెచ్ఎఫ్‌సీఎల్ షేరు 0.57 శాతం లాభపడింది. ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్‌లో ప్రమోటర్లకు చెందిన 41.33 శాతం వాటాను రూ.1,550 కోట్ల నగదు ఒప్పందంతో కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించడంతో అపోలో మైక్రో సిస్టమ్స్ షేరు 2.57 శాతం పెరిగింది. ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ షేరు 3.92 శాతం క్షీణించింది.

## ఐదేళ్లలో 5 వేలు జీసీసీలు సాధ్యమే




కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ, జులై 10:** దేశంలో 2030 నాటికి ఐదువేల గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు ఏర్పాటు చేయాలన్న లక్ష్యం సాధ్యమేనని, వాస్తవికమైనదేనని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. జీసీసీల తదుపరి విస్తరణ మెట్రో నగరాలకే పరిమితం కాకుండా రెండు, మూడోశ్రేణి నగరాలకు విస్తరించడంపైనే ఆధారపడి ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. సీఐఐ నిర్వహించిన జాతీయ జీసీసీ బిజినెస్ సమ్మిట్‌లో ప్రసంగించిన కేంద్ర ఆర్థికమంత్రి.. ప్రపంచంలోని ఫార్చ్యూన్2000 కంపెనీలలో దాదాపు మూడింట రెండొంతుల సంస్థలు ఇంకా భారత్‌లో జీసీసీలను ఏర్పాటు చేయలేదని, దీంతో ఈ రంగంలో వృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇటీవలి కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన పలు విధానపరమైన సంస్కరణలు జీసీసీల విస్తరణకు ఊతమిస్తాయని తెలిపారు.

ట్రాన్స్‌ఫర్ ప్రైసింగ్ విధానాన్ని సరళీకరించడం, సేఫ్ హార్బర్ నిబంధనలను విస్తరించడం, అడ్వాన్స్ ప్రైసింగ్ మెకానిజాన్ని వేగవంతం చేయడం, సిటీ ఎకనామిక్ రీజియన్లు, యూనివర్సిటీ టౌన్‌షిప్‌లు, అర్బన్ చాలెంజ్ ఫండ్ వంటి చర్యలు జీసీసీల పెట్టుబడులను ఆకర్షించేందుకు దోహదపడతాయని నిర్మలా సీతారామన్ చెప్పారు. జీసీసీలు కేవలం అగ్రశ్రేణి నగరాలకే పరిమితం కావొద్దని పేర్కొన్న సీతారామన్, చండీగఢ్, వారణాసి, విశాఖపట్నం వంటి నగరాలు కూడా జీసీసీ కేంద్రాలుగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం దాదాపు 10 రాష్ట్రాలు ప్రత్యేక జీసీసీ విధానాలను ప్రకటించాయని ఈ సదస్సులో 14కు పైగా రాష్ట్రాలు పాల్గొనడం ప్రాంతీయ ప్రభుత్వాల ఆసక్తిని ప్రతిబింబిస్తోందని ఆమె తెలిపారు. విజ్ఞాన ఆధారిత పరిశ్రమలకు అనుకూలమైన ప్రత్యేక పారిశ్రామిక వాతావరణాన్ని రూపొందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రులు, ఆర్థిక మంత్రులతో భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) సమన్వయం చేసుకోవాలని ఆమె సూచించారు.

దేశంలోని జీసీసీలు ఏటా సుమారు 100 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జిస్తున్నాయని వెల్లడించారు. ఇప్పటికే ఫోర్బ్స్2000 జాబితాలోని 500కుపైగా కంపెనీలున్నాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న జీసీసీలలో దాదాపు సగం భారత్‌లోనే ఉండగా, రోజుకు సగటున ఒక కొత్త జీసీసీ దేశంలో ప్రారంభమవుతోందని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రారంభమవుతున్న కొత్త జీసీసీలలో సగానికి పైగా కృత్రిమ మేధ (ఏఐ) ఆధారితంగా పనిచేస్తుండటంవిశేషమని కేంద్రమంత్రి చెప్పారు.




## మ్యూచువల్ ఫండ్లలో 29వేల కోట్ల పెట్టుబడులు

**న్యూఢిల్లీ, జులై 10:** దేశీయంగా చురుకుగా ఉన్న ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు పెరిగాయి. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా ఆంఫీ విడుదల చేసిన డేటాచూస్తే జూన్‌లో యాక్టివ్ ఈక్విటీ ఫండ్లలో రూ.28,973.41 కోట్ల నికర పెట్టుబడులు నమోదయ్యాయి. మే నెలలో ఈ మొత్తం రూ.22,907.77 కోట్లుగా ఉంది. ఈ ఏడాది ఇప్పటివరకు నమోదైన అత్యల్ప నెలవారీ ఈక్విటీ పెట్టుబడులు మే నెలలోనే నమోదయ్యాయి. మొత్తం మ్యూచువల్ ఫండ్ పరిశ్రమలో నికర ఉపసంహరణలు జూన్‌లో రూ.52,948.78 కోట్లకు తగ్గగా, మేలో అవి 64,021.17కోట్లుగా ఉన్నాయి. జూన్ నెలలో దాదాపు అన్ని ఈక్విటీ విభాగాల్లోనూ పెట్టుబడులు పెరిగాయి. ముఖ్యంగా మిడ్‌క్యాప్ ఫండ్లు పెట్టుబడిదారులను అత్యధికంగా ఆకర్షించాయి.

లార్జ్‌క్యాప్ ఫండ్లలో జూన్‌లో రూ.2,067.48 కోట్ల నికర పెట్టుబడులు నమోదయ్యాయి. మేలో ఈ మొత్తం రూ.1,592.93 కోట్లుగా ఉంది. మిడ్‌క్యాప్ ఫండ్లలో జూన్‌లో రూ.6,090.17 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. మేలో ఇవి రూ.4,385.06కోట్లుగా నమోదయ్యాయి. స్మాల్‌క్యాప్ ఫండ్లలో జూన్‌లో రూ.5,601.96 కోట్ల నికర పెట్టుబడులు నమోదయ్యాయి. అంతకుముందు నెలలో రూ.6,263.56 కోట్లుగా ఉండటంతో స్వల్ప తగ్గుదల కనిపించింది. ఫ్లెక్సీక్యాప్ ఫండ్లలో జూన్‌లో రూ.5,231.31 కోట్ల పెట్టుబడులు నమోదుకాగా, సెక్టోరల్, థీమాటిక్ ఫండ్లలో కూడా పెట్టుబడులు పెరిగి జూన్‌లో రూ.1,469.26 కోట్లకు చేరాయి. డెట్ మ్యూచువల్ ఫండ్లలో గత నెలలో రూ.1.09 లక్షల కోట్ల నికర విత్‌డ్రాలున్నాయి. ఓవర్‌నైట్ ఫండ్ల నుంచి జూన్‌లో రూ.10,579.58 కోట్లు విత్‌డ్రాకాగా లిక్విడ్ ఫండ్ల నుంచి రూ.42,293.29 కోట్ల నికర ఉపసంహరణలు నమోదయ్యాయి. హైబ్రిడ్, ప్యాసివ్ ఫండ్ల పరిస్థితిహైబ్రిడ్ పథకాలలో జూన్‌లో రూ.12,892.76కోట్ల నికర పెట్టుబడులు నమోదయ్యాయి. మేలో ఇవి రూ.16,538.47 కోట్లుగా ఉన్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.